# గోరంతదీపము



మల్లాప్రగడ రామారావు

# గోరంతదీపము

(కథల సంపుటి)

మల్లాప్రగడ రామారావు

మల్లాప్రగడ ప్రచురణలు

పూణే

**గోరంత దీపము (కథల సంపుటి)**

ప్రతులు : **1000**

ప్రథమ ముద్రణ : శ్రీ సర్వధారి ఉగాది (చైత్ర శుద్ధపాద్యమి)

హక్కులు : రచయితవి

అక్షరాల కూర్పు : **జాగృతి గ్రాఫిక్స్**
3-4-228/4/1 జాగృతి భవనం,
కాచిగూడ, హైదరాబాద్-27, ఫోన్:27562625

ముఖచిత్రం : **గోపాలకృష్ణ**

ముద్రణ : **ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
1-1-191, చిక్కడపల్లి, హైదరాబాద్,
ఫోన్:27664525, E-mail: akruthioffset_kiran@yahoo.co.in

ప్రచురణ : **మల్లాప్రగడ ప్రచురణలు**
పూణే

ప్రతులకు : **మల్లాప్రగడ రామారావు**
ఏ- 9, సాయివిహార్ రెసిడెన్సీ,
సుస్ రోడ్, పాషాణ్,
పూణే-411 021, మహారాష్ట్ర
దూరవాణి - 09860879532, 020-25870083

**సాహిత్యనికేతన్**
3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా,
హైదరాబాద్-27, ఫోన్: 040-27563236

**సాహిత్యనికేతన్**
ఏలూరు రోడ్, గవర్నరుపేట,
విజయవాడ-2, ఫోన్: 0866-6667421

వెల : రూ. 50/-

# అంకితం



"గోరంతదీపము" కథానాయకుని లాగానే, మాకు దూరంగా కొన్నేళ్ళు, మాతో కలసి కొన్నేళ్ళు తానెన్నుకొన్న గ్రామంలో ఉండి, ఆ గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసిన మా అప్పగారు (మా నాన్నగారిని అలాగే పిలిచేవాళ్ళం) కీ॥శే॥ మల్లాప్రగడ సూర్యారావు గారికీ, తన వాళ్ళందరినీ (భర్తా, అత్తమామలు, కూతుళ్ళూ, అల్లుళ్ళు, కొడుకు, కోడలు, మరుదులు, తోడికోడళ్ళూ, ఆడపడుచులు, వారి భర్తలూ, వారందరి పిల్లలూ) సంతోషంగా ఉంచడమే తన కర్తవ్యంగా బ్రతికిన మా అమ్మ కీ॥శే॥ సూర్యకాంతం (సూరీడమ్మ) గారికి.

అబ్బాయి
మల్లాప్రగడ రామారావు

# సహృదయ వందనం

అసలు తప్పు నాదే. అచ్చయిన నా కథల ప్రతులు నేను భద్రపరుచుకోలేదు. కాదేమో. "భద్ర" పరుచుకోవాలన్న ప్రయత్నంవల్లే పోగొట్టుకున్నానేమో! "విశాఖ సాహితి" మిత్రు లొకరు, మాటల సందర్భంలో, తన అచ్చయిన కథలన్నీ "బైండ్" చేయించి, భద్రంగా ఉంచానని చెప్పేరు. నేనూ అలాగే చేసాను. దాంతో, నా కథలు చదవాలని అడిగినవారికి ఆ "బైండ్" పుస్తకం ఇచ్చేవాళ్ళం. అలా తీసుకువెళ్లిన వారెవరో, దాన్ని ("సాహితీ వేదిక" రాజమహేంద్రి, మిత్రుడు శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ గారి మాటల్లో చెప్పాలంటే) "నొక్కేసారు."

అలా పోయిన కథల ప్రతులలో కొన్ని, "విశాఖసాహితి" అప్పటి అధ్యక్షుడు కీ.శే.గణపతిరాజు అచ్యుతరామరాజుగారి ఇంటి నుండి సేకరించి, సంచీలో భద్రంగా ఉంచి, నా ఆప్తమిత్రుడూ, బావమరిదీ, శ్రీపమిడిపర్తి రఘురామయ్య గారి ఇంటికి వెళ్ళడానికి, విశాఖ "చావుల మదుం" వద్ద సిటీబస్సు ఎక్కి, పైడి తల్లెమ్మ గుడి స్టాప్ వద్ద దిగేసరికి, (నమ్మాలి మీరు) సంచీలో కాగితాలు మాయం!

"విశాఖసాహితి" కార్యదర్శిగా, "సాహితీవేదిక" సమావేశకర్తగా, కథల సంకలనాలూ కవితల సంకలనాలూ ప్రచురించడంలో పాలుపంచుకున్నానేగాని, పోయిన నా కథల ప్రతు లయినా సంపాదించే ప్రయత్నం చెయ్యలేదు–ఒక్కసారి తప్ప. ఆ ఒక్కసారీ, కారణాలకేంగానీ, కార్యం నెరవేరలేదు. కడకి, 2006 ఫిబ్రవరిలో పదవీ విరమణచేసిన తరువాత తీరికగా, నా కథల సేకరణ ప్రయత్నం ప్రారంభించేసరికి, 1970 దశకంలో నా కథలు ప్రచురించిన పత్రికలన్నీ, ఒక్క 'స్వాతి' మాసపత్రిక తప్ప (తెలుగువారి సాహిత్యాభిమానానికి సాక్ష్యంగా) మూతపడ్డాయి.

ఎలాగైతేనేం, కొందరు మిత్రుల సహాయసహకారాలవల్ల(మనం అడిగిన వాళ్ళందరూ

మనకి సహాయపడలేరు కదా!) ఈ సంకలనంలో చేర్చాలని భావించిన 20 కథలలో 17 సంపాదించగలిగాను. ఆ సహృదయులందరికీ నా వందనాలు. **మరీ ముఖ్యంగా-**

తమ వద్ద ఉన్న నా కథలు ప్రచురించిన పత్రికల నుండి, ఆ కథల ప్రతులు తీయించి పంపించిన -

- "కథా నిలయం" వ్యవస్థాపకులూ, తెలుగుకథను మలుపు తిప్పిన విశిష్ట కథకులూ డా॥కాళీపట్నం రామారావు గారికీ,
- "జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు", కరస్పాండెంటూ, ప్రసిద్ధ కథకులు శ్రీ భమిడిపాటి రామ గోపాలం గారికీ,
- "సారస్వత నికేతనం", వేటపాలెం, నిర్వాహకులకీ
- "స్వాతి" పత్రిక సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్ గారికీ
- "ఆంధ్రప్రభ" దినపత్రిక సంపాదకులుకూ
- 'విశాఖసాహితి'మిత్రులూ, ప్రముఖ కథకులూ, శ్రీ అంగర వెంకటశివప్రసాదరావు గారికీ, శ్రీ ఆదూరి వేంకటసీతారామమూర్తి గారికీ, శ్రీ నవులూరి వేంకటేశ్వరరావు గారికీ,
- మాట సాయంచేసిన పాత్రికేయమిత్రులు శ్రీ రాకా సుధాకరరావు గారికీ,
- కథల సంపాదనలో నాకెంతో సహాయపడిన, 'సాహితీవేదిక' మిత్రులు శ్రీ పంచాంగం సురేష్‌బాబు గారికీ, నా చిరకాల మిత్రులు, తిరుపతి వాస్తవ్యులు

  శ్రీ ముప్పురు దుర్గయ్య గారికీ, వారి స్నేహితులు శ్రీ పేరిందేటి గంగాధర్ గారికీ
- మళ్ళీ సంపాదించిన కథలు మరోసారి పోకుండా భద్రపరచిన "పాషాణ్ తెలుగు సంఘం" మిత్రులు, రచయిత డా॥తాతిరాజు వేణుగోపాల్ గారికీ,

**మరోసారి నా కృతజ్ఞాభివందనాలు.**

✪ ✪ ✪

ఇక పుస్తక ప్రచురణ విషయానికి వస్తే...

- అన్నివిధాలా నాకు అండగా నిలచిన నా శ్రేయోభిలాషీ, 'జాగృతి' వారపత్రిక పూర్వ సంపాదకులు శ్రీ పెరుమారెడ్డి వేణుగోపాలరెడ్డి గారికీ,
- ఆత్మీయమిత్రులు 'జాగృతి' ప్రస్తుత సంపాదకులు డా॥వడ్డివిజయసారథి గారికీ

నేనెంతో ఋణపడి ఉన్నాను.

◆ నా కథల జిరాక్సు ప్రతులలో కొన్ని పదాలు, స్పష్టంగా లేకున్నా, నా అధ్వాన్నపు చేతి వ్రాతతో ప్రూఫ్‌లుదిద్దినా, ఓపిగ్గా "అచ్చుప్రతి" తయారుచేసిన 'జాగృతిగ్రాఫిక్స్' శ్రీ వినోద్‌నారాయణచిక్షే,

◆ అర్థస్ఫోరకమైన చిత్రంతో ముఖపత్రం తీర్చిదిద్దిన శ్రీ గోపాలకృష్ణ గారికీ,

◆ పుస్తకం చక్కగా ముద్రించిన 'ఆకృతి ప్రింటర్స్' అధినేత శ్రీ తోట కిరణ్ గారికీ

◆ నా కథలను ప్రచురించిన ఆయా పత్రికాధిపతులకు **నా కృతజ్ఞతలు.**

– మల్లాప్రగడ రామారావు



# ముందుగా

**నా** కథలు పుస్తక రూపంలో తీసుకురావాలనే ఆలోచనకు పునాది నవంబర్ 1998న నా కందిన ఉత్తరంలోని ఈ వాక్యం : "నాకు చాలాకాలంగా కోరిక – మీవీ, శ్రీ నవులూరి వెంకటేశ్వరరావువీ, కథలు పుస్తక రూపంలో తేవాలనో, చూడాలనో."

ఆ సంకల్పం ఆచరణలో పెట్టాలని నేను, 2007లో ఆ ప్రయత్నం ప్రారంభించగానే నాకు ఉత్సాహ, ప్రోత్సాహాలు అందించిన వారూ, కథల ప్రతుల సేకరణలో ఎవరిని సంప్రదిస్తే ఫలితముంటుందో తెలియజెప్పినవారూ,

ప్రచురణ కార్యక్రమం చేపట్టగానే "మీ కథాసంకలన ప్రచురణలో నేనూ ఓ చెయ్యి వేస్తానని" మాటిచ్చి, పేజి కంపోజింగ్ మొదలు ముద్రణకు సంబంధించిన ప్రతి విషయంలోనూ మార్గదర్శనం చేసిన వారూ,

"భరాగో"గా జగమెరిగిన రచయితా, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతా, శ్రీ భమిడిపాటి రామగోపాలంగారు

వారికి నా ప్రత్యేక కృతజ్ఞతాభివందనములు.

– రచయిత

# కథాక్రమం....


| | | |
|---|---|---|
| 1. | చుట్టలు | 11 |
| 2. | ఒరులేయవి | 17 |
| 3. | ఉదయం | 25 |
| 4. | ముసుగు | 33 |
| 5. | మనకొద్దీ మంచితనం | 39 |
| 6. | గోరంత దీపము | 47 |
| 7. | సదసత్సంశయం | 56 |
| 8. | బొమ్మలాంతరు | 62 |
| 9. | చచ్చిపోయాను కాను | 67 |
| 10. | ఎన్నాళ్ళు ఇంకా? | 70 |
| 11. | ఎదురు తిరిగిన అలలు | 75 |
| 12. | ఇఫ్ వెల్త్ ఈజ్ లాస్ట్.... | 79 |
| 13. | మహాభినిష్క్రమణం | 85 |
| 14. | దిగులు | 96 |
| 15. | మరి, మికెలా కనబడుతోంది లోకం? | 102 |
| 16. | కళ్యాణం | 108 |
| 17. | ముగింపు | 110 |

# చుట్టలు

ఠం గు ఠంగున గడియారం ఆరుగంటలు కొట్టింది. కృష్ణమూర్తి తలెత్తి కిటికీలోంచి చూసాడు. చీకటిలో నల్లగా కన్పిస్తున్న సముద్రం. దూరాన దీపాలు మాత్రం కన్పిస్తున్న ఓడలు. పెన్నుకి కేప్ తగిలించి, ఫైళ్ళ వంక చూసాడు. చిరాగ్గా వుంది. సెక్షన్‌లో అందరూ వెళ్ళిపోయారు. ఫైళ్ళు మూసేసాడు. కిటికీ తలుపులు వేసి, లైటార్పి, తలుపు తాళం వేసాడు. పైన "షిప్పింగ్ సెక్షన్" మాత్రం తెరచిఉంటుంది. తాళాలు షిప్పింగ్ క్లార్క్ కిచ్చిరావాలి. మెట్లవంక చూసాడు. కాళ్లు బలవంతాన యీడ్చుకుంటూ పైకి వెళ్ళి తాళాలిచ్చి, క్రిందకు దిగాడు.

ఠంగు ఠంగున వేంకటేశ్వరస్వామివారి ఆలయగంటలు మ్రోగాయి. గోపురంవైపు తిరిగి, లెంపలు వేసుకొని నమస్కరించాడు. "కలదు కలండనెడు వాడు కలడో లేడో!"

కృష్ణమూర్తి నడుస్తున్నాడు. సముద్రపు గాలికి ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. నెత్తిమీద ఖాళీ గంపలుంచుకొని యీరాడవెళ్ళే జనం పల్లెపదాలు పాడుకుంటూ నడుస్తున్నారు. ఒక్కటే కుక్క రోడ్డుమీద నిల్చుని, దీనంగా మొరుగుతున్నది. దారిప్రక్కన ఉన్న క్వార్టర్సు లోంచి వినబడుతున్న పాశ్చాత్య సంగీతం వింటూ నడుస్తున్నాడు కృష్ణమూర్తి. ఎవరో ఇద్దరు - మొగుడూ పెళ్ళాలు కాబోలు - నవ్వుకొంటూ, రాసుకొంటూ కోవెలవేపు వెళ్తున్నారు.

ఎదురుగుండా వస్తున్నప్పుడు చూస్తే బాగుండదని, సముద్రపు నీటివేపు చూస్తూ నడక సాగించాడు. నవ్వుల ధ్వని అతని వెనుక నుంచి వినిపించినపుడు, వెనుదిరిగి చూసాడు. ఆమె జడలో పూలు నవ్వుతూ కన్పించాయి. అతని మనస్సు ఒక్కసారి గతంలోకి పరుగులు తీసింది. అప్పుడు కాలేజీలో బి.యస్సీ. చదివేవాడు కృష్ణమూర్తి. అతని క్లాసులో అమ్మాయిల కన్నా కూడా అతను వయసులో చిన్నవాడు. అతనిపట్ల అతని సహాధ్యాయినుల మనోభావాలెట్లా వుండేవో అతనికి తెలియదు. అతనికి తెల్సిందల్లా మంజుల. మంజుల, కృష్ణమూర్తి ఒక సాయం సమయాన, కాకతాళీయంగా, వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కలుసుకొని పలకరించుకోడమూనూ. స్వామివారి ముందు చేతులు జోడించి నిల్చున్న అతని ప్రక్కనే మంజుల నిలబడింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ మెట్లుదిగారు. కొంతదూరం నడిచి, విక్టోరియారాణీ విగ్రహం దగ్గర చీలిన రోడ్లవద్ద విడిపోయారు.

అదంతా కృష్ణమూర్తి మనసులో కదలాడింది. ఆ సామాన్య సంఘటన మనస్సులో యిన్నాళ్ళూ ఏ మూల దాగి ఉండి, ఇప్పుడు బయటికి వచ్చిందో మరి. అతను ఆశ్చర్యం నుంచి తేరుకొని నవ్వుకొన్నాడు. నడుస్తున్నాడు. చలి గాలి భుజాల దగ్గర చిరిగిపోయిన బుష్షర్టులోంచి చర్మాన్ని స్పృశిస్తోంది. ఆకలిగా ఉంది. ఎడమకాలి ఆకుజోడు మడమ పూర్తిగా అరిగిపోయింది. అరిపాదం చివర, చల్లని రోడ్డును తాకుతున్నది. కంకర గుచ్చుకొంటున్నది.

కృష్ణమూర్తి ఆలోచనలు యింటివేపు మళ్లాయి. ఇల్లు. ఆ ఇంట్లోకి వెలుతురు రాదు. గాలిరాదు. వానపడితే మాత్రం ఇల్లంతా వరద. ఇల్లు జ్ఞాపకం రాగానే కృష్ణమూర్తికి భయం వేసింది. అది కట్టించి ఏ నూరేళ్ళో అయి ఉంటుంది. అప్పట్నించి దాన్ని ఎవరూ బాగు చేయించిన పాపాన పోలేదు. ఆ యింట్లో ఏడు కుటుంబాల వాళ్లున్నారు. భర్త చచ్చిపోయిన ఒంటరి పంతులమ్మ. భార్య చచ్చిపోయినా, మిగిలిన ముసలి తల్లి, కొడుకూ కూతుళ్ళను పోషించడానికి, పక్షవాతం వచ్చి లాగేసిన కాలుతో రోజూ రిక్షామీద బడికెళ్ళే మాష్టారు. గంపెడు సంతానం, గయ్యాళి భార్యతో, ఉభయసంధ్యలా పూజ చేసుకుంటూ పొద్దుపుచ్చే, ఎలక్ట్రిసిటీ ఆఫీసులో గుమాస్తా. రిటైరైపోయిన ఎన్.జి.ఓ. ఏళ్ళు పైబడినా పెళ్లికాని ఆయన కొడుకులూ, కూతుళ్ళూ. రెండో పెళ్ళాంమాట జవదాటకుండా తెల్లారగట్లే లేచి, అంట్లు తోముకుని, కాఫీ పెట్టి, పిల్లలకు స్నానాలు చేయించి, పెళ్ళాన్ని లేపి, అందరూ లేచే వేళకి సైకిలు తుడుస్తూ దాబుగా కూర్చునే రైల్వేగుమాస్తా. ఆ యిల్లు "ఆయన స్వంతమేమో" అని అనుకొన్నాడు కృష్ణమూర్తి, మొదట్లో, అతని దాబుచూసి. రిట్రెంచిమెంట్లో ఉద్యోగంపోయి, ఆ విషయం గుండె జబ్బుకల తల్లికి తెలియపర్చకుండా కాలం వెళ్ళబుచ్చాలని నానా యాతనపడుతున్న బ్రహ్మచారి. ఏడోవాటా కృష్ణమూర్తిది.

ఆ యిల్లు క్షణం రణరంగంలా వుంటుంది. మరుక్షణం రంగవల్లిలా వుంటుంది. మనుష్యుల్లో అంత నీచత్వం వుంటుందని కృష్ణమూర్తి కిదివరకు తెలియదు. వీధి సందు వచ్చేసింది. భట్రాజువారి వీధి. వీధి మొదటింట్లోంచి ఆర్కెస్ట్రా రిహార్సల్సు చేస్తున్న ధ్వని. మేడమీద నిలబడి కురులు దువ్వుకుంటున్న కోమలాంగి. ఆమె పేరు తెలియదు కృష్ణమూర్తికి. నాట్యం చేస్తుందిట. ఎప్పుడేనా చూస్తే బాగుండును. ఎంచక్కని, తెల్లని, నున్నని ఒళ్ళు, మేడ మీదికి చూశాడు. వీధి దీపంకాంతిలో ఆమె మెడలోని హారం మెరుస్తున్నది. పెదవుల మీద దరహాసం. ఆమె కూడా కృష్ణమూర్తివేపు చూసింది. ఇద్దరి కళ్ళు కలుసుకొన్న సమయాన అతని ఒళ్లు వెచ్చబడింది. గుండెలు దబదబా కొట్టుకున్నాయి. గాభరాగా చూపును మరల్చు కొన్నాడు. వెనక నుంచి నవ్వు వినబడింది. ఆ నవ్వు తరుముకొస్తున్నట్లు గబగబా యింటివేపు నడిచాడు. ఇల్లంతా గోలగా వుంది. చీకటిగా వుంది. పిల్లలంతరూ చేరి చీకట్లో గోల

చేస్తున్నారు. కరెంటుపోయింది. కృష్ణమూర్తి వాళ్ళ వాటాలో ప్రవేశించాడు.

గుమ్మం దాటుతుంటే "ఎవరు నాయనా కృష్ణుడేనా?" కళ్ళకు చేతినడ్డం పెట్టుకొని, దగ్గరగా నిలబడి చూడ్డానికి ప్రయత్నిస్తూ, అతని మామ్మ అడిగింది. "కృష్ణుడేలేవే" అతని మేనత్త, చీడీలో కూచున్నావిడ, జవాబిచ్చింది.

"అమ్మా, అన్నయ్యొచ్చాడు" చెల్లెలు కేకేస్తూ వంటగదిలోకి పరుగెత్తింది. కృష్ణమూర్తి పేంటు, చొక్కా విప్పుకుని, లుంగీ కట్టుకున్నాడు. ఇత్తడి గ్లాసుతో కాఫీ పట్టుకుని అమ్మ వచ్చింది. కృష్ణమూర్తి కాఫీ కొంచెం చప్పరించి "పంచదార లేదా" అన్నాడు కసురుతున్నట్లు. అమ్మేదో చెప్పబోయింది. అతను విన్లేదు. "చాల్లే" అంటూ మిగతా కాఫీ అంతా కోపంగా ఒక్క గుక్కలో త్రాగేశాడు.

చిన్నక్క దేవుడి విగ్రహాల కెదురుగా కూర్చుని నూనె దీపం వెలుగులో చదువు కుంటోంది.

"ఏం కిరసనాయిలు లేదా?" ఎవరూ మాటాల్లేదు. కృష్ణమూర్తికి తెలుసు. ఇంట్లో బియ్యం లేవు. నూనె లేదు. కూరల్లేవు. కిరసనాయిల్లేదు. అగ్గిపెట్టేనా లేదు. అయినా అడిగేడు. కృష్ణమూర్తికి చిరాకు లావయింది. తలనొప్పి ఆరంభించింది. ఆకలేస్తున్నది. టిఫినేదీ ఉన్నట్టు లేదు. "వంట అయితే బాగుండును తినేద్దాం" అనుకున్నాడు.

"తల్లీ వంట అయిందా?" అని చెల్లిని ప్రశ్నించాడు. అన్నయ్య కోపంగా ఉండటం చూసి, అంతవరకూ మాట్లాడని చెల్లి, లేదన్నట్టు తలూపి "పెద్దక్క ఉత్తరం రాసిందన్నయ్యా. పురిటికి ఇక్కడకు వస్తుందిట. మరేమో ఆదివారం బయల్దేరుతుందిట" అంది. కృష్ణమూర్తి మాట్లాడలేదు.

ఆదివారం ఇంకా మూడు రోజులుంది. లెక్కేసాడు. మామ్మ, పెద్దత్త, చిన్నక్క, అమ్మ, నాన్న, చెల్లి, తను. ఏడుగురు. పెద్దక్క వస్తుంది. ఇద్దరైనా పిల్లలు వస్తారు. ఇంట్లో బియ్యంలేవు, నూనెలేదు. అగ్గిపెట్టెలు కూడా లేవు. నూనె దీపం నుండి ప్రసరిస్తున్న కాంతి మినహాయించి గదంతా చీకటిగా వుంది.

ఆకలి సన్నని మంటలాగ బయల్దేరింది కడుపులో. ఆఫీసు నొకసారి జ్ఞాపకం తెచ్చు కున్నాడు. ఇంకా వున్నాయి. "పుటప్ చెయ్యవలసిన నోట్సు", ఎస్.ఆర్.ఎంట్రీలు. మెడికలు ఎగ్జామినేషన్‌కి పంపవలసినవాళ్ళ వివరాలు తీసుకొని ఫారాల్లో నింపాలి. తలనొప్పి తీవ్రం కాసాగింది. చర్చిగంటలు, ఏడుసార్లు మ్రోగాయి. "తల్లీ అప్ప రాలేదమ్మా" చెల్లినడిగాడు కృష్ణమూర్తి. వాళ్ళింట్లో తండ్రిని "అప్ప" అంటారు. "లేదన్నయ్యా" అంది చెల్లి. "అదుగో వస్తున్నారు" వీధిలోకి చూస్తూ, చీడీలో కూర్చున్న పెద్దత్త చెప్పింది. ఆయన గదిలోకి రాగానే, కృష్ణమూర్తి చీడీమీదకు వెళ్ళిపోయాడు. అదెలా ప్రారంభమయిందో కృష్ణమూర్తికి జ్ఞాపకం

లేదు. ఆయన వున్న గదిలో అతను వుండడు. అతను గదిలో వుంటే ఆయన గదిలోనికి రారు.

"ఏంవోయి! ఎలా వుంది పని. ఒళ్లు దగ్గర పెట్టుకొని చేస్తున్నావా?" రైల్వే గుమస్తా సిగరెట్టు కాలుస్తూ ప్రశ్నించాడు. కృష్ణమూర్తి నిశ్శబ్దంగా తలూపాడు.

"చిన్నవాడా! చితకవాడా! ఏమిటండీ మీ ప్రశ్న" అతని భార్య తలుపుచాటు నుండి బయటకొస్తూ ప్రశ్నించింది.

"అది కాదమ్మీ! ఆ మాత్రం దబాయించకపోతే ఈ కాలం కుర్రకారు లొంగరు" రెండువేళ్ళ మధ్య సిగరెట్ బిగించి, దమ్ము గట్టిగాలాగుతూ, అతను జవాబిచ్చాడు. "అనవసర ప్రసంగాలు చెయ్యక మీపాటేదో మీరు పడండి" ఆవిడ విసురుగా లోపలికి పోయింది. అతను మరి మాట్లాడలేదు. కృష్ణమూర్తి కొంచెం నవ్వుకున్నాడు.

"అన్నయ్యా" గొంతు విని వెనక్కు తిరిగాడు. గుమ్మంవద్ద చెల్లి నిల్చొని వుంది. గదిలోకి వెళ్ళి, "ఏమ్మా" అని ప్రశ్నించాడు. చెల్లి మాట్లాడలేదు. కృష్ణమూర్తి చిరాగ్గా మొహం పెట్టాడు. "మరేమో అప్పుకు చుట్టల్లేవన్నయ్యా" జంకుతూ చెప్పింది. "ఉదయం ఎందుకు చెప్పలేదు?" కృష్ణమూర్తి కోపంగా అడిగాడు. "ఉదయం కిసనాయిల్‌కి డబ్బు అడిగితే లేదన్నావు కదా." "నోర్మూయ్. ఉదయం చెపితే ఏమఘోరిద్దునో" ధుమధుమ లాడాడు. అతనికి తెలుసు. ఉదయం చెప్పినా తనంతకన్నా ఏం చెయ్యలేదు. కిరసనాయిలు గురించి, బియ్యం గురించి, అతనికి జ్ఞాపకం వుంది. చుట్టలు ఆ పూటకి ఉండవని అనుకోలేదు. కాని అవీ, ఇవాళో, రేపో అయిపోతాయని అతనికి తెలుసు. ఆఫీసుకి వెళ్తున్నప్పుడు, భోజనాల సమయంలోనూ, అతనికివన్నీ గుర్తున్నాయి. కాని అప్పెలా అడగాలో కృష్ణమూర్తికి తెలియదు. కిందా మీదా పడుతూ, ఉండీ లేక ఏదోవిధంగా బి.యస్సీ చదివినప్పుడు కూడా అతనెలా అప్పుచేయాలో నేర్చుకోలేదు. ఇంట్లో అప్పో సప్పో చేయవలసి వస్తే అమ్మే చూసుకొంటుంది. "ఎవర్నైనా అడగలేకపోయారా? అందులో మళ్ళీ నామోషీ" గొంతు తగ్గించి అన్నాడు. "ఎవ్వరూ ఇవ్వలేదు" అభిమానంగా అంది చెల్లి.

కృష్ణమూర్తి మాట్లాడలేదు. "చుట్టల్లేవు. అప్పకి చుట్టల్లేవు." ఆ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. చుట్టూ చూసాడు. ఏం చెయ్యాలో అర్థంకాలేదు. అన్నం తింటూన్న అప్పవేపు చూసాడు. మాసిన ఖద్దరుపంచ, లాల్చీ. పెరిగిన గడ్డం, గంభీరమైన శరీరం. కృష్ణమూర్తి మనస్సు బాల్య స్మృతులను తవ్వుకొనసాగింది. చిన్నప్పుడు ఆయన ఇంటిదగ్గర ఉండడమే అపూర్వం. ఇంటి నిండా మనుష్యులు. ఇంట్లోవాళ్ళు, బంధువులు, అతిథులు, అభ్యాగతులు, నౌకర్లు. అంత పెద్ద ఇల్లు. ఎంతో సందడి. మూడడ్ల గిన్నెల్తో శనివారాలు రొట్టె కాల్చడం అతనికింకా గుర్తుంది. అప్పుడు అప్ప ఊరిలో ఉండేవారు కారు. రాజకీయాలు,

స్కూళ్లు కట్టించడం, రోడ్లు వేయించడం. ఆస్పత్రి, పశువుల ఆస్పత్రి, కోపరేటివ్ బ్యాంకు, మార్కెటింగ్ సొసైటీ తెరిపించడం, మాతా శిశు సంరక్షణాలయం, సబ్ పోస్టాఫీసు ఊరికి తెప్పించడం. ఎప్పుడూ పదిమంది "గురువుగారూ! గురువుగారూ!" అంటూ. ఆ రోజులు వెళ్ళిపోయాయి. ఇప్పుడు తన ఉద్యోగాన్ని నమ్ముకుని ఆయన యీ వూరు వచ్చేయడం, ఇక్కడ స్నేహితుడి ఫోటో స్టూడియోలో ఉదయం, మధ్యాహ్నం పేపరు చూస్తూ కూర్చుని, సాయంకాలం 7 గంటలకి ఇంటికి రావడం. కృష్ణమూర్తికి కన్నీళ్ళొచ్చాయి. ఆయన కిప్పుడు చుట్టల్లేవు. చుట్టలేందే ఆయనకి భోంచేసిన తృప్తిలేదు. తాతయ్య ఉన్నన్నాళ్ళూ అప్పటికి వీరఘట్టం నుంచి ప్రత్యేకంగా పుగాకు తెప్పించి, చుట్టలు చుట్టించడం కృష్ణమూర్తికి జ్ఞాపకం ఉంది. అంత వైభవంగా బ్రతికిన ఆయనకి చుట్టలు కొనలేకపోతున్నాడు తను. కృష్ణమూర్తికి గుండెనెవరో పిండినట్లైంది. తను చుట్టలను కొనలేకపోవడం, అంతకుమించి చుట్టలకు కూడా ఆయన తన మీద ఆధారపడవలసి వచ్చినందుకు దుఃఖం.

హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. వంగి మంచం క్రిందనున్న ట్రంకు పెట్టెలాగాడు. ఒకటొకటే బట్టలు తీసాడు. బట్టలక్రింద నీలంరంగు ఫైళ్ళలో బొత్తెడు కాగితాలున్నాయి. అవి బయటకు లాగుతుంటే కృష్ణమూర్తికి చెయ్యి వణికింది. అవి.... వాటిని గురించి తలుచుకొనడానికి అతనికి ధైర్యం చాలడంలేదు. గబగబా వాటిని గుడ్డ సంచిలో కుక్కాడు. చొక్కావేసుకొని, సంచీ చేతపుచ్చుకొని చెల్లిని పిలిచాడు. చెల్లి వచ్చింది. ఇద్దరూ చీకట్లోంచి వీధిలోకి నడిచారు. వీధి చివర నుయ్యి వుంది. నూతి చప్టానిండా ఇటికలు, చెత్తవున్నాయి. ఆ వీధిలో ఎవరో యిల్లు బాగుచేయించుకుంటున్నారు. అక్కడ కృష్ణమూర్తి ఆగాడు. చెల్లి కూడా ఆగింది. "తల్లీ ఈ కాగితాలు ప్రక్కనున్న కొట్లో అమ్మి తీసుకురా" సంశయిస్తూ, మెల్లిగా గొణిగాడు. చెల్లి తలూపి వెళ్ళింది. "తల్లీ" మళ్ళీ పిలిచాడు. చెల్లి వచ్చింది.

"పన్నెండణాలకు తక్కువైతే ఒప్పుకోకు" మెల్లని గొంతుతో హెచ్చరించేడు. "అలాగే" చెల్లి సంచీ పట్టుకు వెళ్తుంటే చూస్తూ నిల్చున్నాడు. ఆ సంచీ బరువుగా వుంది. చెల్లి ఒక ప్రక్కకు ఒరిగి నడుస్తూంది. ఆ పిల్ల వయసు ఎనిమిదేళ్ళింకా. కృష్ణమూర్తి కడుపులో దేవినట్లైంది. ఆ వయసులో తను ఎంతో సుఖంగా పెరిగాడు. వాళ్ళ కుటుంబ వైభవం చివరి దినాల్లో చెల్లి పుట్టింది. ఆమెకు ఆరేళ్లు వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. చెల్లి ఎక్కువ మాట్లాడదు. అన్నీ అర్థం చేసుకుంటుంది. అవీ యివీ కొనాలని అతన్ని బాధించదు.

"అన్నయ్యా!" చెల్లి పరిగెత్తుతూ వచ్చి నిల్చుంది. "ఏమ్మా" ఆతృతగా అడిగాడు. "పధ్నాలుగణాలిస్తానంటున్నారన్నయ్యా" కృష్ణమూర్తికి ఆనందం వేసింది. దాంతోపాటు ఆశ కూడా కలిగింది. "కొట్టుమీద ఎవరున్నారు" అని అడిగాడు సంతోషాన్నాపుకుంటూ. "మరేమో షావుకారులేదు. వాళ్ళబ్బాయి వున్నాడు. తీసుకోమంటావా?" చెల్లి ఇంకా సరదాగానే వుంది.

కృష్ణమూర్తి మాట్లాడకుండా చెల్లి కూడా నడిచాడు. ఇద్దరూ కొట్టులోనికి వెళ్ళారు.

కృష్ణమూర్తి "ఒక రూపాయికన్నా తక్కువైతే అక్కర్లేదోయ్" అన్నాడు దాబుగా, బల్లమీద కూర్చుంటూ. "రూపాయికి మూడురోజులు సరిపడా చుట్టలొస్తాయి" అని మనసులో లెక్కవేసుకున్నాడు. అప్పుడు పెద్దక్క వస్తుంది. కొంతేనా డబ్బు తీసుకొస్తుంది. నెల ఎలాగేనా గడిపేయొచ్చు. కుర్రాడు సందేహిస్తున్నాడు. ఇంతట్లో షాహుకారు వచ్చేడు. కుర్రాడిని ప్రశ్నించి బేరం గురించి తెలుసుకొన్నాడు. త్రాసులోంచి కాగితాలు తీసేస్తూ "పన్నెండణాలుకి మించి ఇచ్చేది లేదు. అక్కర్లేకపోతే పట్టుకెళ్ళండి" అన్నాడు బొంగురుగొంతు విప్పుతూ. కృష్ణమూర్తికి కోపం వచ్చింది. కాగితాలు సంచీలో పెట్టి, గిరుక్కున వెనక్కు తిరిగి, సందులోకి వచ్చేసాడు. "చుట్టలు" అంది చెల్లి. "నీ నెత్తి. నోర్మూసుకో" అన్నాడు.

"ఇంద. ఈ కాగితాలు తీసుకొని, ఇంకో దుకాణానికి వెళ్ళు" అన్నాడు సంచి అందిస్తూ. ఇంకొక్క దుకాణమే వుంది ఆ వీధిలో. ఎనిమిది దాటుతున్నది. చెల్లి మళ్ళీ వెళ్ళింది. అయిదు నిమిషాలయ్యాయి. కృష్ణమూర్తికి చెల్లి గురించి భయంవేసింది. పదినిమిషాలకి చెల్లి తిరిగొచ్చింది. "పదణాలకన్న ఎక్కువ ఇవ్వడట. తీసుకోమన్నావా?" అంది. కృష్ణమూర్తికి మళ్ళీ చిరాకొచ్చింది. వాడు కూడా మళ్ళీ వెళ్తే పదణాలు ఇవ్వ నంటాడేమోనని. "ఇందాకా యిలాగే అడిగి చంపావు, పోయి పుచ్చుకురా" చెల్లి కళ్ళనీళ్లు నింపుకుంటూ పరుగెత్తింది. కృష్ణమూర్తికి ఏడుపొచ్చింది. చెల్లి గురించి తన ఆలోచనకి, చెల్లిపట్ల తన ప్రవర్తనకీ ఈ అంతరమేమిటి? చెల్లి నాలుగోక్లాసు చదువుతోంది. తనకి లభ్యమైనదాంతోనే తృప్తిపడే చెల్లి. చెల్లిపట్లే కాదు. ఇంట్లో అందరిపట్ల తన ప్రవర్తన ఇలాగే వుంది. చెల్లి వచ్చి, చేతితో డబ్బులు పెట్టింది. సంపాదకుల దగ్గర నుండి తిరిగొచ్చినవి, సంపాదకులకు పంపడానికి కృష్ణమూర్తి ధైర్యం చెయ్యనివీ అయిన అతని స్వంత రచనల విలువ ఒక అర్ధరూపాయి, పదిపైసలు, మరొక రెండు పైసలు. కృష్ణమూర్తి చెల్లి తలమీద చేయివేసి, "ఇక్కడే ఉండు తల్లీ! చుట్టలు పట్టుకొస్తాను" అని వీధిలోకి వెళ్ళాడు. నాయరు లెక్కపెట్టి ఇచ్చిన ఇరవై చుట్టలు పట్టుకొని వచ్చాడు. ఇద్దరూ ఇంటికి వెళ్ళారు. అప్ప భోజనం ముగించి మంచంమీద దొర్లుతున్నారు. కృష్ణమూర్తికి తెలుసు. చుట్టకాల్చందే ఆయనకి నిద్రరాదు. గబగబావెళ్ళి రైల్వే గుమస్తానడిగి, అగ్గిపెట్టె తీసుకొచ్చి, చెల్లికిచ్చాడు.

చెల్లి చుట్టలు అలమార్లోపెట్టి, ఒక చుట్ట, అగ్గిపెట్టె తీసుకొని, అప్పకిచ్చింది.

"ఊ! ఊ! ఎందుకమ్మా ఇప్పుడు" అంటూనే ఆయన చుట్టపుచ్చుకున్నారు.

కృష్ణమూర్తి గదిలోంచి చీడీ మీదకు వచ్చేశాడు. "టప్" అగ్గిపుల్ల గీచిన శబ్దం. కృష్ణమూర్తి వెనక్కి తిరిగి గదిలోకి చూశాడు. అప్ప నోట్లో చుట్ట వెలుగుతోంది. పొగ గుప్పున పైకి వస్తోంది.

– ఆంధ్రజ్యోతి వారపత్రిక, **23.10.1970**

# ఒరులేయవి యొనరించిన...

"**బా**బూ!" దీనంగా - గొంతు నూతిలోంచి వచ్చినట్టుందంటారే - అలాంటి ధ్వని. మెట్లు దిగుతున్న మంగపతి, చిదంబరం - ఇద్దరూ ఒకసారి అటు చూసారు.

ఆఫీసు వరండాలో, ముడతలు పడ్డ శరీరాన్ని తెల్లగుడ్డతో కప్పుకున్న, ముఖంలో నరాలు తేలుతున్న, చూపు ఆనని కళ్ళకి ఎముకలు చెయ్యి అడ్డంపెట్టుకున్న, ముసలామె, ఆమె పక్కనే, కాలంలోనే శిథిలమైన యౌవనంలో, మరొక ఆడది - దుఃఖంతోబాటు మరో జీవిని దాచుకున్నందువల్ల, ఎత్తైన కడుపుగలది, కనబడ్డారు.

> *ఒరులేయవి యొనరించిన*
> *నరవర! యప్రియము దన మనంబునకగుఁ దా*
> *నొరులకు యవి సేయకునికి*
> *పరాయణము పరమ ధర్మపథములకెల్లన్*
> *- శ్రీమదాంధ్ర మహాభారతము, శాంతిపర్వము*

'మళ్ళీ తగలడ్డారు!' చిదంబరం గొణుక్కున్నాడు.

"ఉండవమ్మా, తెల్లారి లేచి నీ పనేనా! సవాలక్ష పనులతో చస్తుంటేను!"

ముసలామె నోరు తడిచేసుకుని ఏదో చెప్పబోయింది. అదేమీ వినిపించుకోకుండా వరండా దాటి ఆఫీసులోకి అడుగుపెట్టారు - ముందు మంగపతి, వెనక చిదంబరం. కుర్చీలో కూర్చుంటూనే మొదలుపెట్టాడు మంగపతి. "మీ నుంచి నా తల కూడా వాచిపోయింది. ఆఫీసరుగారి బిల్స్ కదా, కాస్త జాగ్రత్తగా చూడద్దండీ" అంటూ.

"అలా నిమిషాలమీద పనులు జరిగిపోవాలని తొందరచేస్తే ఒకటీ, అరా తప్పులు రాకుండా ఎలా ఉంటాయండీ? నేనూ మనిషినే కాని, యంత్రాన్ని కాను. 11 గంటలకు తిరిగి వచ్చిన బిల్స్ - అన్ని కాపీల్లోనూ కరెక్షన్స్ చేసి, సంతకం చేయించి, 11.30కే డిస్పాచ్ చేసెయ్యాలంటే...." చిదంబరం మాట పూర్తికాలేదు.

"అసలు మొదటాబిల్స్ ఎందుకు తిరిగి రావాలండీ? నౌఖరీ అంటే కాస్త జాగ్రత్త ఉండాలి. రెండురోజులు టైమ్ తీసుకున్నా ఇంకా తప్పులేనా?" మంగపతి కంఠం హెచ్చించి అంటూంటే, సెక్షనంతా వాళ్ళిద్దరి వంకే చూస్తున్నారు.

చిదంబరానికి అభిమానం వేసింది.

"నా సీటుకు సంబంధంలేని పనులన్నీ నా కంటగడితే జరిగే తప్పులకు నేను బాధ్యత వహించలేను. ఏం మీరున్నారు సెక్షన్ హెడ్... ఆ పైన హెడ్క్లర్క్, ఆఫీస్ సూపరింటెండెంట్ – ఇందరున్నారు. జీతాలు పుచ్చుకోవడమేకాని, మేం తప్పుచేస్తే చూసే దిక్కులేదు."

ఇంకా వాదన పెరగకుండా శేషగిరి అడ్డుపడ్డాడు. "ఏవో తప్పులంటూ రావడం, ఆఫీసరు చిరాకుపడడం మనకు కొత్తగనకా? మీరూరుకోండి, సార్!" అని మంగపతిని సముదాయించి, "నువ్వు తగ్గవోయ్, చిదంబరం! చిన్నా, పెద్దా చూసి మరీ మాట్లాడాలి" అని చిదంబరానికి హితవు చెప్పాడు. ఆ సెక్షన్కి మంగపతి హెడ్. చిదంబరం, శేషగిరి యు.డి.సి.లు. ఇంకా సెక్షన్లో నలుగురు లోయర్ డివిజన్ గుమాస్తాలు ఉన్నారు.

మంగపతి మరి మాట్లాడలేదు. చిదంబరం ఇన్నాళ్ళూ అక్కౌంట్స్ సెక్షన్లో ఉండేవాడు. ఈ.టి.ఎ. బిల్లులూ అవీ తయారుచెయ్యడం మిగతా వాళ్ళకు అంతగా తెలియదు. అందుచేత సెక్షన్ మారినా, అవన్నీ అతనే చెయ్యవలసి వస్తున్నది. మరొకడు మరొకడైతే... ఇంక ఆడిట్ ఆఫీసుకి రోజుకి పదిసార్లు పరుగెత్తాలి. చిదంబరానికి కూడా రెండవసారి తప్పుచేసినందుకు, ఆ తప్పు ఆఫీసరు సంతకం పెడుతూ పట్టుకున్నందుకు, సిగ్గనిపించింది. చిదంబరం మళ్ళీ బిల్స్ సరిచెయ్యడం మొదలుపెట్టాడు. గడియారం 12 గంటలు కొట్టింది. 'ఉదయం నుంచి ఈ వెధవ పనితోటే సరిపోతున్నది.' చుట్టూ చూసాడు. శేషగిరి పొడుం పీలుస్తూ వరహాల్రావుకి గీతాబోధ చేస్తున్నాడు. ఆ గీత ఏమిటో చిదంబరానికి తెలుసు – కామశాస్త్ర పరిజ్ఞానం. వరహాల్రావు తన్మయుడై వింటున్నాడు. భూపతి ఉత్తరం రాస్తున్నాడు. 'వీడికెవత్తైనా తగులుకుందేమిటి చెప్మా? తెగరాస్తాడు ఉత్తరాలు!' అని చిదంబరం ఆశ్చర్య పడ్డాడు. శ్యామలరావు దళసరి అట్ట వెయ్యబడ్డ 'రసికప్రియ' చదువుకుంటున్నాడు. విశ్వనాథం ఒక్కడూ ఏదో పనిచేసుకుంటున్నాడు. 'ఏం చేస్తాడో..... రోజల్లా పనిచేస్తూనే ఉంటాడు. టేబిలు మీద కాగితాలు మాత్రం కదలవు. అయినా, మనకెందుకులే!' చిదంబరం మళ్ళీ అంకెలు కూడసాగాడు. "పన్నెండూ నాలుగూ పదహారు, పదహారూ...."

"బాబూ!" దీనంగా, పాతాళంలోకి పడిపోతున్న మనిషి; అలా పడిపోవడం తప్పదని తెలిసీ – భయంగా, సందేహంగా, సహాయం కోరుకుంటూ వేస్తున్న కేకలాగ.

"బాబూ!" ఇంకొంచెం గట్టిగా, అయినా, ఇంకొంచెం దీనంగా.

ఈసారి చిదంబరం తల తిప్పిచూశాడు. అదే ముసలామె. చిదంబరం – "ఓ

అరగంటపోయి రావమ్మా! అర్జెంటు పని తెమలక కొట్టుకుంటున్నాం!" అని కొంత చిరాగ్గా, కొంత తెచ్చి పెట్టుకున్న శాంతంతో, సమాధానం ఇచ్చాడు.

"చిత్తం, బాబూ!" ముసలామె గోడవారగా, నీడలా నడిచిపోయి, అక్కడ తనేం శుభవార్త తెస్తుందో అని ఎదురుచూస్తున్న కోడలు పక్కన 'ఉస్సు' రంటూ కూలబడింది.

చిదంబరం మూడోసారి కష్టపడి సరిగా తయారుచేసిన టి.ఎ.బిల్స్ మీద సంతకం పెడుతూ రంగారావుగారు – "నా బిల్స్‌లోనే ఇన్ని అవకతవకలున్నాయి. ఇంక లేబర్ బిల్స్‌లో ఎన్ని ఘోరాలు చేస్తున్నారో? దే ఆర్ పూర్ అండ్ ఇగ్నొరెంట్. వాళ్ళు బీదవాళ్ళు. అజ్ఞానులు కూడా. వాళ్ళ బిల్స్ జాగ్రత్తగా చెయ్యండి!" అన్నారు.

చిదంబరానికి నవ్వు వచ్చింది– "అడపాతడపా మిగతా బిల్స్‌లో తప్పులు ఉండి తిరిగి వచ్చినా, మరి ఎప్పుడూ ఈ వేళంత కోపం రాలేదేమా ఈయనగారికి?" అనిపించి నవ్వుకుంటూ సెక్షన్‌లోకి అడుగుపెట్టాడు. సెక్షన్ ఇందాకట్లాగే ఉంది. కాకపోతే శేషగిరి, వరహాల్రావు గీతా సంవాదం ఆపి 'కంపేరింగ్' మొదలుపెట్టారు. చిదంబరం అలిసిపోయిన వాడిలాగ కుర్చీలో కూలబడి, డ్రాయరులోంచి వారపత్రిక తీసి సీరియల్ చదవడం మొదలు పెట్టాడు. బస్సుస్టాప్‌లో సగంచదివాడు. కథ మంచి సస్పెన్సులో ఉంది. ఇంతవరకూ నాయిక ఎవర్ని ప్రేమించిందో అంతుపట్టడంలేదు.

".... అన్నయ్య మెడచుట్టూ చేతులు వేసి, వందన గోముగా – 'గౌతమ్ గురించి నీ అభిప్రాయం ఏమిటన్నయ్యా?' అని అడుగుతున్నది...."

"బాబూ! మా కాగితాలు...."

చిదంబరం చిరాగ్గా ముసలామె వంక చూశాడు. 'ఈ ముండ వదిలేట్టు లేదు' అని మనసులో అనుకున్నాడు. ట్రే అంతా చూశాడు. కాగితాలు లేవు.

ముసలామె కొడుకు కళాసీగా పనిచేస్తుండేవాడు బ్రతికి ఉన్న రోజుల్లో. కళాసీలు చాలామందికిలాగే వాడికీ తాగుడు అలవాటు ఉండేది.

"తాగి తాగి చచ్చాడు వెధవ" అన్నాడు మంగపతి, వాడి చావుకబురు తెలియజేస్తూ సెక్షన్ నుంచి ఇంటిమేషన్ వచ్చిన రోజున. "ప్చ్....పాపం" అన్నాడు విశ్వనాథం. కళ్ళజోడు తీసి చొక్కాతో తుడుచుకొని మళ్ళీ పెట్టుకుని, తలవంచుకొని యథాపూర్వం కాగితాలు రాసుకో సాగాడు. శేషగిరి – "అమ్మ! సోములుగాడుటండీ! ఎంత లాజిక్కు వాగేవాడు? 'మా వెందనక వోననక సముద్రం మీన బడిపోతా ఉంటే, ఆపీసులో పంకా కింద కుర్చీమీన కూకుని, మా కాయితాలు సూడ్డానికి వోరం రోజులు సాలవు మీకు' అని వాదన కొచ్చేవాడు" అని, "పోనీండి, చచ్చినవాళ్ళ గురించి మంచే అనుకోవాలి" అంటూ పొడుం పిసరు దట్టిం చాడు.

"వాడు చెప్పిందాంట్లో తప్పేముంది?" ఆవేశంగా అన్నాడు శ్యామలరావు, పుస్తకంలో

చదువుతున్న పేజీవద్ద గుర్తుగా వేలు ఉంచి. వరహాల్రావుకి శేషగిరి గురువు. గురువుని కాపాడ్డం తన ధర్మమని భావించి, "తప్పేముంది? నిజం మట్టుకు మీ చేతిలోనే వుంది" అన్నాడు. అందరూ ఘొల్లున నవ్వారు. విశ్వనాథం మాత్రం తలెత్తి చూసాడు. శ్యామలరావు మారాడలేదు.

కుర్చీ వెనకాతల బీరువాలో "కేసులు" వెదుకుతూంటే, చిదంబరానికి ఇదంతా గుర్తుకు వచ్చింది - దానితోపాటు ఆ కాగితాలు 'కంపేర్' చేసి ఆఫీసర్ సంతకానికి పంపి నాలుగురోజులైందని, సంతకమై ఈపాటికి ఆడిట్ ఆఫీసుకి పైనల్ సెటిల్మెంట్ బిల్ వెళ్ళి ఉంటుందని. ముసలమ్మ వంక తిరిగి - "ఆ బిల్లు తయారుచేసి ఆడిట్ ఆఫీసుకి పంపించా మమ్మా! అక్కడికెళ్ళి వాకబు చెయ్యి" అన్నాడు.

ముసలామె ముఖంలోకి కొంచెం వెలుతురుపాకింది. దానికి కొడుకు చచ్చిన దుఃఖం కన్నా, కోడలూ, పిల్లలూ, తనూ మలమల మాడిపోతున్నందుకు కలిగిన దుఃఖం ఎక్కువగా ఉంది. సర్వీసులో చనిపోతే, చచ్చినవాడు కంపెనీ కేమీ బాకీల్లేదని రిపోర్టు వచ్చిన తరువాత, ఉంటే అవి తగ్గించిన తరువాత మాత్రమే, బిల్లుచేసి, చెకింగ్‌కి పంపిస్తారు. మామూలుగా ఆ నెల ముట్టవలసిన జీతం అంతదాకా ముట్టదు. అందుచేత ముసలామెకు గంజి మెతుకులు దొరకడం కష్టంగా ఉంది. దాని కోడలికి కడుపులో పిండం కోసమైనా ఏదో ఇంత ముద్ద మింగకపోతే పాపమని భయంగా ఉంది. ఆ పిల్లలకి, పుల్లలాంటి కాళ్ళు, బానల్లాంటి పొట్టను మొయ్యాలంటే కుసింతైనా బువ్వ తినాలని తెలియకపోయినా, తినకపోవడం మూలంగా కడుపులో మండినట్టయి, "అమ్మా! ఆకలి" అని అరుస్తూ ఏడుస్తూంటే, ఆ తల్లి "పేనం" కడట్టుకుపోతూ ఉంది.

చిదంబరం మళ్ళీ పుస్తకం తీసాడు.

".... అనంత్ చెల్లెలి శిరస్సుని ప్రేమగా ముద్దాడి - "నీ మనసులోని ఊహ నాకు తెలుసులే అమ్మా! గౌతమ్ అన్ని విధాలా నీకు తగిన వరుడు' అన్నాడు.

వందన అనంత్ కాళ్ళమీద పడి, పాదధూళి శిరస్సున ఉంచుకుని, 'జన్మజన్మాలకూ నీ చెల్లెలిగా పుట్టాలని కోరుకుంటున్నానన్నయ్యా!" అంది అశ్రుబిందువులు కనుకొలకుల్లో చిందులాడగా.

అనంత్ చెమ్మగిల్లిన కన్నులు ఎడమచేత్తో తుడుచుకుంటూ, 'నువ్వెక్కడున్నా ఈ బీద అన్నయ్యను మరిచిపోకమ్మా! నేను మరణశయ్యవద్ద పితృదేవులకు, మాతృశ్రీకి ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకుంటాను' అన్నాడు.

వందన అన్నయ్య గుండెలో తలదాచుకుంది విషాదానందాలతో."

"సార్! దొరగారు పిలుస్తున్నారు."

చిదంబరం ప్యూన్‌వంక చిరాగ్గాచూసాడు. కోపంగా పుస్తకాన్ని డ్రాయరులో పడేసాడు. ఈవేళ్టికి ఇది నాలుగోసారి ఆఫీసరు కబురంపడడం. వెళ్ళినప్పుడల్లా చివాట్లు తింటూ వస్తున్నాడు.

"ఉదయంలేచి ఎవడి ముఖం చూసాడో" అంటున్నాడు శ్యామ్రావు.

షట్టర్స్ తొలగించుకుని గుమ్మం దాటి వెళుతున్న చిదంబరం వెనుకకు తిరిగి చూసాడు. అప్పటికే శ్యామ్రావు ముఖం 'రసికప్రియ'లో దాగిపోయింది. 'అదృష్టవంతుడు' మనసులోనే తిట్టుకుంటూ, మెట్లెక్కాడు చిదంబరం. ముదుకులమీద చేతులు పెట్టుకుని మెట్లెక్కుతున్న మంగపతి కనిపించాడు.

"దొరగారి దగ్గరకా?" అన్నాడు భావగర్భితంగా.

చిదంబరానికి చిరాకు లావయి... 'కాదు, స్వర్గానికి' అందామనిపించి, అలా అనలేనని కూడా అర్థమై, పైకి, "అవునండీ" అన్నాడు. 'అమ్మయ్య' అనుకుంటూ ఆఖరి మెట్టెక్కిన మంగపతి, "నేను ఒ.ఎస్. గారి రూములో ఉంటాను" అన్నాడు. ఒ.ఎస్. అంటే ఆఫీస్ సూపరింటెండెంట్. "సరే" నన్నట్టు తలూపాడు చిదంబరం. కాని, ఒళ్ళు మండుకు వచ్చింది అక్కడికి ఆఫీసరు విశ్వామిత్రుణ్ణి తాను శాంతింపజేసి సమాధానపరచలేకపోతే, యీాయన చక్రం అడ్డువేస్తాడు కాబోలు.

ఆఫీసర్ గదిముందు ఆగాడు చిదంబరం. అలా ఆగి, పక్కనే వున్న రికార్డ్ సెక్షన్ వంక చూసాడు. చూస్తూనే, చొక్కా పై గుండీ పెట్టుకున్నాడు. పెట్టుకుంటూ, రికార్డ్ సెక్షన్ కిటికీలోంచి సూర్యకాంతం వంక చూస్తూ, 'అయింది అయ్యగారి పని!' అన్నట్టు సూర్య కాంతం నవ్వడంతో, ఎరుపెక్కిన కళ్ళతో ఆఫీసర్ గదిలోకి ప్రవేశించాడు. వెనక స్ప్రింగ్ డోర్స్ మూసుకున్నాయి. మూసుకున్న స్ప్రింగ్‌డోర్స్ వెనక ప్యూన్ రమణ తనకు ఆఫీసర్ ప్రసాదించబోయే దీవెనలు విని ఆనందిస్తాడన్న తలంపు మరింత కోపాన్ని కలగజేస్తుంటే.... "సార్?" అన్నాడు తల వంచుకుని వినయంగా.

రంగారావుగారు కుషన్ కుర్చీలో కూర్చుని కాగితాలు చూసుకుంటున్నారు. చిదంబరం ప్రశ్నకు సమాధానంగా వెనక్కు చేరగిలబడి, నిదానంగా "కెన్ యూ దూ మి ఎ స్మాల్ ఫేవర్?" అన్నారు.

గుహలో ప్రవేశపెట్టబడిన కుందేటితో సింహం - 'నాకో చిన్న సహాయం చేసి పెట్ట గలవా' అని అంటే, కుందేలుకి అపనమ్మకం కలగడంలో ఆశ్చర్యం లేదు. చిదంబరం ముఖం ఎర్రనైంది. 'నో ఇంట్రొడక్షన్ ప్లీజ్! ఆ ఉపోద్ఘాతాలన్నీ చాలించి, తిట్టవలసినదేదో త్వరగా కానియ్, గురూ!' అని అందామన్నంత ఆవేశం కలిగింది. పైకి మాత్రం ఎప్పటిలాగే, అతి వినయంగా, "విత్ ప్లెజర్" అన్నాడు.

"మీకు ఎస్.డి.ఒ. ఆఫీసులో ఎవర్నో తెలుసునని, ఒ.ఎస్. చెప్పారు. మా ఇంటివద్ద ఫోన్ ఇన్‌స్టలేషన్ గురించి డబ్బు కట్టి దాదాపు రెండు నెలలయింది. ఇంతవరకూ ఏమీ 'యాక్షన్' తీసుకోలేదు. దయచేసి మీరు ఆ విషయం కనుక్కోగలరా? యూ కెన్ కాంటాక్ట్ హిమ్ ఆన్ ఫోన్. మీకు అభ్యంతరం లేకపోతేనే సుమండీ!" అంది సింహం.

చిదంబరానికి ఏనుగు అంబారీమీద తనను కూర్చోబెట్టి ఊరేగిస్తున్నట్టు అనిపించింది. 'మీ కభ్యంతరం లేకపోతే' – చిదంబరం అనబడే యు.డి.సి.కి. అభ్యంతరం లేకపోతే, రంగారావనబడే వాళ్ళ ఆఫీసరుగారి ఇంటికి ఫోన్ గురించి సబ్ – డివిజినల్ ఆఫీసర్ (ఫోన్స్) ఆఫీసులోని తన మిత్రుడికి ఫోన్ చెయ్యడం.... 'వాటెవండర్!' అని మనసులో అనుకొని, "అలాగే, సార్! తప్పకుండా, వెంటనే ఫోన్‌చేస్తాను, సార్! ఇప్పుడే...." చిదంబరానికి మాటలు అందడంలేదు.

రంగారావుగారు నిండుకుండలాగ నవ్వారు. నవ్వుతూ "ఒ.కె., ఒ.కె. టేక్ యువర్ ఓన్ టైమ్!" అన్నారు.

చిదంబరం గబగబా ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. "హలో! ఎస్.డి.ఒ. ఆఫీసేనా? అక్కడ సుబ్బారావని క్లర్క్ ఉంటాడు. పిలుస్తారా!... సుబ్బారావు లేడా?... సోమవారం వస్తాడా? థాంక్ యూ." ఫోన్ పెట్టేశాడు నిరాశగా. 'ఆఫీసర్ కోరినా, కాదు రిక్వెస్ట్ చేయగా, తను ఆ పనిచేయలేకపోతే అప్రయోజకుడిననిపించుకోడూ.' చిదంబరం ఫోన్ ఎత్తాడు. టెలిఫోన్స్ ఇన్‌స్పెక్టర్‌కి రింగ్ చేశాడు. "నమస్కారం, సార్. నేను చిదంబరాన్ని. సుబ్బారావు క్లాస్‌మేట్‌ని. మనం ఒకసారి లీలామహల్‌లో కలుసుకున్నాం కూడా....." చిదంబరం విషయమంతా చెప్పి, ఆయన్ని రిక్వెస్ట్ చేశాడు, ఫోన్ ఇన్‌స్టలేషన్ త్వరగా కానిమ్మని. అటు నుంచి వచ్చిన సమాధానం చిదంబరాన్ని ఆనందంలో ముంచెత్తింది. "అలా అని మా ఆఫీసర్‌కి చెప్పమంటారా? అచ్ఛా! ఆయనతో కూడా చెపుతాను. థాంక్యూ" అంటూ ఫోన్ పెట్టేసి, గబగబా ఆఫీసర్ రూములోకి వెళ్ళి, "ఉదయమే పని మొదలుపెట్టారట సార్! రేపటికల్లా మీ ఇంటికి కనెక్షన్ ఇవ్వబడు తుందట" అన్నాడు.

రంగారావుగారు ఆనందం వ్యక్తపరుస్తూ, "థాంక్యూ" అన్నారు.

చిదంబరం "నో మెన్షన్" అని ఎలాగో అనేసి, విజయగర్వంతో మేడ మెట్లు దిగ సాగాడు. సెక్షన్‌లో అంతా భోజనానికి వెడుతున్నారు. చిదంబరం కూడా గ్లాసు పట్టుకుని డైనింగ్ హాలుకి బయలుదేరాడు.

గడియారం రెండుగంటలు కొట్టింది. సెక్షన్ అంతా సామూహిక చర్చల్లో ఉంది. ప్యూన్ వచ్చాడు. చిదంబరం పక్కన నించున్నాడు. "సార్! దొరగారు రమ్మంటున్నారు" అన్నాడు.

"ఏమిటీ! దొరగారు ఇంటికెళ్ళి భోజనంచేసి రావడం అయిపోయిందా! సరి సరీ" అంటూ ఒక్కొక్కరూ తమ తమ సెక్షన్లకి పోవడం ఆరంభించారు. చిదంబరం లేచి, కాలరు సవరించుకొని బయలుదేరాడు.

"నువ్వేనా నన్ను ఫూల్ చేస్తుండాలి, లేక నిన్నేనా ఎవరో ఫూల్‌చేస్తుండాలి. మా ఇంటికి నలుగురు వర్కర్స్ మాత్రం వచ్చి, చూసి, పని సోమవారం నుంచి మొదలెడతామని చెప్పారట" సింహం సింహంలాగానే గర్జించింది.

చిదంబరం చిట్టెలుకలా వణికిపోయాడు.

గాలి తీసిన బెలూనులా ముఖంలో ఆనందమంతా తగ్గిపోయింది.

"వెళ్ళి కరెక్ట్ పొజిషన్ ఏమిటో కనుక్కోండి."

చిదంబరం విసురుగా మెట్లు దిగాడు. గదిలోకి వచ్చి, డ్రాయరులోంచి సైకిల్ తాళం తీసాడు. "నేను ఎస్.డి.ఒ. ఆఫీసుకి వెళుతున్నాను'. అని మంగపతి కేసి తిరిగి, అని, పైకి వచ్చాడు. "ఇంత ఎండలోనా? ఎందుకు?" అంటున్న శేషగిరికి సమాధానం ఇవ్వలేదు.

అప్పుడే భోజనం చేసాడేమో ఆయాసంగా ఉంది. ఎదురుగాలి. ఎర్రని ఎండ. కోపంవల్ల ఎర్రని ముఖంతో, ఎండవల్ల చెమటలు కారుతున్న శరీరంతో, టెలిఫోన్స్ ఇన్‌స్పెక్టర్ గదిలో అడుగుపెట్టి, తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

"ఇందాకా ఫోన్ చేసింది మీరేనా? అయామ్ సారీ! స్టోర్సులో ఏవో వస్తువులు లేవట. అవి కొని, పని సోమవారం మొదలుపెడతారు" అన్నాడతను.

అంత సాధారణంగా, ఏమీ కానట్టు అతను మాట్లాడడంతో, చిదంబరానికి ఒళ్లు మండుకు వచ్చింది.

"మీరు విషయం సరిగ్గా కనుక్కొని నాకు చెప్పవలసింది. నేను మా ఆఫీసరుతో అలా చెపుతానని కూడా చెప్పాను మీకు." అణచిపెట్టుకున్న కోపంతో అన్నాడు చిదంబరం.

"ఇదొక్కటే పనికాదండీ మాకు. మాకెన్నో ఫోన్ కాల్స్ వస్తుంటాయి. ప్రతి విషయం వెరిఫై చేసి సమాధానమియ్యాలంటే మరో ఇద్దర్ని నియమించాలి అందుకు" అన్నాడతను.

చిదంబరం లేచి నిల్చొని, "దట్సాల్. థాంక్ యు" అని వచ్చేసాడు.

చిదంబరం సైకిల్ తొక్కుతూ ఆలోచిస్తున్నాడు. 'ఇలా అయితే లాభం లేదు. ఈ విషయం 'సంపాదక లేఖ' లకి వ్రాసిపంపాలి. పబ్లిక్ సర్వెంట్ అన్నవాడు పబ్లిక్‌తో వ్యవహరించవలసిన తీరు ముందు తెలుసుకోవాలి. వాడి అబ్బగాడి సొమ్మా నెలనెలా పుచ్చుకుంటున్నది? పన్నులు వేసి, ప్రజల దగ్గరా గుంజి, ఈ సర్వీసెస్ అన్నీ పోషించడం.... వీళ్ళేమో...'

రోడ్డుకు అడ్డంగా జనం. బెల్ వాయించితే వెనక్కు తిరిగి చూసారు, కాని, ఎవరూ

కదలలేదు. సైకిల్ ఆపి, చిదంబరం గుంపు దగ్గరగా నించున్నాడు. "ఉదయం నుంచీ గుక్కెడు మంచినీళ్ళు లేవట!" "ఎండలో నడిచి ఏదో ఆఫీసుకి వెళ్ళొస్తుంటే కళ్ళు తిరిగిపడిపోయింది."

"ముసలి ప్రాణం దక్కుతుందో దక్కదో!" "ఇలా తీసుకురండయ్యా రిక్షాని." .... చిదంబరం కుతూహలంగా చూశాడు. సోములు తల్లి! ఉదయం నుంచి అతను చెప్పిన ఒక్క మాట కోసం ఎదురుచూసింది. ఆ ఒక్క మాట విని, పరమాన్నం తిన్నంత ఆనందంతో, చచ్చిపోయిన కొడుకు సెటిల్మెంట్ బిల్లు గురించి ఆడిట్ ఆఫీసుకి వెళ్ళింది.

'పాపం, ఇంత ఎండలో, కాళ్ళకి జోళ్ళైనా ఉండవు. నల్లని తారు .... కాళ్ళకి అంటుకుని ఉండదూ! ఆ కడుపు ఏ లోకాలకో అంటుకునిపోయి ఉంది.' చిదంబరం జాలిపడ్డాడు.

"తప్పుకోండయ్యా రిక్షా వస్తున్నది."

చిదంబరం ఒక పక్కగా తొలిగాడు. ముసలమ్మ ముఖంమీద జల్లిన నీటిని తుడిచింది కోడలు. ముసలామె గాజు కళ్ళు చూస్తున్నదీ, లేనిదీ తెలియడంలేదు. నెమ్మదిగా రిక్షా ఎక్కించారు ఓ నలుగురు కలిసి. ఎవరో ధర్మాత్ముడు రెండు రూపాయల నోటు కోడలి చేతిలో పెట్టాడు.

రిక్షా తన పక్క నుంచి వెడుతుంటే, సోములుగాడి పెళ్ళాం తన వంక కోపంగా చూసిన ట్టనిపించింది చిదంబరానికి. 'దీనికీ దీని మొగుడుకిలాగే గుమాస్తాల్ని చూస్తే మంట కాబోలు' అనుకున్నాడు సైకిల్ ఎక్కుతూ.

✪ ✪ ✪

అరగంట తరువాత ఆఫీసరుగారికి ఫోన్ విషయం నివేదించి వస్తుంటే, ట్రేలో ఇంకా సంతకం కాని సోములు ఫైనల్ సెటిల్మెంట్ బిల్లు కనిపించి, చిదంబరానికి కళ్ళు తిరిగినట్టనిపించింది.

– ఆంధ్రప్రభ వారపత్రిక, **28.4.1971**

# ఉదయం

'బీ సీటెడ్. కూర్చోండి.'

'పరవాలేదండి.'

"నో,నో, నాకిలాటి తారతమ్యాలన్నీ నచ్చవు. నేను కంపెనీ ప్రొప్రైటర్నీ, మీరు గుమాస్తా అయినంతమాత్రాన, యిద్దరమూ మనుష్యులం కాకుండాపోము. దయచేసి కూర్చోండి."

'థేంక్యూ సర్!'

'దట్సాల్. మీ అమ్మాయి పెళ్ళికని సెలవు పెట్టారు?'

'అవున్సార్, ఎంతలేదన్నా ఒక వారం సెలవుకావాలి.'

'నో. నో. వారం ఎలా సరిపోతుంది. పదిహేను రోజులు సెలవు తీసుకోండి. ఈ అయిదువందలూ.... మీరు కాదంటే నేను బాధపడాల్సి వస్తుంది.'

రాజు ఎడమవేపు నుంచి కుడివేపు ఒత్తిగిల్లాడు. పాతబడిన మడతమంచం ప్రాణం పోతున్నట్లు కిర్రుమంది.

'హుఁ. ఈ ఆలోచనలు కాదు. నిద్ర అసలు రాదు. మధురంగా ఊహించాలి' అనుకున్నాడు రాజు, తలక్రింద మడతపెట్టిన చెయ్యివుంచుకుని.

రాజు ప్రీవీపర్సువున్న రాజో, పోగొట్టుకున్న రాజో కాదు. పేరులోనే రాజు. వడ్డాది చిన సీతారామరాజు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి పెద్ద కొడుకు మాత్రమే. కాని దరిద్రమే ఒక సామ్రాజ్యమైతే, దానికతనే సామంతరాజు.

కడుపు నిండినవారి చిరునవ్వులా వుంది పున్నమి వెన్నెల.

నిద్రపట్టని ఎర్రని కళ్ళు విప్పి చూసాడు రాజు.

వాకిట్లో అతను పడుకున్న మంచం చెంతనే వున్న తెల్ల చేమంతులు వెన్నెలముద్దల్లా వున్నాయి. మరో పక్కవున్న దొండపాదు నీడ మంచం మీద పడుతున్నది. ఇంటి నానుకునే వున్న అకుమళ్ళ మీద నుంచి చల్లని గాలి వచ్చి శరీరాన్ని తాకుతున్నది.

ఇంటివేపు చూసాడు. క్రిందికి వంగివున్న చూరు. ఎండిన చొప్పగడ్డిమీద పడి వెన్నెల మెరుస్తున్నది.

ఆ యింటి నానుకుని మరోవైపువున్న గుడిసెలలో కొండవాళ్లుంటున్నారు. మగవాళ్ళు రాత్రి పూరు కాపలాకాస్తే, కలిగిన వాళ్ళంతా పెద్ద పండుగనాడు ధాన్యం కొలుస్తారు.

పగలంతా ఆడవాళ్లు ఆ చాకిరీ, ఈ చాకిరీ చేసి గంజినీళ్ళకి సరిపడా సంపాదిస్తారు. వాళ్ళు పెంచుతున్న పందుల గురక ప్రశాంత వాతావరణాన్ని భంగపరుస్తున్నది.

రాజుకి పూర్వం వాళ్ళుండే యిల్లు జ్ఞాపకం వచ్చింది.

పైన చొప్పగడ్డితోనే నేయబడ్డా, యిల్లంతా గచ్చుచేసి వుండేది. ఇటికలతోకట్టి సున్నంవేసిన గోడలు.

కాలం కలిసొస్తే పైన కూడా పెంకు వేయించాలని సీతారామయ్యకి మహాకోరికగా వుండేది. కాలం కలసిరాలేదు సరికదా రాజుకన్నా పెద్ద పిల్ల పెళ్ళికని ఆ యిల్లు అమ్మేయాల్సొచ్చింది. రెండు మూడు అద్దెయిళ్ళు మారాక, ఇప్పుడుంటున్న యింటికెదురుగా వున్న బియ్యం మిల్లు నాయుడుగారి దగ్గర చవకలో ఈ జాగా కొన్నారు.

ఇటు ప్రక్క కొండవాళ్ళ గుడిసెలు, అటు కూరాకుల మళ్ళు. ఈ యిల్లే వూరికిచివర. సీతారామయ్య తల్లికి నిండా అయిదుప్రాణాలు లేకపోయినా ఆచారాలు మాత్రం వదిలి పోలేదు. ఆవిడ మొదట విసుక్కున్నా, సీతారామయ్యే తెగించి నాలుగు మట్టిగోడలు లేపి దానిమీద ఏదో కప్పువేయించి గృహప్రవేశం చేయించాడు.

డబ్బులేక కాలేజీ చదువు మధ్యలో ఆపేసి ఇంటికొచ్చేసిన కొత్తలో, రాజుకి పగలల్లా మిల్లు చేసే ధ్వనులు వింటూ కూర్చోవాలంటే చిరాకనిపించేది. క్రమంగా, కుటుంబం ఎదుర్కొంటున్న అనేక చిక్కులగురించి పూర్తిగా తెలిసాకా, ఆ చికాకు సంగతి మరచిపోయేడు.

రాజు కళ్లు గట్టిగా మూసుకున్నాడు. నిద్రపోవాలని వుంది. కాని సమసమాజంలాగ నిద్ర ఎంతకీ రావడంలేదు. సాయంకాలం తండ్రి చూపించిన 'ఆర్డరు' కాగితమే జ్ఞాపక మొస్తోంది.

ఇంకో మూడునెలల్లో సీతారామయ్యకి యాభై అయిదేళ్ళు నిండుతాయి కాబట్టి ఆ రోజుతో ఆయన సర్వీసు నుంచి విరమింపచేయబడతాడని అందులో వుంది.

'ప్రచండ వాతూలహత నీపశాఖవోలె' అని ఏదో పుస్తకంలో రాజు చదివాడు. కాని ఆ కాగితం చదువుతూనే అలాంటి వణుకే ఆరంభమయిందతనిలో.

అయిదునెల్లాయి తండ్రికి జీతంలేదు. ఊరినిండా బాకీలే! కుటుంబమంతా ఒకపూట తింటే, రెండుపూటలు పస్తుంటున్నారు. ప్రైవేటు చదువుతున్న పిల్లల తండ్రులు బ్రతిమా లించుకుని, అప్పుడో అర్ధ, అప్పుడో రూపాయి చొప్పున ఇస్తే, ఆ డబ్బుతోటీ, అమెరికావాళ్లు బడి పిల్లలకోసమని యిస్తున్న పాలపొడి, గోధుమనూకలతోటీ సంసారం లాక్కొస్తున్నాడు సీతారామయ్య.

ఒకటి రెండుసార్లు, కూలీ నాలీ చేసుకుని, వూరికి కాపలాకాసి బ్రతికే కొండవాళ్ళ దగ్గర్నుంచి అవీ, ఇవీ పుచ్చుకుని తల్లి పొయ్యిమీద గిన్నెక్కించడం రాజుకి తెలుసు. అప్పుడు సిగ్గుపడాలో, గర్వించాలో, ఉరేసుకు చావాలో అతనికి తెలియలేదు.

తండ్రి ఉద్యోగమూ ముగుస్తే బ్రతకడం ఎలాగ? పెళ్ళీడుదాటుతున్న రెండో అక్క గతేమిటి? ఇంకా చిన్నవాళ్ళు తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు, అనారోగ్యంతో బాధపడే తల్లి, ఏళ్ళుదాటిన మామ్మ, ఏనూతిలో దూకాలి?

'హైకోర్టులో 'రిట్'వేస్తే మరో మూడేళ్ళు, దశ బాగుంటే అరవైఏళ్ళవరకూ కూడా సర్వీసు పొడిగించవచ్చు. అన్ని ఏర్పాట్లూ యూనియన్‌వాళ్ళు చేస్తారు.'

తండ్రి మాటలు వింటుంటే ఏదో ఆశ పొడమింది. భూమిలోకంటూ చొచ్చుకుపోతే వేళ్ళు, రాతి నేలలోనైనా నీళ్ళుంటాయేమోనని.

'కాని నూటనలభై రూపాయలు కావాలి, ఆ తతంగమంతా జరపాలంటే.'

తండ్రి స్వరంలోని నిస్సహాయత రాజు హృదయాన్ని కలచివేసింది.

తండ్రి వంక చూసాడు.

సీతారామయ్య అందగాడు కాదు. యాభై అయిదేళ్ళవాడు అరవై పెబడ్డట్టుంటాడు. కొంచెం వంగిన నడుం. దట్టంగా పెరిగిన, నెరసిపోయిన గడ్డం. బట్టతలమీద జీవితంలో మిగిలిన ఆశలా, అక్కడక్కడ తెల్లవెంట్రుకలు. సన్నని పొట్టిమనిషి. జీవితం నిర్దాక్షిణ్యంగా సారమంతా పీల్చివేయగా, మిగిలిన చెఱకుపిప్పిలా వుంటాడు.

రాజు తనవంక చూసుకున్నాడు. తండ్రితో పోలుస్తే తను పరవాలేదు. బలమైన చేతులు. బలహీనంకాని శరీరం.

అతనిమీద అతనికే అసహ్యం వేసింది. ఇరవై ఏళ్ళొచ్చాయి. పి.యు.సీ. వరకు చదువుకున్నాడు. తండ్రికీ, కుటుంబానికీ ఏ విధంగానూ కొరగాని తన శరీరమంటే ప్రేమ పోయి రోత కల్గింది.

రాజు పేరు 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజి'లో నమోదుచేయబడే వుంది. సీతారామయ్య కొడుకు ఉద్యోగం గురించి అర్థించని మనిషి లేడు. ఆయన ఆశ – ఏ గుమస్తా గిరియేనా కొడుక్కి దొరక్కపోదా – అని.

దొరకదనీ, దేశంలో తనకన్నా కూడా ఎక్కువ అర్హతలున్నవాళ్ళు చాలామంది నిరుద్యోగులుగా వున్నారనీ, వాళ్ళందర్నీ కాదని ఉద్యోగం చిలక తనమీద వాలాలంటే ఎంతో పలుకుబడికాని, ధనంకాని వుండాలనీ రాజుకి తెలుసు.

'ఎటెండరుపని, కళాసీపని ఏదైనా చేస్తాను' అన్నాడు రాజు. మొదట్లో తండ్రి వప్పుకోలేదు. అందుకు సమాధానపడి, ఆ యత్నాలు ఆరంభించిన తర్వాత, తను తక్కువనుకుంటున్న పనులు కూడా తన కొడుక్కి సంపాదించలేనని సీతారామయ్యకి తెలిసొచ్చింది.

నూటనలభై రూపాయలు! ఎలా వస్తాయో రాజుకి తెలియలేదు. తల్లి మెడవేపు చూసాడు అప్రయత్నంగా. మెళ్ళోని పసుపుతాడు, బోసికాళ్ళు చూసిన తర్వాత తల్లికి పుస్తెలు కాదు కదా, కాళ్ళని మట్టెలైనా లేవని గుర్తొచ్చింది.

రాజు మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు. కడుపులో మంటగా వున్నట్టనిపించింది. ఆకలిమంట. పడుకునేముందు డబ్బాపాలు, తొలిసారి టీకాచి వడబోస్తే మిగిలినపొడి కలిపి, తయారుచేసిన టీ త్రాగాడు. ఆ నీళ్ళిన్నడో జీర్ణమై ఆకలి పోటులాగ ప్రారంభమైంది.

జీవితం కురుపులా సలుపుతోంది. ఆలోచనలు పుండుమీద ఈగల్లా ముసురు తున్నాయి.

మిల్లుముందు చెట్టుమీది కాకి ఒకసారి 'కావ్' మంది.

లోకంలోని ఆకల్ని, హీనత్వాన్ని, రోగాన్ని, దైన్యాన్ని, నీచాన్ని, మోసాన్ని చూసి రోతవేసినట్టు, భీతికలిగినట్టు, వీధిలో ఎక్కడో రెండు కుక్కలు జంటగా వికృతంగా, భయంకరంగా, బాధామయంగా అరుస్తున్నాయి.

రాజుకి కాలేజీ చదువు మానేసి, దరిద్రంతో ముఖాముఖి తలపడవలసి వచ్చిన దగ్గర్నుంచీ రాత్రుళ్ళు పడుకోగానే సాధారణంగా నిద్ర రావడం మానేసింది. అందుకని అతను నిద్ర వచ్చేందుకు మూడు ఏర్పాట్లుచేసుకున్నాడు.

మొదటిది – అతనికొచ్చిన ప్రార్థన పద్యాలన్నీ మనసులో వల్లించుకోవడం. చిన్నప్పుడు తాత డొక్కలో పడుకుని కృష్ణశతకంలోని పద్యాలు చెప్పించుకునేవాడు. మరచిపోగా మిగిలినవి, కళ్ళు గట్టిగా మూసుకుని, చదువుకుంటాడు.

ఆ యత్నం విఫలమైతే, తానో లక్షాధికారైనట్టైతే (ఏ లాటరీయో వచ్చి) ఆ డబ్బు నెంత చక్కగా ప్రజోపకారకంగా ఖర్చుపెడతాడో, సుఖిస్తాడో వూహించుకుంటాడు.

అప్పటికీ నిద్ర రాకపోతే, అతని ఎరికలో వున్న, అందుబాటులోలేని, అమ్మాయిల అందాన్ని, వాళ్ళతో తను మధుర జీవితాన్ని ఎలా గడపగలడో కలకంటూ నిద్రపోతాడు.

తనకి తెలియకుండానే బోర్లా తిరిగి పడుకున్న రాజు, ఇప్పుడు మూడో అవస్థలో వున్నాడు.

'ఊరుకోండీ! మరీ చిలిపివారై పోతున్నారు.' ఎర్రగా కందిన బుగ్గమీది పంటిగాటును తడుముకుంటూ కోపంగా రాధ చూస్తుంటే, రాజు గర్వంగా నవ్వుతున్నాడు.

'ఓరి దేవుడోయ్, ఆడుతూపాడుతుండే పిల్లలే నీకు దొరికారా?'

రాజుకి మగతనిద్రలో దీనంగా వినిపిస్తున్న ఆ కంఠధ్వని కలో నిజమో తెలిసేంతలో, 'నాయనా రాజూ!' అంటూ వణుకుతున్న కంఠంతో తండ్రి పిలుస్తుండడం వినిపించి, గాభరాగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగా కళాకాంతుల్లేని తండ్రి ముఖం చూసి, దిగ్గున లేచాడు, కట్టుకున్న లుంగీ సర్దుకుంటూ. ఇంట్లోంచి చిన్నగా మామ్మ ఏడుపు వినిపిస్తున్నది.

'ఏమయిందో తెలియదు. సుబ్బి నోటంట నురగ కారుస్తూ తెలివి తప్పి పడి

పోయిందిరా. బుర్ర కూడా వ్రేళ్ళాడేస్తున్నది.' తండ్రిమాట పూర్తి కాకుండానే రాజు వంగుని ఇంట్లో దూరాడు.

చాపమీద అతని ఆఖరిచెల్లి ఆరేళ్ళది సుబ్బి అచేతనంగా పడి వుంది. రెండు చేతులా పసిదాన్ని ఎత్తుకుని డాక్టరింటివేపు పరుగుతీసాడు. తండ్రీ, తల్లీ అతణ్ణి అనుసరించారు.

ఊర్లో వున్న ఎల్.ఎమ్.పి చదువుకున్న ఒక్క డాక్టరూ తలుపు దబదబా బాదిన పదినిమిషాలక్కాని తెరవలేదు. చూడగానే ఫీజు రాని కేసని తెలిసి విసుక్కోవడం మానలేదు.

'ఇలా ఇంతకు మునుపెన్నడేనా వచ్చిందా?' అన్నాడు పరీక్ష ముగించి ఇంజక్షన్ ఇవ్వడానికి సిరంజిలోకి మందెక్కిస్తూ. లేదన్నట్టు రాజు తల్లి అడ్డంగా తలాడించింది.

ఆవిడ తోవ కడాకూ గ్రామదేవతలు మొదలుకుని, వేంకటేశ్వరుడివరకూ ముక్కోటి దేవుళ్ళకూ మొక్కుకుంటూనే వుంది. అందరు దేవుళ్ళూ మూర్తీభవించినట్టు తోచిన డాక్టర్ని చూడగానే 'బిడ్డవంటి వాడివి నాయనా! చచ్చి నీ కడుపున పుడతాను. నా పిల్లని నాకు దక్కించు' అంటూ అతణ్ణి ప్రాధేయపడడం మొదలుపెట్టింది. డాక్టరు విసుగ్గా చూసాడు.

'మధ్యరాత్రిలో పక్కలో పడుకున్న పిల్ల పళ్ళు కరుచుకొంటున్నట్టు శబ్దమైతే కలో, కలవరింతో అనుకున్నాను. పాపిష్టిదాన్ని. పాడునిద్ర కళ్ళమీద నుంచి తొలగలేదు. మళ్ళీ గంటా గంటన్నరకి తెలివొచ్చి చూద్దును కదా, శబ్దం అలానే వినిపిస్తున్నది. చెయ్యివేసి తడివితే ఒళ్ళంతా చల్లగా వుంది. దీపం పెద్దదిచేసి వెలుగులో చూస్తే, నోట్లోంచి నురగలు వస్తున్నాయి. పరుగెత్తుకొచ్చాం నాయనా! నీ పుణ్యం ఉంటుంది. ప్రాణం పొయ్యి.'

'నా చేతనైంది నే చేస్తాను. కానీ మీరు పిల్లని వెంటనే పట్నం తీసుకెళ్తే మంచిది. ఈ పల్లెటూళ్ళో ఏం మందులున్నాయి? పిల్ల బుగ్గల్లోనైనా నెత్తురుచుక్కలేదు. ఏ క్షణాని కేమవుతుందో?'

డాక్టరు మెల్లగా అంటున్న మాటలు మబ్బుల్లేని పిడుగుల్లాగ వినిపించాయి ముగ్గురికీ. రాజు తండ్రివంక చూశాడు. తల్లీ అటే చూస్తున్నది. ఇద్దరి చూపుల్నీ ఎదుర్కోలేక, దండనకోరిన దోషిలా తలదించుకున్నాడు సీతారామయ్య.

ముగ్గురివరసా డాక్టరుకి అర్థమైంది. ఆవులించడం ముగించి 'ఇంతకుమించి నేను చేయగల్గిందేమీ లేదు. మీ అదృష్టం బాగుండి ఇచ్చిన యింజెక్షన్ పనిచేసి తెలివొస్తే తెల్లారి తీసుకురండి' అన్నాడు డాక్టరు.

రాజు తల్లి మళ్ళీ ఏదో బ్రతిమాలబోయింది. 'నా ప్రయత్నం నే చేసాను. ఇంక వెళ్ళండమ్మా!' డాక్టరు విసుగ్గా అంటుంటే రాజుకి అభిమానం వేసింది. నోటి చివరిదాకా వచ్చిన మాటను అణచిపెట్టుకుని 'పదమ్మా' అన్నాడు.

మౌనంగా సీతారామయ్య ముందుగా, ఆ వెనుక, యింకా వెనక్కి, వెనక్కి డాక్టరును

వేడుకుంటున్నట్టు చూస్తూ, ఆయన భార్యా, సుబ్బిని చేతుల్లో ఎత్తుకుని రాజూ ఇంటివేపు బయల్దేరారు.

గుమ్మం దాటుతుంటే గుండెలమీద సమ్మెటతో బాదినట్టు, డాక్టరుగారింటి గడియారం ఠంగు ఠంగున రెండుగంటలు కొట్టింది.

వీధిలోంచి కాకుండా శ్మశానంలోంచి వెడుతున్నట్టుంది రాజుకి. తల్లి మాత్రం 'పిల్లకి సరైన మందైనా యిప్పించుకోలేని వెధవజన్మ పగవాడికైనా వద్దు భగవంతుడా!' అంటూ ఏవేవో గొణుక్కుంటోంది. భగవంతుడి బదులు ఆ మాటలకు తానే సమాధానం చెప్పవలసి వచ్చినట్టు సీతారామయ్య కుమిలిపోతూ నడుస్తున్నాడు.

క్షణం రాజు బుర్ర పనిచేయడం మానేసింది. కలలో మాదిరి చెల్లి నెత్తుకు నడవసాగేడు. సుబ్బిని ఇంట్లో చాపమీద పడుకోబెట్టి బయటకొచ్చి నిలబడ్డాడు. మిల్లుముందు జువ్విచెట్టు జడలువిప్పుకున్న శివుడిలా వుంది. దొండపందిరి దాపు నుంచి వూరివంక చూసాడు.

ఎత్తుగా దొరగారిమేడ, కంట్రాక్టరు నాయుడిమేడ, మునసబు మేడ, వడ్డీ వ్యాపారి నాగయ్య మేడ కనబడుతున్నాయి. వాళ్ళ దగ్గర కంబార్లుగా పనిచేసేవాళ్ళ గుడిసెలు ఏమూలున్నాయో తెలుసునుగాని అవి కంటి కానడంలేదు. కొండవాళ్ళ గుడిసెలు చలికి వణుకుతూ ముడుచుక్కూర్చున్న ముసిలివాళ్ళమల్లే వున్నాయి. నీడల్లాగ, ఆ తర్వాత, చిన్న రైతుల పూరిళ్లున్నాయి.

ఊరిలో డబ్బులేదా? ఓ యాభై రూపాయల్లేక చెల్లి ప్రాణమూ, నూటనలభై రూపాయల్లేక తండ్రి వుద్యోగమూ పోవలసిందేనా?

'అలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటావేరా, నాయనా! సీతారావుడూ! ఎవరికాళ్ళైనా పట్టుకుని నాలుగు డబ్బుల్తేరా! పిల్ల దాని ప్రాణం కాస్త గుటుక్కుమంటే అప్పుడేమనుకునీ లాభం లేదురా?' ఇంట్లోంచి మామ్మగొంతు దీనంగా వినిపిస్తున్నది.

తండ్రివేపు చూశాడు రాజు. మోకాళ్ళలో దాచుకున్న ముఖం పైకెత్తకుండానే 'ఎవరిస్తారమ్మా! అప్పు దొరక్కపోగా ఈ అర్ధరాత్రి లేపినందుకు తిట్లు కూడా తినవలసొస్తుంది' అన్నాడు సీతారామయ్య భయం భయంగా.

'అత్తయ్యా! అత్తయ్యా! పిల్లకు మూర్ఛవచ్చినట్లు కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటోంది.'

రాజు గాభరాగా లోనికి వెళ్ళాడు.

'ఓరి భగవంతుడా! ఎంత ఘోరానికి ఒడిగట్టావురా? ముసలిదాన్ని నన్నుంచి పిల్లమీద కన్నువేసావా? నీ కంత కోరికైతే నన్ను తీసుకెళ్లి, నా ఆయుష్షు దానికి పొయ్యరో....'

'అవును తండ్రీ! అలివేలుమంగానాథా, నన్ను తీసుకుపోయి నా బిడ్డను దక్కించు.'

'అమ్మా! కాసేపు నోర్మూసుకో! ఆ దేవుడి పేరు తలిచావో నేనా నూతిలో పడతాను.'

అన్న తర్వాతగాని రాజుకి తా నేమన్నాడో తెలిసి రాలేదు. అవాక్కై కూర్చున్నారు తల్లీ, మామ్మాను. తండ్రి ముఖంలో ఆశ్చర్యం కనిపించినా, అయినా ఏం మాట్లాడలేదు.

'పుట్టిం దగ్గర్నుంచీ ఆ దేవుడిని కొలుస్తూనే వున్నాం. ఏం మంచి చేశాడని ఆయన్ని ప్రార్థిస్తారు?' అన్నాడు మెల్లిగా. ఆ మాటలు తన్ను తానుద్దేశించుకుని అన్నట్టుగా అతని కనిపించింది.

'అవేం మాటలురా? ఎవరికర్మ కెవరు కర్తలు! మన రాతకు దేవుణ్ణైనా నిందించి లాభం లేదు.'

'అందుకే బామ్మా, నేనంటున్నది. మన రాతప్రకారం మన జీవితాలు తెల్లవారవలసి వున్నప్పుడు, ఈ ముడుపులూ, మొక్కులూ, ప్రార్థనలూ దేనికి?' అన్నాడు రాజు.

ఈ గోలకి లేచిన పిల్లలు ఏడవడం మొదలుపెట్టారు.

'పంతులూ! యిట్టారా!' పరిచితమైన గొంతు విని రాజు పైకొచ్చాడు.

వాకిట్లో ఆరడుగుల ఎత్తు శరీరంమీద, ఒకప్పుడు తెల్లనిదైవుండి, ప్రస్తుతం మాసి నల్లగా కనబడుతున్న, చేతులున్న గుడ్డబనీను, చెవి సందున పొడుగాటి చుట్ట, చేతిలో చేపాటికఱ్ఱ, నూనూగుమీసాల మీద కోటేరులాటి ముక్కూ, పెద్ద నుదురుమీద పడుతున్న గిరజాల జుత్తూ కల కొండవాళ్ళ కుఱ్ఱాడు 'అర్జునుడు' కనిపించాడు.

"ఏందలా ఏడుత్తది ముసిల్ది' అన్నాడు అర్జునుడు. 'గుడిసెలో కినబడుతుంది ఏడుపు. ఆ పలాన లెగిసొచ్చినా యేంగోరం జరిగినాదో యేటోనని'

రాజు క్లుప్తంగా జరిగినదంతా వివరించాడు.

'ఎంత కావాలేటి సొమ్ము?'

'కనీసం ఓ యాభై వుండాలి.'

'అయిత్సరే! నా నరగంటలో తిరిగొత్తాను. గంగులుగాడి బండి కూడా తీసుకొత్తా. పెయానంకి రడీగా వుండో!'

'అర్జునా' అనబోయిన పిలుపు రాజు నోటిలోనే వుండిపోయింది.

అర్జునుడేం చేస్తాడో, డబ్బెలా తెస్తాడో, రాజుకి చూచాయగా తెలుసు. అయినా రాజు పరుగెడుతూ వెడుతున్న అర్జునుడినాపలేదు. అటే చూస్తూ నిల్చున్నాడు.

కాస్సేపు పోయింతర్వాత ఇంట్లోకి వెళ్ళి 'అమ్మా!' పట్నం వెల్దాం. బండి వస్తుంది. నాలుగు గుడ్డలు సర్దు' అన్నాడు.

అన్నట్టుగానే అర్జునుడు అరగంటలో వచ్చాడు. వీధి తలుపుదగ్గర గూడుబండి ఆగి వుంది.

బండి ఎక్కుతున్న రాజు చేతులో ఏదో వస్తు వుంచి గుప్పెట మూసాడు. చేతిలో రెండు అయిదురూపాయలనోట్లు కూడా పెట్టాడు.

'ఇవెక్కడివి?'

'కనుంకి కమీజు కొందామనుంచినాన్‌గాని తీసుకెళ్ళు' నీరసంగా మూలిగినట్టుగా వుంది అర్జునుడి కంఠస్వరం.

'ఏమైంది?'..... అన్నాడు రాజు, ఆత్రుతగా అర్జునుడి కణతలమీది చెయ్యి తొలగిస్తూ.

'ఏటవుద్ది? వాసంగుచ్చుకుని బొక్కైంది. గంగులూ! ఎల్లనీరా బండిని.' తెచ్చిపెట్టుకున్న విసుగుతో కేకవేసాడు అర్జునుడు.

కొరడాదెబ్బతో ఎద్లు కదిలాయి.

రాజు కష్టంమీద కళ్ళలో నీళ్ళు తిరగకుండా ఆపుకున్నాడు.

అర్జునుడి నుదిటి నుంచి కారిన రక్తంబొట్లు కర్తవ్యం ఉపదేశించి నట్టయింది.

భారం భగవంతుడిమీదవేసి లాభం లేదు. అదృష్టం వెతుక్కుంటూ వస్తుందని కూర్చోవీల్లేదు.

జీవితంలో పలాయనవాదం అసలేపనికి రాదు.

ఊహల్లోంచి తల్లి గుసగుస గొంతు లోకంలోకి తీసుకొచ్చింది.

'వెధవ ఎక్కడేనా ఎత్తుకురాలేదు కదా! ఏమిటి పెట్టాడు చేతిలో? చూడనీ!'

రాజు పంచప్రాణాలు వున్నట్టు గుప్పెట ముడుచుకున్నాడు గట్టిగా.

'దొంగ సొమ్ము మనకెందుకురా? ఏ జన్మలో చేసుకున్న పాపమో యీనాడనుభ విస్తున్నాం. ఇంక యీ జన్మలో కూడానా?'

అప్పటికీ రాజు మాట్లాడలేదు.

చేతిలో వస్తువు దొంగతనానికి ప్రతీకో, త్యాగానికీ, సహానుభూతికీ, మానవత్వానికీ చిహ్నమో అతనికి తెలుసు.

అతనికి భయపడి, తల్లి మనసులోనే రామనామ స్మరణ చేసుకుంటున్నందువల్ల కాబోలు, పెదాలు కదిలి అస్పష్టంగా శబ్దాలు పైకొస్తున్నాయి.

ఇంజెక్షన్ పనిచెయ్యడం మొదలుపెట్టిందో, మళ్ళీ తెలివి తప్పిందోగాని, సుబ్బి కదలకుండా పడుకొంది.

చల్లగా తగిలి గాలి శరీరాన్ని, మనసుని సేద తీరుస్తున్నది.

చుట్ట అడ్డపొగ పెట్టుకుని, గంగులు 'తెల్లారిపో వచ్చినాది బాబూ!' అన్నాడు.

రాజు తలూపాడు.

ఇలకోళ్ళు 'కో' కూస్తున్నాయి.

లోకం ఉషోదయంకోసం ఊపిరి బిగబట్టుకు చూస్తున్నది.

**– భారతి మాసపత్రిక, జూన్, 1971**

# ముసుగు

"బొంయ్"....  "బొంయ్...."

"టింగ్..."....  "టింగ్..."

"కీ....కి...కి...కీ..."

ఖాకీబట్టలు. ఎఱ్ఱటోపీ. విజిల్.

"గాడిదకొడకా! రిక్షాతో సహా చావాలనుందేట్రా?"

"మాస్టారూ, ఫుట్‌పాత్ మీద నడవండి." తప్పకుండా, మురికి కాలువ. గలగల పారుతూ.

కాలువ మీద ఫుట్‌పాత్. అవినీతి మీద బురఖా.

"జాగ్రత్త. చూసుకు నడవండి."

అక్కడక్కడా రాతి పలకలు తొలగించి ఉన్న ఫుట్‌పాత్. నోళ్లు తెరుచుకుని ఉన్న జైళ్ళు. ఉహుఁ. జైళ్ళేమిటి, నా బొంద!

"ఇచ్చట అందముగా క్షవరము చేబడును."

".... గుర్తుకే మీ ఓటు."

"భోజనము తయారుగా ఉన్నది."

ఎవరికి తయారుగా ఉన్నది? ఉన్నచో... కడుపులో కాళ్లు ముడుచుకుని పడుకోవడం దేనికి?

ఈగలు. తోలుకోదేం? ఆడది. ఎత్తుగా. భారీగా. మురికిగా. పైగుడ్డ తొలగిన శరీరం. సిగ్గులేదూ? రోగం. మచ్చలు.

"బాబూ! దరమం, బాబూ!"

తెల్లపాంటు. "జేబులో బొమ్మా! జేజేల బొమ్మా!" లేదు. డబ్బులేవీ? లేవు.

శనివారం. ఆనందరావు. జగన్నాథం. శ్రీరాములు. హాస్టలు. ఫలహారం చెయ్యరు. భోజనం చెయ్యను.

"ఎందుకు చెయ్యరు?"

"ఏడుకొండలవాడా వెంకటరమణా! గోవిందా! గోవిందా! జోగితల్లీ! తిరుపతి వెళుతున్నాం."

చిన్నప్పుడు, ఇంకా ధర్మఘారం. టైఫాయిడు. అమ్మ. మొక్కుబడులు. రాత్రి ఎవరూ భోజనంచెయ్యరు.

ఇల్లు. నూరుమైళ్ళ దూరం.

"దీపాలు వెలిగిచండ్రా సంజెవేళ."

"కిరసనాయిలు లేదు, బామ్మా!

"ఒరే నానిగా! కోమటికొట్టు నుంచి అణా బెల్లం తేరా!"

"పిల్ల యింకా రాలేదేం చెప్మా!"

"సూరీడూ! అదిగో బస్సు వచ్చినట్టుంది. ఎవరినైనా స్టాండుకి పంపించు." కళ్ళముందు బొమ్మలు.

కదిలే బొమ్మల కళ్ళల్లో ఆశలు.

ఈ ఏటితో చదువు పూర్తవుతుంది. వాడికి ఉద్యోగం రాగానే నీ బాకీ తీర్చెయ్యనూ!

"చిరంజీవి తమ్ముడికి శుభాశీస్సులు!"

నువ్వు శ్రద్ధగా చదివి ఫస్టు క్లాసులో పాసవుతావని ఆశిస్తున్నాము."

"ఒరేయ్! చూడండ్రా! వాణ్ణి చూసి బుద్ధితెచ్చుకోండ్రా!"

"పాపము శమించుగాక! నాకు క్లాసు పుస్తకం తీస్తేనే తలనొప్పి."

"ఏరా రాముూ, మధు బుక్స్ చదివావా?"

"ఎందుకురా చెడిపెదరు? రాముడు ఒక మంచి బాలుడు. రామా ఈజ్ ఎ గుడ్ బోయ్."

నవ్వులు. హేళన.

"అబ్బే లేదురా! ఇప్పుడే అయిదు నిమిషాలయింది."

క్షమాపణ. టాప్. టేబిల్‌మీద హిస్టరీ టెక్స్ట్ బుక్.

"తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని ఆశిస్తున్నాను."

చప్పట్లు. కళాశాల ఎన్నికలు. ఫంక్షన్లు.

"నిలువవే వాలుకన్నుల దానా!"

"మీరా, భూషణం. పిక్నిక్‌లో పేకాటా? లేక...."

నల్లబల్ల, 'కాగడా' తెల్లటి అక్షరాలు.

"ఎవరు రాసారిది?" నిశ్శబ్దం.

"అన్‌లెస్ యు టెల్ హిస్ నేమ్, ఐ వోన్‌ట్ టీచ్ ఎనీ మోర్!"

పిల్లి కూత. "థ్యాంక్యూ, సార్!"

".... నశించాలి!" "డౌన్! డౌన్!"

ఫస్ట్‌డే. ఫస్ట్‌షో. లీలామహల్. బ్లో హాట్. బ్లో కోల్డ్.

ఫస్టుక్లాసు. దూరం. చాలాదూరం. ఉద్యోగం. బాకీలు.

ఒకటీ, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు శాల్తీలు. తనతో కలిసి ఆరున్నొక్క నోర్లు. కడుపులు. ఆకలి. అప్పులు. చదువు. ఉద్యోగం. సుఖం.

"బహుదూరపు బాటసారీ!

ఇటు రావో ఒక్కసారీ!"

"నేడే బ్రహ్మాండమైన విడుదల. కనీ వినీ ఎరుగని అద్భుత చిత్రం."

తొడలు. నున్నగా. నగ్నంగా.

గడ్డంని రాస్తూ గడ్డం. ఆడదాని గుండెలమీద మగవాడి ముఖం!

".... అనుపమాన చిత్రరాజం. తప్పక చూడండి." తిప్పలు మీవండి.

"టైమెంతైందండి?" నీలం నిక్కరు మీద తెల్లచొక్కా. పసిగొంతు. నానిగాడు.

"నాలుగుంపావు."

అయిదు గంటలు. శనివారం. సాయంత్రం. పార్టీ.

"మళ్ళీ కలుస్తామో కలియమో అంతా?"

ఫోటో. సినిమా.

"ప్రతివాడూ పదిరూపాయలు."

"సో సింపుల్."

"అగుమాగుము తెరుపరీ!

ఆయాన ఖేదమపనయింపుము."

చల్లదనం. గాజు జాడీలు. వాసన. ఈగలు. తాజా చెరుకురసం. చిన్నగ్లాసు పదిపైసలు.

పది రూపాయలు. పది పైసలు లేవు.

టెరిలీన్ స్లాక్. బిన్నీ పాంటు. హాస్టలు.

కాలేజీ చదువు. పది పైసలు లేవు. పార్టీ. పదిరూపాయలు.

ఫైనలియర్. పరీక్షలు.

"లక్కగృహాలను విడిచి రండి."

తమరు ఉద్యోగాల నెందుకు వదులుకోరు?

"వీడొక్కడు క్లాసుకెళ్లి బాగుపడి పోతాడ్రా!"

నువ్వెందుకు ట్యూషన్ చదువుతున్నావు?

"హాస్టల్లో వీ డొకడు బయలుదేరాడ్రా! పుస్తకం పురుగు!"

నువ్వు అందరూ పడుకున్న తరువాత, అలారం పెట్టుకుని లేచి, పాఠాలు బట్టీ పడతావ్ దేనికి?

మనసులో ముళ్ళు. సందేహాల కుళ్ళు. పైకి రావేం? మనసులని ఎక్స్... రే. ఫోటో తియ్యాలి.

"ఫోటోలు అందముగా తీయబడును."

ఫోటో. పార్టీ. సినిమా. పదిరూపాయలు. అప్పు. అమ్మో!

"ఒరే శ్రీరాములూ, ఆనందరావ్, జగన్నాథం, శ్రీనిగా, అజిత్, స్వామీ, అందరూ వినండ్రా! ఈ వేళ చెప్పేస్తాను. బాబూ! నాలుగేళ్ళురా. నిప్పురా. 'చిచ్చొడిం గట్టినయట్లు....' భరించాన్రా!

అభిమానం. అహం. వద్దు. వద్దు. వద్దు తండ్రీ! నేనేం చెప్పలేను. చిక్కు విప్పలేను.

"ముసుగు తీయకు మోము చూపకు...."

"ఒరేయ్! మనిషి సుఖించేది విద్యార్థిగా ఉన్న నాలుగురోజులేరా! బ్రతుకుని 'ఎంజాయ్' చేయవలసిన రోజుల్లో పుస్తకాలు పట్టుకు ముసలమ్మలా కూర్చుంటే ఇంక 'థ్రిల్' ఏముంటుందిరా?"

ఎస్. ఐ ఎగ్రీ. త్రీ ఛీర్స్ టు సుధీర్.

"ఈ జోడి బి.ఏ.పాసైనా, ఫెయిలైనా, గుమాస్తా బ్రతుకేరా మనకి. దానికైనా గ్యారంటీ లేదు. కనీసం ఇపుడైనా కులాసాగా గడపకపోతే..."

ఓ.కె. మై మాస్టర్స్! లెటజ్ ఎంజాయ్!

ఎన్నికలు.

అమ్మాయిల్నీ, లెక్చరర్లనీ ఏడిపించడాలు.

ఫస్టు డే. ఫస్టు షోలు.

బంద్‌లు.

స్ట్రైకులు.

రాజకీయాల్లో పావులు.

"అయినను పోయి రావలయు హస్తినకు..."

హాజరవక తీరదు. పరీక్షలు.

పరీక్షల ముందు పార్టీ.

ఫైనలియరు. ఫైనల్‌గా.

పదిరూపాయలు.

"గురూ! ప్రతి పార్టీకి అరువు బేరమే చేసావు. ది సీజ్ లాస్ట్ అండ్ ఫైనల్.

ఈసారీ పాత పాట పాడకు."

"డబ్బుకోసమేనా మీ చింత మార్గదర్శి ఉన్నది మీ చెంత."

మెట్లు. వంకర టింకరగా. మేడ.

టేబిల్‌మీద వంగిన తల.

"డబ్బు.... కావాలి."

"స్కీము... చేరాలి. నెల నెలా..."

"థాంక్యూ! ఆలోచించి చెపుతాను."

అత్త. అమావాస్య.

నాలుగున్నర. అరగంట. పార్టీ.

"వీడెప్పుడూ ఇంతే."

చెప్పేస్తాను.

'దాచిన దాగదు.'

"ఏటి బాబూ! పిలిచినా పలక్కుండా పోతన్నారు!"

అప్పారావు, హాస్టలు. తెల్లపంచ. ఖాకీచొక్కా. రాత్రిళ్ళు దగ్గు. నులకమంచం. అప్పులిస్తాడు. వడ్డీకి. తాకట్టుంచుకుని.

వాచ్‌మేన్.

మేన్ వాచ్!

వాచీ!

నాలుగు నలభై ఏడు.

"అప్పారావ్! పదిహేను రూపాయలు కావాలి. వాచీ ఉంచుకుని."

నవ్వు.

'చూసావా? నన్నడక్క నీకు తప్పలే'దన్నట్టు.

ఖాకీ చొక్కా లోపల, తెల్ల బనీను లోపల. లోపల జేబులోంచి. మూడు అయిదులు.

"ఏయ్ రిక్షా! అలంకార్ హోటల్‌కి పోనియ్!"

మెయిన్‌రోడ్డులోంచి సందులోకి..... పెంటకుప్పలు. బహిరంగపు. పాయిఖానా.

వన్ వే ట్రాఫిక్.

ఒక వేపునే రహదారి.

శ్రీమంతులు శ్రీశ్రీమంతులు కారండి. పేదలు నిరుపేదలుగా మారండి. రండి. మరోదారి లేదు.

"ఏటిత్తారో బాబూ సుట్టూ తిప్పి నాక్కొచ్చినా."

"హలో! అంతా వచ్చేసారా?"

"శర్మ రాలే దింకా!"

"వాచీ ఏదిరా?" ఆశ్చర్యం.

"క్రింద పడి బాలన్స్ స్ట్రాప్ తెగిపోతే 'రిపేరు' కిచ్చా." అబద్ధం. తొణుకుబెణుకు లేకుండా.

నటన. భేషజం. బ్రతుకు.

✪ ✪ ✪

"అవున్రా నే చెప్పను. మా నాన్న తాలూకా ఆఫీసు గుమాస్తాగా రిటైరయ్యాడనీ, ఆయన పెన్షన్ ఇంకా మంజురూ కాలేదనీ, మా అక్క పెళ్లి వాయిదా వేసి ఉద్యోగం చేసి సంసారాన్ని సాకుతూ, ఆరు కడుపుల్ని అర్థాకలితో ఉంచుతూ, నాకు చదువు చెప్పిస్తున్నాదని.

నే చెప్పనుగాక చెప్పన్రా! నా బ్రతుకు, నా చదువు దినదినగండం వెయ్యేళ్ళాయుష్షనీ!"

– ఆంధ్రప్రభ వారపత్రిక, **14.7.1971**

# మన కొద్దీ మంచితనం

వెంకటరత్నంపట్ల నాకు సానుభూతిలేదు. వెంకటరత్నంపట్ల సానుభూతి చూపించే వారిపట్ల నాకు అసహ్యం మాత్రమే ఉంది.

వెంకటరత్నంపట్ల అసహ్యం చూపించే వారిపట్ల నాకు సానుభూతి ఉంది.

వెంకటరత్నం శేషాచలం, నరసమ్మల కొడుకు. 'ఒక్కగానొక్క మగనలుసు' అని నొక్కి చెప్పాలిక్కడ. వెంకటరత్నం తల్లిదండ్రులకి ఒక్కడే మొగపిల్లడవడం ఎన్నో అనర్థాలకు దారితీసిందని నమ్ముతాన్నేను.

వెంకటరత్నం పిరికివాడు.

"ప్చ్. చీకటంటే చంటాడికంత భయమేవిటే!" అంటూ వాళ్ళ నాన్న మీసాల మూతితో అయిదారేళ్ళ వెంకటరత్నాన్ని ముద్దుపెట్టుకునేవాడు. వాళ్ళమ్మ నరసమ్మ, కొడుకు ఘనకార్యం చేసినట్టు ముసిముసిగా నవ్వేది.

వెంకటరత్నం మొగమాటస్తుడు.

"వాడికి అమ్మా నాన్నల దగ్గర కూడా బిడియమే నాయే" అంటూ బుగ్గలు పుణికి, వెంకటరత్నం మామ్మ, ఉహూం మురిసిపోయేది.

వెంకటరత్నం తనకుతానై ఏదీ చేసుకోవడం కాదు గదా, అడగలేదు కూడా.

"వాడికి తలనూనె దగ్గర నుంచీ నేనే రాయాలి. నేను కలపందే ముద్దయినా నోట్లో పెట్టుకోలేడు. మా నాన్న కే క్షణా నేది కావాలో నాకు తెలుసు" కాంతమ్మ మెటికలు విరుస్తుండడం విననట్టే, నరసమ్మ రెండిళ్ళ మధ్య గోడ దగ్గర నిల్చుని చెప్పుకుపోయేది.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఇస్తూ పైన చెప్పిన నా మాటల్ని సమర్థించుకోగలను.

వెంకటరత్నం మధ్య తరగతిక్కూడా చెందుతాడు.

ఒక్కడే కొడుకవడం కన్నా కూడా వెంకటరత్నం జీవితానికి దాపురించిన శాపమేమిటయ్యా అంటే, ఇదొకటేనని నిమిషం సందేహించకుండా చెప్పగలను.

చెట్టుమీద పండుండేది. దొరగారిది మామిడితోట. కిందనున్న రాయిచ్చుకు కొడితే నేల రాల్తుంది. కాని వెంకటరత్నానికి పండువంక చూపుపోకుండానే రాయిమీద కన్నుపడినా, చెయ్యిసాగేది కాదు. రోడ్డువారగా నిల్చునేవాడు.

'పందురాలితే బావున్ను. ఏ గాలి రివటైనా తనకు సాయం చేస్తే బావున్ను' అని లొట్టలువేస్తూ కాసేపు నిల్చుని 'అందని ద్రాక్షపళ్ళు పుల్లన' అనుకుని కాళ్ళీడ్చుకుంటూ పోయేవాడు.

వెంకటరత్నం చిన్నప్పుడు వాళ్ళింట్లో పండుగ జరిగింది. పండుగంటే మామూలు పండుగనుకుంటున్నారేమో. దసరా, దీపావళీ, సంక్రాంతి, ఉగాది ల్లాంటిది కాదు. జండా పండుగా కాదు. మరి, వెంకటరత్నం పుట్టినరోజు పండుగసలే కాదు.

ఊర్లో బస్సెక్కిస్తే పాతికమైళ్ల దూరంలో ఉన్న వాళ్ళ అక్క అత్తవారింటికి, ఫిఫ్తఫారం చదువుతున్న వెంకటరత్నం ఒక్కడూ వెళ్లి, వాళ్ళక్కను తీసుకుని తిరిగి రావడం ఆ పండుగ. ఆ రోజు వెంకటరత్నం బామ్మ ఈ విషయం చెప్పని ఇల్లు ఆ వీధిలో లేదు.

అయితే వెంకటరత్నం, జీవితంలో పూర్తిగా సంతోషించి, తలెత్తుకు నడచిన సంఘటనలు రెండు మాత్రం వున్నాయని అతని మనసు పుస్తకంలా చదవగలను కాబట్టి నేను చెప్పగలను.

ఒకటి చిన్నప్పటిది.

శ్రీనివాసరావని ఓ రాలుగాయి వుండేవాడు, వెంకటరత్నం తరగతిలో. ఒక సాయం కాలం ధైర్యంచేసి ఇద్దరూ అబ్బాయిగారి తోటలో జీడిచెట్టెక్కి జీడిపళ్లు దొంగిలించుకొచ్చారు.

తను అంతటితో మనిషైనట్టుగా వెంకటరత్నానికి ఆ రోజు, చిన్నప్పుడు అనిపించింది. పూర్తిగా ఆ భావానికి కారణం నాటి కతనికి తెలియకపోయినా, ఆనందం రెక్కలువిప్పింది.

అంతకు కొన్నాళ్ళ క్రితం బడితోటలో అతను బ్యాడ్మింటన్ బ్యాట్‌తో ఆటాడుతూ, ఒకటికి నెపంతో తోటలో దూరిన పిల్లలందరి మల్లే, మామిడికాయ ఒకటి రాల్చబోయాడు. ఎత్తిన బ్యాటునెవరో చేత్తో గట్టిగా పట్టుకున్నారు. వెనక్కి తిరిగి చూస్తే బలమైన కండలు, మెడలోని కాశీతాడు మాత్రమే కనబడ్డాయి. ఇంక ఒకటే పరుగు.

తోటకాపలావాడిని ఆ బ్యాటు గురించి అడిగే ధైర్యం ఆ తర్వాత ఎన్నాళ్ళకీ లేకపోయింది. ఎప్పుడు కనబడినా వాడు నవ్వేవాడు. వెంకటరత్నం తలదించుకునేవాడు. వెంకటరత్నం "ఇక మీదట వాడికళ్ళలోకి సూటిగా చూస్తూ నవ్వగలను" అనుకున్నాడానాడు జీడిపళ్ళు దొంగిలించి.

ఇంకోసారి కాలేజీలో చదువుతుండగా వెంకటరత్నం పూర్ణాహాల్లో సినిమాకెళ్ళాడు. బాల్కనీకి. ఇంటర్వల్‌లో, రాబోవు చిత్రాల పోస్టర్లు చూద్దామని వచ్చిన ఇద్దరు స్నేహితులు కనబడ్డారు, కిందకు దిగి పచార్లు చేస్తుంటే. ఛటుక్కున వెంకటరత్నం బుఱ్ఱలో ఒక ఆలోచన మెరిసింది.

"ఒరే శేఖరం! ప్రసాద్! నాతో వచ్చెయ్యండిరా, సినిమాకి. హాలు వాడు ప్యాసు

లియ్యడం లేదు" అన్నాడు. అనగానే గుండెదడ పట్టుకుంది.

శేఖరం 'ఎందుకురా నేనెప్పుడో చూశాను. డబ్బింగ్ సినిమాకూడా' అని నసిగాడు.

ఆ నసుగుడులో అసలర్థం వెంకటరత్నానికి తెలుసు. ప్రసాద్ మాత్రం పట్టువదల్లేదు.

'పదండిరా భయం దేనికి' అన్నాడు కళ్ళద్దాలలో నుంచి మెఱుస్తున్న కళ్ళతో చూస్తూ. వెంకటరత్నానికి మనసు పీకింది. గుండె మాత్రం దడదడలాడుతూనే ఉంది.

ఏవో స్లైడ్స్ చూపుతుంటే, ఒకరితర్వాత ఒకరుగా ముగ్గురూ హాల్లో దూరారు. గేటు దగ్గర ఎవరూ ఆటకాయించలేదు. గుండె బెదురుగానే వున్నా, సినిమా సాంతం చూశాడు. స్నేహితులతో అల్లరిచేస్తూ.

వెంకటరత్నం 'రెడ్డికీ విషయం తెలిస్తేనా' అనుకున్నాడు సినిమా చూస్తూ.

రెడ్డికీ విషయం తెలియదు. రెడ్డి చదువు పూర్తిచేసి రెండేళ్ళయ్యింది. ఇప్పుడెక్కడున్నాడో వెంకటరత్నానికి తెలియదు. రెడ్డి ఫైనలియర్ డిగ్రీకోర్సు చదువుతున్నప్పుడు వెంకటరత్నం ఫస్టియర్ చదివేవాడు. రెడ్డి కూడా హాస్టల్‌లోనే వుండేవాడు.

ఒకరోజు సాయంకాలం టీబెల్లు మోగగానే బిలబిల్లాడుతూ అంతా గ్లాసులు పుచ్చుకు మెస్ వేపు పరిగెత్తారు. తాపీగా గ్లాసు పుచ్చుకొని వెంకటరత్నం వెళ్ళేసరికి, ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు మాత్రం అండాలో టీని గ్లాసులో పోసుకు, టీ తాగుతూ రేడియో రూంవేపు పోతున్నారు. పంతులు అక్కడ లేడు. వాళ్ళలాగే వెంకటరత్నం అండాలోంచి టీ తీసుకుంటుంటే రెడ్డి వచ్చాడు.

హాస్టల్ కమిటీ మెంబర్ హోదాలో 'ఏమిటండీ ఇది? ఎవరి మానాన వాళ్ళు టీ ముంచిపోసేసుకుంటుంటే కిచెన్ స్టాఫ్ దేనికి? ఇదేనండీ సివిలై...' రెడ్డిమాటలు పూర్తి కాకుండానే వెంకటరత్నం కళ్ళలో నీళ్లు తిరిగాయి. గ్లాసులోని టీ అండాలో వంపేసి, రూమ్‌కొచ్చి వాలుకుర్చీలో పడుకున్నాడు.

అక్కడ వుండాల్సిన పంతులు లేడని కాని, అందరూ చేసిన పనే తనూ చేసాడని కాని, ఇందులో కొంప మునిగిపోయోదేముందని కానీ, వెంకటరత్నం అనలేకపోయాడు. అప్పుడే కాదు. ఆ తర్వాత రెడ్డి రూమ్‌కివచ్చి, "సారీ" అంటూ ఏమో చెప్పినపుడు కూడా వెంకటరత్నం గొంతు పెగల్లేదు.

వెంకటరత్నం, ఆవేళ, సినిమా వదిలిన తర్వాత, ఆనందంగా రోడ్డుమీద నడుస్తూ "రెడ్డికీ విషయం తెలిస్తేనా" అనుకున్నాడు మరోసారి.

చిన్నప్పటిలా కాక, ఇప్పటి తన ఆనందానికి కూడా కారణం తెలిసింది వెంకట రత్నానికి స్పష్టా స్పష్టంగా.

ఇంకోసారి కాలేజిలో నాటకమైంది. వెంకటరత్నం డ్యూటీ ప్రోమ్టింగ్. నాటకంలో

హీరోయినుంది. అసలే అందమైంది. మేకప్‌లో అందానికి మారుపేరులా వుంది.

నాట్యసంఘం కార్యదర్శి, నాటకాలంటే చాలా ఇష్టమని చెప్పుకునే ఇంగ్లీష్ లెక్చరర్, స్టేజిమీద హీరోయిన్‌తో మాట్లాడుతూనో, ఆవిడ నోటిలో మాట నోటిలో వుండగానే కావల్సినవన్నీ అందిస్తూనో కాలం గడుపుతున్నారు.

తప్పనిసరిగా రంగాలంకరణ చేస్తున్న వాళ్ళు కూడా, వీలైనపుడల్లా హీరోయిన్ వంక చూస్తూనో, నవ్వించాలని యత్నిస్తోనో తాపత్రయపడుతున్నారు.

అంతా చూస్తున్న వెంకటరత్నానికి నిప్పులమీద నిల్చున్నట్లైంది. "పాపం ఆడది. మరో ఆధారంలేనిది. నలుగురిలో తిరిగి నాటకాలు వేస్తున్నంతలో ఎంత చులకనైపోయింది. ఆడదాన్ని భోగ్యవస్తువుగా తప్ప మరోలా చూడ్డం మగవాళ్ళకి చేతకాదులా వుంది.

ఇంతకీ అంత అందమైనది కోరి పెళ్ళాడమనొస్తే, ఒక్క రోమియో కూడా ముందుకురాడు." ఇలాంటి ఆలోచనలు మనసులో నిండి, ఎంత వేగంగా తీస్తారా తెర, ఈ తెరవెనక నాటకం ఎప్పుడంతమవుంతుందా అని ఎదురుచూడసాగాడు.

నాటకం మొదలైంది. రెండో రంగంలో స్టేజిపైన నటులంతా వున్నారు. హీరోయిన్ తప్ప. ఆవిడ వెంకటరత్నానికి తగుల్తూ, నాటకాన్ని, ప్రేక్షకులకు కనబడకుండా చూడాలని, ప్రయత్నిస్తోంది.

ఒక్కసారిగా సీనిక్ ఎఫెక్టు కోసం రంగంమీద లైట్లు ఆరిపోయాయి. దీపాలు వెలిగి, హీరోయిన్ చిలిపిగా చూసి, చేత్తో పెదాలమీద తడి తుడుచుకున్నప్పుడు, వెంకటరత్నానికి తాను చేసిన పని తెలిసింది.

ఇంగ్లీషు లెక్చరర్, నాట్యసంఘం కార్యదర్శి తన కన్నా మంచివారని తేలింది.

"నే నే గుంట దగ్గరికి పోను నీలా" అన్నాడు ముఖం తుడుచుకుంటూ బసవరాజు.

'పోయేందుకు దమ్మేదిరా వెధవ! జబ్బులంటుకు చస్తానని, పోలీసులు పట్టుకుంటారని, భయం నీకు' అన్నాడు సీతారామారావు నీళ్ళు పోసుకుంటూ నొప్పితో 'ఇస్' అనుకుంటూనే.

బ్రష్‌తో పళ్లు తోముకుంటున్న వెంకటరత్నానికి నిజమనిపించాయి సీతారామారావు మాటలు.

మనిషి తప్పుచేయకపోవడం దేనికో దానికి భయపడడం వలననే కాని, నీతితో బ్రతకాలన్న దీక్షతో కాదని, వెంకటరత్నంకొక అనుమానం ఆరంభమై దృఢపడసాగింది.

చెడు చేయగల ధైర్యం లేకపోవడం వలన మంచిగా బ్రతకడంలోని గొప్ప వెంకటరత్నానికి అర్థమవదు. అతని కర్థమయినదల్లా అతన్ని కూడా ఆ మాదిరి పిరికితనం ఆవరించి వుందని. అందుకే ఎప్పుడైనా చిన్న చిన్న అఘాయిత్యాలు చేస్తే తనకి ఆనందంగా వుంటుందని

వెంకటరత్నానికి తెలిసిందిప్పుడు.

ఇంకా అసలు కథలోకి రాలేకపోతున్నాను. వెంకటరత్నానికి మంచిగా బ్రతకాలనే వున్నది. కాని, ఆ మంచి బలహీనత నుంచి కాక, సత్వాన్నుంచి జనించాలన్న ఇచ్ఛ అంతకన్నా బలంగా వుంది.

గాయత్రి వల్లించే ఇష్టమూ, ఓపికా లేక, కంచంచుట్టూ ఇన్ని నీళ్ళు చల్లి, ఇంత నీరు ఔపోసనపట్టే కన్నా, జంధ్యంపోగు తెంపి పారెయ్యడం మంచిది. ఎదిరించే శక్తిలేకపోవడం మరణంతో సమానం. ఇలాంటివన్నీ వెంకటరత్నం మనసులో సదా మెదిలేవే.

ఇక్క డింకొక్క మాట చెప్పేస్తాను. లోకాన్ని చూస్తుంటాడు. లోకంలోని వైరుధ్యాన్ని చూస్తుంటాడు. కోరిందాన్ని దక్కించుకోలేక మనుష్యులు వల్లించే నీతిపాఠాల్ని వింటుంటాడు. మనసుకు నచ్చిన పని, మంచిదని తోచిన పని చెయ్యడమొక్కటే జీవితంలో ఆనందానికి మూలం. ఇది లేకపోవడమే బ్రతుకులో థ్రిల్ లోపించడానికి కారణం. హిప్పీ, హిప్పీ తరాలకు బీజం. ఈ లేకపోవడం తనలో వుండడాన్ని వెంకటరత్నం కనిపెట్టిన దగ్గర నుంచే, అతనికి అసలైన అశాంతి ఏర్పడింది.

ఆ రోజుల్లోనే ఒకమ్మాయిని చూశాడు మెయిన్ రోడ్డుమీద. పుస్తకాలు పట్టుకు వెళ్తోంది స్నేహితురాళ్ళతోబాటు. తెల్లగా వుంది. సన్నగా వుంది. ముఖం కోలగా వుంది. నుదిటిమీద దోసగింజ తిలకం ఉంది. చెవులకి రింగులు. రెండు జడలు. పువ్వుల పరికిణీ మీద నీలంవోణీ వేసుకుంది.

వెంకటరత్నానికి గుండె లయ తప్పినట్టయింది. ఆ అమ్మాయి కనుమరుగవుతుంటే హృదయం బాధతో కీచుమంది.

మర్నాడు అదే వేళకు, మెయిన్‌రోడ్డుమీద అక్కడే బీటు కాసాడు. ఆ అమ్మాయి కనబడింది. వాళ్ళ వెనకాతలే నడచివెళ్ళాడు. ఒక సాహసకార్యం చేస్తున్న వాడిమల్లే భావించు కుంటూ.

అమ్మాయిలంతా కొంచెం దూరంవెళ్ళి, మెయిన్‌రోడ్డుమీద నుంచి సందులోకి మళ్ళి, ఓ మేడలో దూరారు. పైన బోర్డు వుంది. 'హిందీ విద్యాలయము' అని. ఆ వేళలలో హిందీ రాష్ట్ర పరీక్షకు ట్యూషన్ చెబుతారని, వెంకటరత్నం ఎలాగైతేనేం కూపీ లాగాడు.

అప్పటికి వెంకటరత్నం పరీక్షలు నెల్లాళ్ళున్నాయి. చదవవలసినవి ఆర్నెల్లకి సరిపడా వున్నాయి. అయినా హిందీ నేర్చుకోవాలనిపించింది. రెండు, మూడురోజులు తిరిగి, ఎలాగైతేనేం ఒకరోజు ధైర్యం తెచ్చుకొని, మేడమీదకు వెళ్లి హిందీ నేర్చుకుంటానని, రాష్ట్ర పరీక్షకి వెళ్తానని జీతం కట్టివచ్చాడు.

మర్నాడు క్లాసులో అతనికెదురుగా చాపమీద ఆ అమ్మాయి వచ్చి కూర్చున్నప్పుడు

వెంకటరత్నం ఆనందానికి మేరలేదు. కలల హర్మ్యాలు స్కై స్క్రేపర్స్‌ని మించిపోతున్నా, తలమాత్రం పైకి లేవలేదు.

పారాణి పూసినట్టుగా, పావడా ఎత్తు అంచుపడి, అందంగా మెరుస్తున్న తెల్లని పాదాన్ని చూస్తూ కూర్చున్నాడు. క్లాసులో అతని ఈడు అబ్బాయి లెవరూ లేరు. పది పన్నెండేండ్ల కుఱ్ఱాళ్ళనిద్దరిని తప్పించి, అందరూ అమ్మాయిలే.

మొదట పలకరించుదామనుకున్నాడు. తరవాత నోట్సు అడుగుదామనుకున్నాడు. ఆ అమ్మాయి పేరు లక్ష్మి. చిలిపిగా వుండేది. అల్లరిచేసి టీచరు చేత మొట్టికాయలు తినేది.

“మేడమ్! బుద్ధుడు కత్తితో స్వయంగా తలబోడి చేసుకున్నాడని బుక్‌లో వుంటే, అంత చక్కటి హెయిర్ స్టయిల్‌తో బొమ్మలువేస్తారేమిటండీ!" అనేది. అలాంటి సమయాలలో చెమటపోసిన శరీరానికి చల్లగా గాలితగిల్తే కలిగే ఆనందంతో వెంకటరత్నం మనసునిండేది.

అయినా ఏం లాభం? వెంకటరత్నం ట్యూషన్ చదివిన నెల్లాళ్ళలోనూ, ఒక్కసారీ నోరుమెదపలేదు. లక్ష్మి, వెంకటరత్నం, ఆకాశం, భూమి అంత దూరంగానే వుండిపోయారు.

క్షితిజ రేఖవద్ద భూమీ ఆకాశం కలిసినట్లుంటాయి.

వెంకటరత్నం ఇలా ఆలోచించేవాడు.

ఒకానొక రోజున లక్ష్మి అంటుంది, కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా “ఏమండీ చూపులతో నన్నెంత కలవరపెడుతున్నారు. మీ చూపుల పుష్పాలతో నా పాదార్చన చేస్తున్నారు. మాట్లాడరేం? నా హృదయమంతా ఎన్నడో నిండి వుండీ, మౌనంగా వుంటారేం? నేను మీదాన్నండి. యుగయుగాల నుండి మీకోసం...”

వెంకటరత్నం కళ్ళంట నిజంగా నీళ్ళొచ్చేవి. ‘లక్ష్మీ! నాకు తెలుసు. నాకు నువ్వు....” మాటలు పూర్తికాకుండానే లక్ష్మి అతని హృదయంలో ఒదిగి పోయేది. లేదా. వాళ్ళ నాన్న పిలిచి, మీసాలను చేత్తో సవరించుకుంటూ “నాయనా వెంకటరత్నం! రాత్రి కలొచ్చిందిరా. కలలో సింహాచలం నరసింహస్వామి కనిపించి, మీ వెంకటరత్నం ఒక అమ్మాయిని ప్రేమించాడు. వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసి నా గుడికి తీసుకురా” అన్నాడురా. నిజమైతే చెప్పరా బాబూ కళ్యాణం కానిచ్చేద్దాం” అనేవాడు.

వెంకటరత్నం ఆలోచనల క్షితిజరేఖ వద్ద తనూ లక్ష్మి ఐక్యమైనట్టు కలగనడమే తప్ప, వెంకటరత్నం ఎప్పుడూ ఆమెతో మాట్లాడే ధైర్యం చెయ్యలేదు.

పరీక్షలై వాళ్ళ వూరు వెళ్ళిపోయినపుడు, నిద్రపట్టక బాధపడే కొన్ని రాత్రుల తర్వాత, ఒక ఉదయం కొత్త సంవత్సరం గ్రీటింగ్స్ మాత్రం లక్ష్మి పేర పంపాడు.

అందులో ఫ్రమ్ అడ్రస్ అయినా రాసే ధైర్యం చెయ్యలేకపోయినా, తర్వాత కొన్నాళ్ళకి నాతో అన్నాడు కదా, “లక్ష్మితో మాట్లాడానే అనుకో, ప్రేమ సంపాదించానే అనుకో.

వాళ్ళ కులం వేరు. పెండ్లికి మావాళ్ళు, వాళ్ళవాళ్ళు అంగీకరించకపోవచ్చు. ఇంట్లో ఎదిరించే ధైర్యం మాకు లేకపోవచ్చు. అపుడు లక్ష్మిని అన్యాయంచేసి ఇద్దరమూ బాధపడేకన్నా ఇదే మంచిది కదా" అని.

నా కొళ్ళు మండుకొచ్చింది. 'ఇవన్నీ ఆలోచించే లక్ష్మితో మాట్లాడలేదా? లేక లక్ష్మితో మాట్లాడేందుకు కలిగిన భయాన్ని ఇలా కప్పి పుచ్చుకుంటున్నావా?' అని అడగాలనిపించినా, అసహ్యం వేసి ఊరుకున్నాను.

ఇదంతా రాయకపోదును. వెంకటరత్నం కథానాయకుడు కాడు. అతని జీవితంలోంచి కథను పిండాలనీ నాకు లేదు. వెంకటరత్నంమీద నాకు ద్వేషం కూడా లేదు. కాని అతనే నన్ను ప్రొవోక్ చేశాడు.

అదెలాగంటే, ఇవాళ సాయంకాలం అతను బీచ్‌లో పచార్లు చేస్తూ నాతో ఒక మాటన్నాడు. ఆ మాట చెప్పే ముందు మరో చిన్న సంఘటన చెప్పితీరాలి.

వెంకటరత్నం ప్రస్తుతం సెప్టెంబరు పరీక్షలకి చదువుతూ, కృష్ణానగర్‌లో గది అద్దెకు తీసుకు వుంటున్నాడు. వెంకటరత్నం గది కిటికీలోంచి చూస్తే, సరిగా ఎదురుగా వున్న ఎదురింటి కిటికీ కనబడుతుంది.

ఆ కిటికీలోంచి చక్రాల్లాంటి రెండు కళ్లు, నడుంవరకు శరీరం వెంకటరత్నానికి కనబడతాయి. ఆ కళ్లు, వెంకటరత్నం గదిలో వుండి, ఆ కళ్ళ హక్కుదారుడు ఇంట్లో లేనపుడు, కిటికీ దగ్గర తారట్లాడేవి.

పెద్ద పెద్ద పాయలుగా జుత్తును వేరుచేసి దువ్వుకుంటూనో. అద్దంలో చూసుకుంటూ తెల్లని, గుండ్రని ముఖంమీద బొట్టుదిద్దుకుంటూనో. లేదా వూరికే అలా చూస్తూనో.

వెంకటరత్నం నవ్వేవాడు. అటు చూసి, కన్నుగీటేవాడు. పెదాలతో గాలిని ముద్దుపెట్టుకునేవాడు. ఆ శబ్దానికి, ఎటో చూస్తున్నట్టు నటించే ఆ ముఖం, వెంకటరత్నం వేపు తిరిగి, పళ్ళ వరస మెరిసేలా నవ్వేది.

తొలగించిన పైటను ఎంత సేపటి వరకో సర్దుకోవడం మరచిపోయేది. వెంకటరత్నం చేతిలో పుస్తకం వుండేది, అంతా కుఱ్ఱాడు చదువుకుంటున్నాడనుకునేందుకు.

నిన్న ఉదయం కూరలు బేరమాడుతూ ఆవిడ, వెంకటరత్నంవైపు చూస్తూ "ఎందుకే కేజీ బంగాళా దుంపలు. మా ఆయన ఊర్లో లేరు. రెండురోజుల దాకా రారు కూడా" అని కూరల మనిషితో అనడం వినిపించింది.

కూరలది "అయితే అమ్మగోరూ! పిల్లల నెట్టుకుని ఒక్కరే తొంగుంటారా రాత్రుల్లు" అని ఆశ్చర్యపోబోయింది.

"భయమెందుకే ఆ మాత్రం తోడుండరా ఇరుగూ, పొరుగూ, అందులోనూ రాత్రుళ్ళు"

అంటూ ఆవిడ బారెడు జడ, నల్లత్రాచులాటిది, గుండెలమీద నుంచీ విలాసంగా, వెనక్కు వీపుమీద పడేలా, మెడ విదిలించింది.

వెంకటరత్నం పట్టుకున్న కిటికీ ఊచలు కూడా వేడెక్కాయి.

రాత్రి ముందు గది తలుపులు మూస్తూ, చీడీ మీద నిల్చున్న వెంకటరత్నంతో 'తరువాత' అని పైకని, చేతివేళ్లు పదీ చూపించి, రమ్మన్నట్టు తలూపుతూ మూసిన తలుపుల వెనక మెఱుపు తీగలా అదృశ్యమైంది.

వెంకటరత్నానికా రాత్రి నిద్దురలేదు.

"హఠాత్తుగా, మధ్యరాత్రి ఆమె మొగుడొచ్చి తలుపు తడితే", పక్కింటివాళ్లు తలుపు తెరచిన శబ్దాలకి లేచి 'ఎవరండీ వస్తా' అని అడిగితే, 'తలుపులు తెరిచి వుంచిందో, లేదో', 'అవన్నీ అటుంచు. తీరా తలుపులు తడితే, ఆవిడ కేకలేసి అల్లరిచేస్తే' అలాగే మంచంమీద కూర్చుని, వాలుకుర్చీలో చేరబడి, మెలకువగానే తెల్లవార్లూ గడిపాడు నిన్నటి రాత్రి వెంకటరత్నం.

వెంకటరత్నం కాని పనులు చెయ్యాలని నాకు లేదు. కాని చేతకానితనాన్ని మంచి తనంగా నమ్మమంటేనే నాకు మండుకొస్తుంది.

ఇందాక బీచ్‌లో పచార్లు చేస్తూ నాతో అంటాడు కదా. "చూడు మంచిపనే చేసాను. రంకు, బొంకు దాగవన్నారు. ఇదంతా ఆవిడ భర్తకు తెలిస్తే, ఒక సంసారాన్ని నాశనంచేసిన పాపం నాకొద్దు" నేను మరి వినిపించుకోలేదు.

వెంకటరత్నంపట్ల సానుభూతి చూపించడమంటే తమలోని దౌర్బల్యాన్ని చూసి నిట్టూర్చడమేనని నమ్ముతాను. అందుకే అలాంటి వారి పట్ల నాకసహ్యం మాత్రమే వుంది.

వెంకటరత్నం పట్ల అసహ్యం చూపేవాళ్ళు-నూటికి తొంభైమంది -తమ జీవితంలో అంతకంటే ముందుకుపోలేరన్న అపనమ్మకం వుండడంవల్ల వారంటే నాకు సానుభూతి మాత్రమే ఉంది.

పోతే ముందే చెప్పినట్లు వెంకటరత్నం పట్ల నాకు సానుభూతి లేదు. ఎందుకంటే మరి.... నా పేరే వెంకటరత్నం.

– స్వాతి మాసపత్రిక, డిసెంబర్, 1971

# గోరంత దీపము

"నా నయ్యాలే సెప్పినాను. నువ్వినుకున్నావు కాదు." లక్షుంనాయుడు నిష్ఠూరంగా అన్నాడు. రామినాయుడు మారాడలేదు. "ఏటి పల్ల కూరుకోడమేనా?" రెట్టించాడు లక్షుం నాయుడు. చెవిని కాదుంది. తెల్ల పంచమీద, చేతులు, జేబు ఉన్న బనీనుంది. నెరిసిన బొద్దుమీసాలున్నాయి. అంటకత్తె రేయించిన తలుంది. అన్నిటికన్నా ముఖ్యం ముఖంలో సూటైన ముక్కుంది. ముక్కుమీద కోపముంది. గొంతుకిల్లా కూర్చున్న లక్షుంనాయుడు చేతిలో చేపాటి కఱ్ఱా ఉంది.

"ఏఁట్రయ్యా! ఆకాడ కీ సవురమంతా నీ సొమ్మే అయినట్టు వదుర్తా" వన్నాదు చలమయ్య. చలమయ్య సన్నటి మనిషి. లోతుకుపోయిన దవడలు. మనుష్యుల్ని సందేహంగా చూసే కళ్ళు. వ్యవసాయం మానేసి బియ్యం వర్తకం చేస్తున్నాడు. చెయ్యి ముట్టు సరసమంటే కొంచెం జంకుతాడు.

లక్షుంనాయుడు చలమయ్యని మింగేసేలా చూశాడు. కాని మాట్లాడలేదు. నాగలితో నేలని చీల్చి, పంటలు పండించనివాడు నాయుడే కాదని, నాయుడుకాని వాడి కిందులో ప్రమేయం లేదని లక్షుంనాయుడు ఉద్దేశం.

కాని, శివున్నాయుడు అడ్డపొగ పెట్టిన చుట్టను పైకి తీసి తుపుక్కున ఉమ్మేస్తూ, "నా నింకా బతికే ఉన్నాను. ఒంట్లో సేవా, పౌరుషమూ ఉన్న నాయుళ్ళంతా నా ఎనకాలొత్తే ఆల్ల పొగరేటో నానే సూత్తాను" అన్నాడు.

శివున్నాయుడిది గుండ్రని ముఖం. వెనక్కి దువ్విన జుత్తు, నున్నగా నూనె రాసి ముడి చుట్టి ఉంది. చెవులకి తమ్మెట్లున్నాయి. తలా, గెడ్డం, నెరిసినా, శరీరం మరీ ముడతలు తేల్లేదు. ఎనభై ఏళ్ళవాడు డెబ్బై దరిదాపుల్లో ఉన్నట్టు కనపడతాడు. కట్టుకున్న పొట్టి పంచెమీద కొత్త నాగులగావంచా వేసుకున్నాడు.

ఆవేళే నాగుల చవితి.

ఇప్పుడు రామినాయుడు గొంతువిప్పాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నందువల్ల నరాలు తేలిన నుదుటిని, నవ్వుముఖానికనుగుణంగా మార్చాడు. తెల్లటి మనిషి, వంకీలు తిరిగిన

క్రాఫింగ్. తొడుక్కున్న ఖద్దరు పంచ, లాల్చీ, పైన జండా అంచు ఖద్దరు కండువా... మనిషిని చూడగానే గౌరవం కలిగించేటట్టున్నాడు. నలభయ్యోపడి. ఆ ఊరి పంచాయతీ ప్రెసిడెంటతనే!

"దద్దా! తెలిసినవాడివి. పెద్దవాడివి. నువ్వే ఆవేశపడితే నేను చెప్పేదేముంది? గురువుగా రూర్లో లేరు. ఆ రోజు నందెమ్మని రాంభజనలోకాక, దాలినాయు డింటివద్ద ఉంచినప్పుడే లక్షుంనాయుడు కుతకుతలాడేడు. మిగతా వాళ్ళంతా పై కనకపోయినా, ముక్కుపుటాలు పెద్దవి చేసి, పళ్ళు పటపట కొరుక్కున్నారు. నాకు తెలుసు.

ఊరెప్పుడు పుట్టిందో మన మెరగం. నందెమ్మని తేవడం, కొలవడం, అనపడం ఆరంభమై ఎన్నాళ్ళైందో దాఖలా లేదు. మనకి తెలిసిన దగ్గర్నుంచీ గవిరెమ్మని తీసుకొచ్చి, నంది, ఈశ్వరుడు, గంగమ్మ తల్లులతో చేర్చి, రామభజనలో నిలపడం రివాజు. నా చిన్నప్పట్నుంచీ ఇలాగే జరుగుతున్నాది. నీ చిన్నప్పట్నుంచీ ఇలాగే జరుగుతున్నాదని నీకూ తెలుసు. అంతకుముందేం జరిగిందో మనమెరగం. ఊర్లోకల్లా పెద్దవాడివి నువ్వు. నీ తోటివాడు మాదిగ వీరయ్యొక్కడే. వాడినడిగినా చెపుతాడు.

గౌరీపున్నంనాడు దాలినాయుడింట్లో గౌరెమ్మను కొలువుంచిన్నాడే, నేను గురువుగారితో చెప్పాను – ఇది చినికి, చినికి గాలివానయ్యేలా ఉందని.

ఆయన చాలాసేపు మాట్లాడలేదు. పెద్ద చెరువు గట్టుమీద ఇద్దరం కూర్చున్నాం. ఇంకా చీకటి పడలేదు. సూర్యుడు తాటితోపుల వెనక దిగిపోతున్నాడు. వసంతం చల్లబడ్డ ముత్తయిదువులా ఉంది పడమటి ఆకాశం. నీటి కొంగలు ఎగురుతూ పోతున్నాయి. మేతకు తోలుకు వెళ్ళిన పశువుల్ని మనవాళ్లు ఇళ్ళకు మళ్లించుకుపోతున్నారు. గొల్ల గౌరీశం పాడుతున్న పదం మా ఇద్దరి చెవుల్లో పడుతూ ఉంది. గురువుగారు ఊరివైపు తిరిగారు. నేనూను!

మాకు కొద్దిదూరంలో విత్తనాలు నిలువచేసే గోడౌను ఉంది. పచ్చని పంటచేల మీదుగా ప్రసరించిన మా చూపుల్ని కుడివేపు హైస్కూలు, ఎడంవేపు ఆస్పత్రి ఆపుతున్నాయి. ఆ వెనక కలతలులేని, కలహాల్లేని ఊరు అలసటతీర్చుకుంటూఉందని తెలుసు. గుండె పాలకడవగా మారింది. గొంతుభారమైంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతాయేమోనని భయపడ్డాను.

'నాయుడూ! ఇంకా ఎన్నో జరగాలి. నవ్వే పాపాయిలా ఊరు కళకళలాడాలి' అన్నారు గురువుగారు.

ఇద్దరం ఊర్లోకి వచ్చేశాం."

రామినాయుడు ఆగాడు. అందరి ముఖాల్లోకి చూశాడు. అతనన్న ప్రతి మాటకూ తలూపుతున్న చలమయ్య తప్పించి, మిగతా ఇద్దరి ముఖాలూ కోపంగానే ఉన్నాయి.

"మీకు తెలియదని నేను చెప్పడం లేదు. ఇవి చిన్న విషయాలు. గోరంతలు కొండంతలు చేసుకోవడం మనకి సబబూ కాదు, ఊరికి మంచిదీ కాదు.

ఇంకా కో - ఆపరేటివ్ బాంకు, సొసైటీ, బస్సు రూటు - ఎన్నో సాధిద్దామని గురువుగారి కుంది. ఉన్న మాతాశిశు సంరక్షణాలయం, పశువులాస్పత్రి పెద్దవి చెయ్యాలి. బ్రాంచి పోస్టాఫీసు, సబ్ - ఆఫీసు కావాలి. కరెంటు రావాలి. ఇవన్నీ ముందుంచుకుని మనలో మనం కొట్లాడుకుంటే కార్యం చెయ్యి దాటిపోతుంది. ఆ తరువాత విచారించీ ప్రయోజనం ఉండదు.

ఇప్పటికే మన ఊరంటే ఇరుగుపొరుగు గ్రామాల్లో కక్షగా ఉంది. ఓ తగువుల్లేవు. తంటాల్లేవు. ఖూనీ కేసు ల్లేవు. ఆస్తి తగాదాలు, పొలం తగాదాలు కోర్టులకి ఎక్కించక మనలో మనం తేల్చుకుంటున్నాం. మంచో, చెడో గురవవుగారి తీర్పుకి తలొగ్గి ఉంటున్నాం. ఎందుకు కడుపు చల్లగా ఉన్న ఊరిని కలవరపరచడం? తన గురించి తగువులాడుకుని, ఊరు రెండై, రక్తాలు ఏరులైతే, గవిరమ్మ తల్లి మాత్రం సంతోషిస్తుందా?"

రామినాయుడు ఊపిరి పీల్చుకోవడానికన్నట్టు ఆగాడు. కాని, తన మాటల ప్రభావం వాళ్ళమీద ఎంతవరకూ పడిందన్నదే చూస్తున్నాడు.

శివున్నాయుడు విసుగ్గాకదిలాడు. లక్షుంనాయుడు గోడకి చేరబడి వీధిలోకి చూస్తున్నాడు.

అపరాహ్ణంవేళ కావస్తున్నది.

ఎక్కడా కేకలూ, అరుపులూ లేవు. పై నుంచి వచ్చేవాళ్ళకి ఊరు మామూలుగానే కనపడుతున్నది. కాని, లక్షుంనాయుడికి తెలుసు. అక్కడ కూర్చున్న వాళ్ళకీ తెలుసు. ఊరు ఊర్లా లేదు. పెనం మీది అట్టులాగా ఉంది. పుట్టలో పాలుపోసి, పొద్దుట్నుంచీ నిరాహారంగా ఉన్న నాయుళ్ళ కడుపు లసలే మంటగా ఉన్నాయి. రామినాయుడింటి కెదురుగా పంచాయితీ ఆఫీసుంది. అరుగులమీద చిన్నా, పెద్దా పెద్దవీధి వాళ్ళంతా పొలాలకు పోకుండా కూర్చున్నారు - తగువర్లు ఏ నిర్ణయానికొస్తారా అని.

రామినాయుడు చుట్ట తాగడు. అయినా, శివున్నాయుడి చేతిలోంచి తానంది పుచ్చుకుని, ఊరికే సాపుచేస్తుండిన పొగాకు కాడ క్రింద నుంచి, మళ్ళీ మొదలెట్టాడు.

"నేను దేవుణ్ణి నమ్ముతాను. గవిరమ్మ తల్లీ, గంగమ్మతల్లీ, అమ్మవారూ వేరు కాదని, ఓ దేవుడికే మనం పెట్టుకున్న వేరు వేరు పేర్లనీ, ఇన్ని రూపాలు, భేదాలు మనం కల్పించు కున్నవేననీ, ఆ పరమాత్మ ఒక్కడేననీ నమ్ముతాను. ఆ దేవుడు అందర్లోలాగా నాలోనూ ఉన్నాడని కూడా నమ్ముతాను. ఆ మాత్రం దానికి తల్లి ఊరేగింపు రామభజన వద్ద నుంచి ప్రారంభమైనా, దాలినాయుడింటివద్ద నుంచి మొదలైనా, తొలుత పెద్ద వీధిలో తిరిగినా, బోను వీధే మొదలు చుట్టినా, నా కభ్యంతరం లేదు."

రామినాయుడింకా ఏదో అనబోయాడు. లక్షుంనాయుడు అడ్డు తగిలి, "మావుఁనీలా

సదూకోనేదు. గంగమ్మ తల్లీ, గయిరమ్మతల్లీ, అందరు దేవుల్లా ఓరో, కాదో నాకు తెల్దు. దద్దకీ తెల్దు. చలమయ్య కత నాకు తెల్దు. నా కెరికున్నదంతా సెప్తా ఇను.

తాత తండ్రుల నాట్నుంచి తల్లి ఊరేగింపు రాంబజన కాడ బయల్దేరి పెద్దీది, అంటే మనీది, సుట్టి, ఆ ఎనక తక్కి నీదులు తిరిగి, అంపకమై పోతా ఉంది. ఇప్పుడదేల మారాల? గురువుగారేదో సెప్పినా రన్నావు. మనకేనా సెప్పినారు? అహఁనాకు తెలకదుగుతాను. దాల్నాయుడికి సెప్పనేదేటి?

ఆకాడకీ గయిరెమ్మ తల్లిని కుమ్మరాలింట్నుంచి తెచ్చి, రాంభజన కాడ దింపకుండా అట్టుకెళ్ళి, దాల్నాయు డింటుంచినా, ఆయిన మాటిని, మీ ఇద్దరి ముకాల్నూసి పల్లకున్నాం. ఇంక మామూరుకోము. ఈ పొద్దు ఇదవుద్ది. రేపింతకన్నా పెద్దది మరోటవుద్ది. ఇంతకీ కొందరు నాయుల్నాగ కద్దర్లేసి, గాజులు తొడుక్కోనేదు మావుఁ" అన్నాడు. ఆ మాటలు పూర్తవుతుంటే కర్ర తీసి లేచివెళ్ళిపోబోయాడు.

రామినాయుడికి కష్టం వేసింది. లోన పౌరుష మెక్కడో పడగ విప్పినట్లయింది. మనిషి పుట్టుకతో మొదలైన అహంభావం బుసకొట్టబోయింది. కాని అలవరచుకున్న సంస్కారం అడ్డుతగిలింది. ముడిపడబోయిన కనుబొమలు, తీవ్రతను సంతరించుకోబోయిన కళ్లు మామూలుగానే ఉండగా, రామినాయుడిలా అన్నాడు:

"లక్షుంనాయుడూ! నువ్వు కూర్చో. వెళ్ళిపోయేవంటే నన్నన్న మాటకి ముఖం చెల్లక వెళ్ళేవనుకుంటాను." లక్షుం నాయుడు కూర్చున్న తరువాత రామినాయుడు కొనసాగించాడు:

"నువ్వన్నావన్న బాధ కాదు. కాని, నువ్వే చూడు. ఈ తగువు పెద్ద వీధి, బోను వీధికే కాదు, మనలో మనక్కూడా పాకి ఊర్ని రెండు రెళ్ళు నాలుగ్గా చేసేటట్టుంది. కాబట్టి చెబుతున్నాను. దద్దా! చెలమయ్యా! మీరు కూడా వినండి.

"ఇన్నాళ్ళూ ఊరు తగువుల్లేక ప్రశాంతంగా ఉండలేదు. ఆ తగువుల్ని కొట్లాటవరకూ తీసుకువెళ్ళకుండా పరిష్కారం చేసుకుంటున్నాం గనక ప్రశాంతంగా ఉంది. ఇది మరో తగువు. గురువుగా రొచ్చేవరకూ ఆగుదాం. ఆయనేది న్యాయమని చెపితే అది చేద్దాం.

కాని, నా దొక్కమాటున్నాది. ఊరు నిమ్మళంగా ఉండడం, మాలమాదిగల మొదలు పంతుళ్ల దాకా అంతా ఒకే మాటమీదుండడం, కష్టాలకోర్చి ఊరిని బాగుచేస్తుండడం కొందరి కిష్టంలేదు. వాళ్ళెవరో మీకు తెలుసు. నేను చెప్పను. కాని నలుగురు తన్నుకుంటేగాని, నాలుగ న్యాయాలు జరుగుతుంటేగాని, వాళ్ళ పొట్ట నిండదు. గోతిదగ్గర నక్కల్లాగ వాళ్లు సమయం కోసం కాచుకుని ఉన్నారు. ఈ రోజు ఏ గలాటా జరిగినా అదీ వేళతో ఆగిపోదు కదా! ఇన్నాళ్ళ మన ప్రయత్నాల్ని బూడిదలో పన్నీరులా చేస్తుంది. ఆపైన మీ ఇష్టం. గురువుగారొచ్చే దాకా ఆగుతారో, స్వతంత్రించి మీరు చెయ్యదలుచుకున్నది చేస్తారో!"

శివున్నాయుడు స్తంభంమీద చెయ్యేసాడు లేవడానికి. "ఓరయ్యా! రామినాయుడు! నాకింతగా ఉన్నాది. ఇన్ని మాటలెక్కడ నేర్సినావో, ఎప్పుడు నేర్సినావో నా నెరగను. కాని, అత్తొచ్చిందాక అమాస ఆగదంటారు. ఓ పాలి ఆలోసించు. నీపాటి యవ్వారం నానూ సెయ్యగల్ను. కాని నిలకడమీద సద్దిద్దామంటే కుదిరేది కాదిది. ఇయ్యాల నందెమ్మని అనిపే తీరాల. అనిపే ముందల ఊరంతా తిప్పే తీరాల. ఆ తిప్పడం మనీది తోటే మొదలవ్వాల. ఇందుకే నంజికొడుకైనా అడ్డం సెబితే, మనీది లోకి ఊరేగింపెలా గొస్తాదో నాను సూత్తాను.

ఇంక ఊర్లో తగూలంటావా! అ వొక నాటితో తీరేవి కావు. ఇయ్యాల కాకపోతే మరోపొద్దు. అయినా, ఈ ఏడెనిమిదేల్ల బట్టి ఏ తగూల్నేవంటే, ఎల్లకాలమిలా గుండిపోవాలనుందేటి? ఓ మడిసెక్క తగువో, మరోటైతే నాను పట్టుబట్టను. ఇది తల్లి మానచ్చిమికి సంబందించిందిరా, అయ్యా! నాను పల్లకుండలేను."

రామినాయుడు మాట్లాడలేదు. అతను చూస్తుండగానే శివున్నాయుడు, లక్షుంనాయుడు లేచి పైగుడ్డలు దులిపి భుజాలమీద వేసుకొని అతని యింటి మెట్లు దిగి వెళ్ళిపోయారు. అరుగుమీద ఆలోచిస్తూ కూర్చున్న రామినాయుడు ఎంత సేపటికీ నోరు మెదపక పోయేసరికి, చలమయ్యా అరుగు దిగి వెళ్ళిపోయాడు.

✪ ✪ ✪

"ఊరు మొత్తాపడి నందెమ్మను తేనేదు. పిల్లోడికి వచ్చే పేనం, పోయే పేనం నా గున్నప్పుడు నాను తల్లికి మొక్కినా. 'తల్లే! తల్లి! నందెమ్మ తల్లీ! నా బొట్టెడు బతికి బట్టకట్టేటట్టు సెయ్యి. సేత్తివా "గయిరీపున్నం" నాడు తెచ్చి నా ఇంట్లుంచుకుంటాను. ఎప్పట్నాగ నాగుల్చవితినాడు నా ఇంట్నుంచి బయల్దేరి, ఈ ఈదంతా తిప్పి, ఆ ఎనక ఊరంతా తిప్పి అనువుతా' ననుకున్నాను.

పిల్లోడు బతికితే మొక్కు సెల్లించొద్దా? ఇందుకెవ రద్దు సెప్పినా నా న్నెక్కసెయ్యను. ఎప్పట్నాగ రాంబజన కాడ కాక, నందెమ్మని నా ఇంటుంచినప్పుడు నేని అబ్బెంతరాలు ఊరేగింపుకేల రావాల?" దాలినాయుడు అరుగుమీద కూర్చుని అంటున్నాడు.

అప్పటికే తర్జనభర్జనలు జరిగాయి. కొందరటన్నారు. కొందరిటన్నారు. మరికొందరు "ఏలకి గురువుగారూర్లో నేరు కదా!' అని నిట్టూర్చారు. ఆఖరికి దాల్నాయుడు - "మొక్కిన ఇదంగా సెయ్యకపోతే ముప్పురాదా" అన్నప్పుడు అన్ని వాదాలూ ఆగిపోయాయి.

దాలినాయుడు అరుగుమీద నుంచి లేచాడు. కండలుబ్బిన చేతులూ, పిక్కల్లాటి కాళ్ళూ విదిలించాడు. రొయ్యమీసాల మీద చెయ్యేసి దువ్వాడు. మధ్యపాపిడి తీసి ఎనక ముడి చుట్టబడ్డ జుత్తు ముడివిప్పి ఝాడించి, "నే తానంసేసొత్తా. తయార్కండెహె" అన్నాడు.

✪ ✪ ✪

సాయంకాలం. నీడలు పొడుగవుతున్నాయి.

తయారైంది ఊరంతా. ఊరంతా ఎంత? రమారమి పన్నెండు వందల గడప. అయిదారు వేల జనాభా. కాని, పొరుగూర్ల నుంచి సంబరాలు చూడవచ్చిన జనంతో ఊరు రెండింతలై సందడిగా ఉంది.

పిరికి గుండెవాళ్ళు, దౌర్జన్యం నిరోధించలేకపోయినా సహించలేనివాళ్ళు తలుపులు వేసుకుని ఇళ్ళలో కూర్చున్నారు. ఊర్లో మిగతా జనమంతా తయారయ్యారు. రోకళ్లు, కారంగుండలు ఆడవాళ్ళ చేతుల్లో - బల్లేలు, కొడవళ్ళు, బాణాకర్రలు మగవాళ్ళ చేతుల్లో.

దేవుడు తయారయ్యాడు. నందెమ్మ ఊరేగింపు దాలినాయుడింటి ముందు నుంచి ప్రారంభమైంది.

ఇంటిముందు గూడుబండి ఉంచారు. దాని తడికగూడు తీసి, వెదుర్లకి ఎర్రటి చీరలు గూడులా చుట్టారు. బండి మధ్యలో మట్టి నందీశ్వరుడి నమర్చారు. నందిమూపుపై చెక్కపీట ఉంచారు. పీటమీద నెత్తిమీద గంగతో పరమశివుడు, పక్కన పార్వతితో సహా, కూర్చున్నాడు. చెంతనే కొంచెం దిగువన గోలెంలో అమర్చిన వరివెన్నుల దుబ్బుంది. అదే 'గవిరెమ్మ'న్నా, 'నందెమ్మ'న్నా.

బండిలో దాల్నాయుడు బావమరిది వెంకటేశు కూర్చున్నాడు. అరటిపళ్ళు, ఇతర నైవేద్యాలు పుచ్చుకుని, ప్రసాదాలు పంచుతున్నాడు. విగ్రహాల ముందు మట్టి ప్రమిదలలో దీపాలు వెలుగుతున్నాయి.

ఊరేగింపు ముందు సన్నాయి మేళం ఉంది. ఆ వెనకే శీనయ్య చెవులకి చేగోడీలు రింగుల్లా తగిలించుకుని, మెడలో జంతికలతో గుచ్చిన హారం వేసుకుని, ముఖానికి నీలంసిరా పులుముకుని, నెత్తిన పింఛంలా తాడుకట్టి వేపరెమ్మ ఉంచుకుని, చిన్నకర్ర వేణువులా ఊదుతూ జనాన్ని నవ్విస్తున్నాడు. ఆ వెనక గొల్ల గౌరీశం జట్టు తప్పెటగుళ్ళు వాయిస్తున్నారు. చివర్న కుర్రాళ్ళు కొందరుచేరి, ఎర్రగుడ్డలు నడుముకి బిగించి కోలాటం ప్రదర్శిస్తున్నారు.

అయితే, ఎవరి మనసులూ ఆనందంగా లేవు. ప్రతివారిలోనూ ఉత్కంఠ ప్రబలుతూ ఉంది. శీనయ్య చర్యలు నవ్వు పుట్టించడంలేదు. శీనయ్యకే గుండె దడదడలాడుతున్నది.

బోను వీధి మలుపు తిరిగి, పాతిక గజాలు నడిచి, జంక్షన్ కొచ్చింది ఊరేగింపు. ఆ పల్లెటూరులో అదే నాలుగు వీధుల కూడలి. బోనువీధి, బజారువీధి, పెద్దవీధి, కొత్తవీధి కలిసేదక్కడే! అక్కడే ఉంది రామభజన. లోపల దేవుడు బొమ్మ లేదుగాని, దీపాల చెట్టుంది. ఆ ఇత్తడి ప్రమిదల్లో నూనెపోసి దీపాలు వెలిగిస్తారు. అక్కడే శనివారం రాత్రుళ్ళు భజనలు జరుగుతాయి.

నందెమ్మని గౌరీపున్నం నాటి నుంచి నాగుల చవితి వరకు అక్కడే ఉంచి, అక్కడి

నుంచి తొలుత పెద్దవీధికి నందెమ్మని తీసుకెళ్ళడం జరగలేదనే గొడవంతా.

ఇరు పక్షాలవారు ముఖాముఖిగా వచ్చారు. కేకలు, అరుపులు. "ఈ ఈదమ్మట నందెమ్మని తీసుకెల్లాని కీల్లేదు." "ఎల్లేదో మావూఁసూత్తాం." "ఇయ్యా లటో ఇటో తేలి పోవాల." "నాయాల.... ఒళ్లు పొగరెక్కి..." "నేదురయ్యా! ఓ పాలి మన తడాక సూపాల్సిందే." తోసుకు వస్తున్నారు జనం. గాలిలో లేచిన కఱ్ఱలు నెత్తుల మీద వాలడాని కట్టే దూరం లేదు.

తప్పెటగుళ్ళు, కోలాటం పెద్దవీధి మలుపు వద్దే ఆగిపోయాయి. శీనయ్య జాడే లేదు.

అక్కడ చేరిన మనుష్యుల ముఖాలు కోపంతో జేవురించి ఉన్నాయి. ప్రేమించడం మరిచిపోయి, ద్వేషించడం, పగతీర్చుకోవడం ప్రధానం కావడంతో వికృతంగా మారి పోయాయి.

అదొక తరంగం. వెల్లువ. నరాల్లో నెత్తురు వేగంగా పారి, ఉద్రేకంతో ఒళ్ళు వెచ్చనై, కళ్ళలో ఎఱ్ఱని జీరలు పాకి, తన ఉనికినీ, తపననీ, ప్రేమనీ, సంస్కారాన్నీ మరిచిపోయి, అహంభావం ఒక్కటే మేల్కొని, కోపం ఒక్కటే రాజుకుని, అమాయకమైన వళ్ళు, అందమైన అరిచేతులు రూపుమారి, వేళ్ళు పాము పిల్లలై, అరిచేతులు పడగలై, మనిషి పశువువై తన్ను తాను, చరిత్రనీ, సంస్కృతినీ వదిలిపెట్టి, తానొక్క భావమై, తానొక్క ద్వేషమై, ఉప్పెనై ముంచెత్తేయాలని లేచిన తరంగం.

గంగ, గౌరి, పరమేశ్వరుడు, నంది - అందరూ మూగబోయారు. అరుగుల మీదా, మిద్దెలమీదా, కొట్లమీదా, ఇండ్ల కప్పుల మీదా నిలుచున్న జనం ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. హఠాత్తుగా బజారువీధిలో చేరి, ఆయుధాలతో ముందుకు వస్తున్న జనం నిశ్శబ్దమైంది. ఏరు రెండు పాయలుగా చీలి దారిచ్చినట్టు, పక్కలకు తొలగిన మనుష్యుల మధ్యగా, ముతక ఖద్దరు లాల్చీ, పంచె ధరించి, చేతిలో గాంధీగారి బొమ్మున్న ఖద్దరు సంచీ పట్టుకుని, మాసిన గడ్డం, దువ్వని జుత్తూ కలిగి, ప్రయాణపు అలసట వలన నలిగిన మనిషి రావడం కనిపించింది. ఆ వెనకే రామినాయుడూను.

"గురువుగారు!" "గురువుగారు!" ఆనందం. ఆశ్చర్యం.

ఆ నల్లని భారీ మనిషి ఎటూ చూస్తున్నట్టు లేదు. ఒక స్వప్నం. ఒక సౌధం. కూలిపోబోతున్న పేకమేడ. పేకమేడేనా? ఎండలో, వానలో శ్రమించి, కుటుంబానికి దూరమై, ఒంటరై, తపస్సు చేసి నిర్మిస్తున్న సమాజ సౌధానికి పునాది లేనే లేదా?

ఉచితంగా ఎకరాల స్థలం విరాళమిచ్చిన జనం, చేతనైనంత ధనసహాయం, శ్రమదానం చేసి పాఠశాల, వైద్యశాల మొదలైనవి సాధించిన జనం, మంచితో మనిషిని

మార్చవచ్చని నిరూపించుకున్న జనం... ఇంతలో, ఇన్నాళ్ళుగా పెంచుకుంటున్న విలువల్ని మరిచిపోయి, ఒక ఆదిమజాతిలా ప్రవర్తించడం, నిజంలా కనబడడంలేదు. పీడకలలా ఉంది.

"బాబో! బాబు! నీకు తెల్దు. నువ్వడ్డు రాకు. ఇయ్యాలిదేటో తేలిపోవాల." "బాబాల కంతే మోజే అయితే తేలనీ సూత్తాం. ఏ ఊర్నుంచో వచ్చావు. ఏదో రునమున్న ట్టిన్నాళ్లు మమ్మల్ని తీరిసిదిద్దావు. నీ మాటియ్యాల ఇన్లేదనే బాదొద్దు. బాబు, నువ్వు తప్పుకో."

"చూస్తారేటెహె?"

"ఏట్రా, గురూగారూ కదలందే!"

"అంత తొందరేట్రా."

నిజమే. కలకాదు. ఏమి చెప్పీ లాభంలేదు. ఇక్కడ మనుష్యుల్లేరు. వినిపించుకోరు. ఒక్క ఆవేశమే అనేక రూపాలుదాల్చి, ఈ జనమై, తన ముందుంది. గాలిలోకి లేచిన కర్రలు. ఎత్తి పట్టుకున్న రోకళ్ళు, బల్లేలు. గాలిలో తేలి కళ్ళలో పడడానికి సిద్ధంగా ఉన్న కారంగుండలు. ఇది మాటలకు తావు కాదు. వేళా కాదు.

నాలుగు పక్కలా తన చుట్టూ నిండి, గాలిని కాటేసి పాము కొట్టిన బుసలా ఊపిరి తీస్తూ విడుస్తున్న ఊరివాళ్ళందరినీ పరికించి, గురువుగారు మాట్లాడబోతే, గాద్గద్యంవల్లో, నిద్రలేమివల్లో గొంతు భారంగా ఉండి, ఈ రెండు వాక్యాలే వెలువడ్డాయి.

"ఈ వేళ అటో, ఇటో తేల్చుకోవాలని ఉంటే కానియ్యండి. కాని, ముందు దెబ్బ నా మీదే పడాలి."

శివున్నాయుడటు చూశాడు. దాలినాయుడూ అటే చూశాడు. అందరూ అటే చూస్తున్నారు. ఆ చూపులకి మధ్యన నిలుచున్న 'గురువుగారు' నల్లని రాతి విగ్రహంలాగ కనిపించారు. గుంపు గుంపంతా ఒకటే ఆలోచన వ్యాపించింది. పరాయి ఊరువాడు ఈ ఊరొచ్చి, ఈ గ్రామం ప్రశాంతంగా ఉండి, ప్రజలన్నదమ్ముల్లా మెలగాలని ఇంత త్యాగానికి కొడిగడితే, ఆ ఊరికి చెంది, ఆ గడ్డ మీదపుట్టి, పెరిగి, అక్కడే మరణించవలసిన వాళ్ళం ఒక చిన్న విషయాన్ని గురించి తలలు బ్రద్దలు చేసుకునేందుకు సిద్ధపడడం ఎంత అవివేకం! అక్కడ నిలుచున్న గురువుగారొక వ్యక్తిలా కాక, అందరిలో ఉన్న సహజ ప్రేమాభిమానాలకు చిహ్నంగా కనపడ్డారందరికీ.

ఒక మెరుపు మెరిసినట్టయింది. పాలపొంగుమీద నీళ్లు చిలకరించినట్టయింది.

దావానలంలా రేగిన ద్వేషం, ఒడ్డుకు తగిలి భగ్నమైన సముద్రకెరటంలా వెనక్కు పోయింది. యుద్ధం చెయ్యకుండానే వీరుడికి జయించిన గర్వం కలిగినట్టయింది. ఈ లోకంలో ఎవర్నయినా జయించవచ్చు. ఎవర్ని వారు జయించడమే దుర్లభం. అందువలన కలిగే తృప్తి అనితర సాధ్యం.

"ఓరి దద్దా! నాను తొందరపడినాను. నీ ఇట్టమెనాగుంటె అలాక్కానీ. ఎనక టూసెల్ల మరిసిపో" అన్నాడు దాలినాయుడు.

"అవేం మాటల్రయ్యా! ఊరికెళ్ళముసిలోన్ని. నానే రామినాయుడు దురితం కూడదంటే ఆలకించనేదు" అన్నాడు శివున్నాయుడు.

"ఊఁ పదండి, పదండి. నందెమ్మ తల్లి నిల్సుండిపోనాది. బండి తోలండెహె!"

మువ్వలు చప్పుదు చేస్తూ ఎడ్లు కదిలాయి. తప్పెటగుళ్ళు మళ్లీ మోగాయి. కోలాటం మొదలైంది మళ్ళీ. ఎక్కడ్నుంచొచ్చాడో శీనయ్య మళ్ళీ జనాన్ని నవ్విస్తున్నాడు.

పోరాటానికి సమాయత్తమై రెండుగా చీలిన ఊరు, నందెమ్మ ఊరేగింపు వెనక ఒక్కటై నిలిచింది. నవ్వే పాపాయిలాగా ఊరు కళకళలాడింది.

– ఆంధ్రప్రభ వారపత్రిక – **5.1.1972**

# సదసత్సంశయం

అప్పుడు....

నేను కళ్లు విప్పాను.

విప్పిన కళ్ళనిండా ఎర్రదనం.

కళ్ల నిండిన ఎర్రదనం జీరలరూపంలో ఉంది.

నిండిన ఎర్రజీరల కళ్ళతో నా ముఖం భయంకరంగా ఉండి ఉంటుంది.

భీమశంకరం మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు.

నెమ్మదిగా వెనక్కి తిరిగాను.

నిశ్శబ్దంగా ఉంది గది. గది నిశ్శబ్దంలో ఫోను చేస్తున్న చప్పుడు వినవస్తున్నది. నిశ్శబ్దపు గదిలో చప్పుడు చేస్తున్న ఫోనుతోబాటు, గోడ గడియారం 'టిక్కు','టిక్కు' మంటున్నది.

వెనక్కి తిరిగిన నేను నెమ్మదిగా నడుస్తూ గుమ్మం దాటుతుంటే, గోడకి తగిలించి ఉన్న బాపూజీ బొమ్మ నిండుగా నవ్వుతున్నది.

నిండుగా నవ్వుతున్న బాపూజీ బొమ్మ నా వెన్నుతట్టి ధైర్యం చెప్పినట్టయింది.

నేను భయపడ్డానని కాదు.

నేను భయపడలేదనీ కాదు,

ఎన్నోసార్లు భయపడ్డాను. ఎవర్ని చూసినా భయపడ్డాను. ఏం చేసినా భయపడ్డాను. ఏమీ చెయ్యకపోయినా భయపడ్డాను.

కానీ, అప్పుడు నేను భయపడలేదు.

ఆ తరువాత భయపడలేననీ తెలిసిందప్పుడే.

నేను... నేను గొప్పవాడిని కాదనుకునేవాణ్ణి.

దానికి రెండు కారణాలు చెప్పగలను.

నన్నెవరూ, ఎప్పుడూ గొప్పగా చూడలేదు.

గుడ్డిగవ్వగానో, గడ్డిపువ్వుగానో ఎప్పుడూ నన్నందరూ చూసేవారు.

గొప్పగా ఎప్పుడూ అందరిచేతా చూడబడే వాళ్ళలాగ నేను లేను.

వాళ్ళ చేతులు కోమలంగా ఉండేవి. వాళ్ళ బట్టలు మడత నలగకుండా, బురద తగలకుండా ఉండేవి. వాళ్ళు అప్పుడే భోజనం చేసినట్టు ఎప్పుడూ ఉండేవారు. వాళ్ళ ఇళ్ళు, వాళ్ళ పిల్లలు, వాళ్ళ పెళ్ళాలు, అప్పుడప్పుడు వాళ్ళ మెడల్లో వేయబడే దండలు, తిరిగే కార్లు, చేసే షికార్లు....

ఇవన్నీ అటుంచు. నాకు వింతగొలిపేదల్లా ఎప్పుడూ కష్టపడని వాళ్ళ చేతులు. మట్టి అంటని చేతులు.

నా చేతులతో నేను గొలుసులు పట్టుకు బళ్ళు లాగాను. నేను నా చేతులతో బార్జిలకు పట్టిన తుప్పు రాలి వచ్చేటట్టు సుత్తితో కొట్టాను. 'డెక్'ని శుభ్రంగా కడిగాను. రంగులు వేసాను. నా చేతులతో బరువులు మోసాను. తెడ్లు వేసాను.

కష్టపడని ఆ చేతులు. రోజుల తరబడి వేచి ఉండే మా కాగితాల మీదపట్టుమని పది సంతకాలు పెట్టలేక అలిసిపోయే ఆ చేతులు. విసుక్కునే ఆ చేతులు. కారు తలుపులు కూడా తీసుకోలేని ఆ చేతులు. ఆ చేతులు గల శరీరాలు ఎయిర్ - కండిషన్డ్ గదిలో కూర్చుని ఉండగా -

తడుస్తూ భోరున కురిసే వానలో, ఎండకి నెత్తి మాడుతున్నా, చలికి వణికే దేహంతో, ఆయా కాలాల్లో నేను నా చేతులతో పనిచేస్తూనే ఉన్నాను.

అందుకే నేను గొప్పవాణ్ణని ఎప్పుడూ అనుకోలేదు.

"కాసారపు పరదేశి గొప్పవాడ"ని ఎప్పుడూ, ఎవరూ అనలేదు.

నే నెక్కువ చదువుకోలేదు.

నన్నెక్కువ చదివించాలని మా అయ్యా, అమ్మా కూడా అనుకోలేదు.

"పెద్దోరి నాగ ఇస్కూలికి పారిపోతన్నావు నాలుగు పేడకళ్ళెత్తుకు రారాదా?" అంటూ మా అమ్మ మందలించేది. "ఉజ్జోగం సేసి ఈడూళ్ళేలేస్తాడు. పడవ మీదకి నాతో రారా అంటే గుంటసచ్చినోడు కాతరు సెయ్యడు. ఈ ఏడయినా పరీచ్చ పోదా, నా నీడి సదువు మానిపించేసి సవుద్రం మీదికి తీసుకెళ్ళనా" అనేవాడు మా అయ్య.

మా అయ్య జీవితంలో ఎన్నో అనుకున్నాడు. కాని, అనుకున్న వాటిలో కెల్లా ఖచ్చితంగా జరిగింది, నా ఫిఫ్తుఫారం పరీక్ష పోగానే చదువు మానిపించేయడమే.

తక్కువ చదువుకోవడంవల్ల ఎక్కువ మోసాలు చెయ్యడంగాని, ఎక్కువ జీతాన్ని తక్కువ శ్రమతో సాధించడంగాని నా వల్ల కాలేదు.

సముద్రం మీదకి మా అయ్యతోబాటు నాటుపడవలో చేపలు పట్టడానికి వెళ్ళినన్నాళ్ళు, వెళ్ళిన తరువాత, సముద్రం మీదే నా కుద్యోగమైంది.

నాకెందరో పెళ్ళాలు లేరు.

పెళ్ళాం ఒక్కతే ఉంది.

ప్రియురాళ్ళూ లేరు నాకు.

ఆడది, పెళ్ళాం ఒక్కతే నా జీవితంలో.

అలాంటి నా ఆడది నీళ్ళు పోసుకుంది.

మా అమ్మకి అంతులేని సంబరం కలిగింది.

మా అయ్య నన్ను చూసి కమ్మగా నవ్వి మీసం మెలేసాడు. చిన్నది చెల్లెలు ఒకటే వేళాకోళాలు. నేలకంటుకుని ఉన్న గుడిసెలో మేమున్నా, మా మనస్సులు గువ్వపిట్టల్లా ఎగిరాయి ఆకాశంలో. సిగ్గులతో ముద్దులు మూటగట్టింది ఆ రాత్రి నా భార్య.

నెలలు నిండిన నా పెళ్ళాం మొన్న పొద్దున్న మందుసీసా పట్టుకుని ఆస్పత్రికి వెళ్ళింది రంగునీళ్ళ కోసం.

మళ్ళీ నేను దాన్ని ఆ సాయంకాలం ఆస్పత్రిలోనే చూశాను.

మంచంమీద పడుకుంది.

వడిలిపోయిన దండలా ఉంది.

కమిలిపోయిన కలువలా ఉంది.

మూలుగుతున్న నా పెళ్ళాం మన లోకంలో లేనట్టుంది.

అప్పుడు చూసాను నేను దాని కుడికాలు. బూరగాలొచ్చినట్టు వాచి ఉంది. తెల్లని బాండేజీలు కట్టబడి అరటిదవ్వలా ఉంది.

"కాస్తలో తప్పిందిగాని కడుపులో పిండం పోవలసిందే" అంది నర్సు.

నాతో పనిచేస్తున్న నూకరాజు "బాబోరే! సచ్చి బతికినాది. దొరగోరి కారు దాని కాలుమీద నుంచిపోయినప్పుడు నేనక్కడే కదా ఉన్నాను? ఇదేమో నిండు సూలాలు. అడుగుల అడుగేసుకుంటా నడుస్తోంది, గేటుదగ్గర .కాలవమీద గజాలపై నుంచి. సర్రునొచ్చింది దొరగోరి కారు. పడవనాగుంది. 'బొంయ్'మని హారనేనా వోగనేదు. దొరగోరు కారు నడపడం ఇప్పుడిపుడే గదా నేర్చుకుంటన్నారు? ఏటయినాదో ఏటోగాని, గబుక్కున నీ పెళ్ళాన్ని గుద్దేసి, కుడికాలుమీదుగా ఎనకసెక్రం పోయి ఆగిపోనాది. బిత్తరసూపులు సూస్తూ దొరగోరు దిగినారు" అన్నాడు.

"పాపం, నిబ్బగే జాలిపడ్డాడనుకో. ఎవురంమట్టుకు ఏటి సేస్తాం? ఇదేటి అనుకుని సేసిందా ఏటి? బాబసలే గాబరా గాబరాగున్నాడు ఆ సిటం నుంచి" అన్నాడు సత్తెయ్య.

నే నంతా విన్నాను. నిజమే. ప్రమాదాలు ఎన్నో జరుగుతుంటాయి. ఎవరినేమంటాం?

మర్నాడు నేను మామూలుగానే డ్యూటీకి వెళ్ళాను. మనసులో మాత్రం మూలుగులే వినబడుతున్నాయి. కనుల ముందు కనబడుతూంది వాచి ఉన్న కుడికాలు. వెళ్ళిన గంటకల్లా కబురొచ్చింది – "చిన్న దొరగారు పిలుస్తున్నా"రని.

భీమశంకరంగారు కుర్చీలో కూర్చున్నారు. నమస్కారం పెట్టి నిలుచున్నాను.

"ఫుఁ మీ ఆవిడకి ఎలా ఉంది?" అన్నారాయన.

నాకళ్ళలో నీళ్లు తిరగబోయాయి. బలవంతాన ఆపుకున్నాను. వంచుకున్న తలలో ఎన్నో ఆలోచనలు రేగాయి.

"బాబు! దొరబాబు తరువాత దొరగారు! వారి కారు నా పెళ్ళాం కాలు మీద నుంచి పోతే ఏంగాక! అది చావుల రేవు నుంచి ఒడ్డుకి విసరబడ్డా, ఇంకా నరకయాతన అనుభవిస్తుంటే ఏంగాక!. పనిమాలి కబురుపెట్టి మంచీ, చెడ్డా కనుక్కుంటున్నారు. దొరగారే చెప్పి వుంటారు. అసలు ఆస్పత్రికే వద్దామని ఆయనకు ఉండి ఉంటుంది. తీరికలేక చిన్న దొరగార్ని విషయాలు కనుక్కోమని చెప్పి ఉంటారు. ధర్మరాజు!"

భీమశంకరంగారు దగ్గారు. నేను తలెత్తాను. నోట్లో వెలుగుతున్న సిగరెట్టు ఏష్ట్రేలో పడేసారు. టేబిల్‌మీద పేపర్ వెయిట్ కదిపారు. కాస్సేపు ఇబ్బందిగా చూసి, "పోలీస్ కంప్లెయింట్ ఇచ్చారా?" అని అడిగారు.

నాకు వెంటనే వారేమంటున్నదీ అర్థం కాలేదు.

మనం చెయ్యలేని ఊహలుచెయ్యబట్టే వారు గొప్పవారయ్యారని నాకిప్పుడు తెలిసింది.

నిజం చెబుతున్నాను –

నా పెళ్ళాం కాలు మీద నుంచి దొరగారి కారుపోయి అది ఆస్పత్రిలో చేరితే పైడమ్మ తల్లిని వేడుకున్నాను – నా పెళ్ళాన్ని బ్రతికించమని, కడుపులో ప్రాణిని దక్కించమని.

నాకు పోలీస్‌స్టేషన్ జ్ఞాపకం రాలేదు. ఫిర్యాదు చెయ్యవచ్చని తోచలేదు. "దేవుడు చేసిందానికి మనిషిని నిందించేం ప్రయోజనం" అని మాత్రం అనిపించింది.

భీమశంకరంగారు – "జాగ్రత్త. కంప్లెయింటు మాత్రం ఇచ్చేవు!" అని, ఇంక వెళ్ళిపో మన్నట్టు చూసినప్పుడు నాక్కొంచెం బాధనిపించింది. "చిత్తం" అని తల ఊపి వచ్చేసాను.

రోజల్లా పనితో అయిపోయింది. ఆలోచనలకి తావియ్యని పని. సాయంకాలం డ్యూటీ దిగిపోతుంటే మళ్లీ కబురొచ్చింది.

ఈసారి కనబడని చిరాకుతో బయలుదేరాను దొరగారి ఆఫీసుకి. 'ఉదయం చెప్పారు కదా ఫిర్యాదు చెయ్యవద్దని? 'ఇప్పుడు కాస్త మంచీ, చెడ్డాకనుక్కుంటారేమో' నన్న ఆశతో వెళ్ళాను.

భీమశంకరంగారు నవ్వుతూ ఎవరితోనో టెలిఫోనులో మాట్లాడుతున్నారు. అయిదు నిమిషాలకి నా ఉనికిని గుర్తించినట్లు నావైపు చూస్తే, "నమస్కారం, సార్!" అని ఎప్పటిలాగే చేతులు కట్టుకుని నిలుచున్నాను.

"దొరగారు మళ్లీ చెప్పమన్నారు - పోలీసు కంప్లెయింటు ఇవ్వద్దని."

నాకీసారి మాట్లాడాలనిపించలేదు.

"ఏం అర్థమయిందా?" అన్నారు.

అన్నీ అందరికీ ఒక్కలా అర్థమవవు, కనబడవు ఒక్కలాగ.

నాకు నా పెళ్ళాం కోలుకోవాలన్న ఆత్రుత.

శంకరంగారికి దొరగారేచిక్కుల్లోనూ పడగూడదని ఆత్రుత.

కాలుమీద నుంచి కారుపోతే, కారుపోనిచ్చిన దొరగారిమీదే అందరికీ సానుభూతి.

నేను తల ఊపి వచ్చేశాను.

ఈవేళ సముద్రం పోటుమీద ఉంది. వాన కూడా పడుతున్నది. తడుస్తూనే పనిచేస్తున్నాను. మళ్ళీ కబురొచ్చినప్పుడు మండుకొచ్చింది.

వెళ్ళాను.

నమస్కారం పెట్టాను.

తల వంచుకు నిలుచున్నాను.

కాలికి మృదువుగా తివాచీ తగులుతున్నది. చలికి శరీరం వణుకుతున్నది. పైన ఫాను గరగర మంటున్నది.

విప్పిన పెదాలలోంచి అవే మాటలు.

నువ్వు బ్రతికి ఉన్నంతసేపూ నీ నెత్తిమీద ఎవడో నిలుచున్నట్టే ఉంటుంది. ఏం చేద్దామన్నా ఆ నెత్తిమీద వాడు ఎక్కడ మొట్టుతాడోనని జంకుతూనే ఉంటావు. ఈవేళ వాడికెదురు చెప్పావనుకో - ఎక్కడ నిన్ను దొంగ దెబ్బతీస్తాడోనని జంకు.

అయినా నేను 'చిత్తం' అనలేదు. తల ఊపలేదు. సమాధానం చెప్పలేదు.

"నా పెళ్ళాం యమయాతన పడుతోంది. నా మనసంతా దానిమీదే ఉంది. నువ్వు న్యాయం మరిచి, ధర్మం విడిచి, నేనూ మనిషేనని విస్మరించి, చేసిన హెచ్చరికే మళ్ళీచేసి, చెప్పిన సమాధానమే మళ్ళీ మళ్ళీ చెప్పించుకోవాలని చూస్తున్నావు.

నా బాధ నీకు తెలియదు. తెలియనూ వద్దు. నాకు కార్లెక్కాలని లేదు. కార్లు నా మీద నుంచి, నా వాళ్ళ మీద నుంచి పోకుండా ఉంటే చాలు. పోనీ, పోనిచ్చావు - అంతటితో వదిలేయరాదా!" అందామనుకున్నాను.

అప్పుడే భీమశంకరంగారు - "మొద్దులా నిలుచుని మాట్లాడవేం?" అని గద్దించారు.

నా కేమయిందో నాకు తెలియదు.

అంతవరకూ మూసుకున్నాయని కాదు కాని, కోపంతో తెరుచుకున్నాయి నా కళ్ళప్పుడు.

దించుకున్న తల పైకెత్తాను.

కళ్లు విప్పాను.

విప్పిన కళ్ళ నిండా ఎర్రదనం.

కళ్ళనిండిన ఎర్రదనం జీరల రూపంలో ఉంది.

నిండిన ఎర్రజీరల కళ్ళతో నా ముఖం భయంకరంగా ఉండి ఉంటుంది.

భీమశంకరం మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు.

వెనక్కి తిరిగి వచ్చేశాను.

గుమ్మం దాటి వస్తుంటే నా నెత్తిమీద ఎవరూ లేనట్టు నా కానందం వేసింది.

నా కాళ్ళ క్రింద ఏ ఒక్కరిదీ కాని భూమి.

నా నెత్తిమీద అందరికీ చెందిన ఆకాశం.

నన్ను తాకుతూ ఎల్లెడలా ఉన్న గాలి.

ఎదురుగా అలలు లేస్తూ, పడుతూ భూమినంతటినీ కౌగలించి ఉన్న సముద్రం.

అప్పుడు –

నాకు ఉద్యోగం గురించి భయం వెయ్యలేదు.

వెయ్యలేదు భయం జీవితం గురించి.

భయం నాకు భయపడి పారిపోయినా, నాకో అనుమానం మిగిలిపోయింది – నే నొక్కడిని కళ్ళు విప్పితేనే ఇలా ఉందే, నాలాటి వాళ్ళంతా మేలుకుంటే ఏమవుతుందా?' – అని.

– ఆంధ్రప్రభ వారపత్రిక, **9.2.1972**

# బొమ్మలాంతరు

"దేశం ఏమైపోతున్నది?"

సుబ్బయ్య నెత్తి మాడిపోతున్నది. పైన సూర్యుడు మండిపోతున్నాడు. 'పట్టుమని పదిగంటలైనా కాలేదు. పొద్దు ముందా ఎండ మట్టుకు ప్రచండంగా ఉంది' అనుకున్నాడు సుబ్బయ్య.

'పంటలు పండీ కరువులాగ, గొడుగుండీ తెరవడానికి వీల్లేదు' అని తన వెనకనున్నవారిని చూసి విసుక్కున్నాడు సుబ్బయ్య.

> *పేకాటలో ఒక చేతిని అన్నీ పొడిముక్కలే అయి,*
> *ఒక బొమ్మా లేకపోవడం "బొమ్మలాంతరు."*
> *అప్పుడు ఆట కలిపి, మళ్ళీ ముక్కలు కలపడం ధర్మం.*

'ఇది మనమందరం ఆలోచించవలసిన విషయం.'

'నయం - వాళ్ళతో వాదించైనా సరే ఆ బస్సు ఎక్కాను. లేకుంటే మీటింగ్‌కి లేటైపోయి ఉందును' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు సుబ్బయ్య.

'చారల బుష్‌కోటూ, సోడా బుడ్డీ కళ్ళద్దాలూ వాడూను. వాడు బస్సెక్కగానే సరిపోయిందనుకున్నాడు కాబోలు! ఆ పంగనామాలవాడు, వాడికి తోడు. చద్దన్నం తిన్నమ్మ మొగుడి ఆకలి ఎరగదట! శుభ్రంగా సీట్లోకూర్చుని, సిగరెట్టు కాల్చుకుంటున్నవాడికి, గంటల తరబడి బస్సుకోసం నిలుచుండి, ఏ వెధవా బస్సాపక పోగా ప్రయాణీకులు పడే అగచాట్లెలా తెలుస్తాయి? ఎర్రని ఎండలో జోళ్లు విప్పించి నడిపించాలి వీళ్ళని. అప్పుడుగాని తెలిసి రాదు' అనుకుంటూ మనసులోనే అక్కసు వెళ్ళగక్కున్నాడు సుబ్బయ్య.

అప్పటికి మూడుబస్సులు ఆగకుండానే పోయాయి. బస్సుకోసం నిలుచుని నిలుచుని కాళ్ళు పీకెడుతున్నాయి. మీటింగ్‌కి వేళైపోతుందని తొందరోమూల. ఎలాగైతేనేం

వచ్చిందో బస్సు. వచ్చిన బస్సు 'స్టాపు'కి దాదాపు ఇరవై గజాల దూరంలో ఆగింది. 'పోలో'మని అక్కడిగే పరుగెత్తారు జనం.

"ఆగండి, మాస్టారూ!" అన్నాడు బస్సుక్లీనరు, సుబ్బయ్యని చెయ్యి అడ్డంపెట్టి ఫుట్‌బోర్డ్‌మీదే ఆపి. 'ఏం?' అన్నట్టు చూశాడు సుబ్బయ్య. పార్లమెంట్ ఎలక్షన్స్‌కి పార్టీ టిక్కెట్లిచ్చేటట్లు – "మూడు టిక్కెట్లే ఖాళీ. దిగండి"అన్నాడు క్లీనరు.

సుబ్బయ్యని తోసుకుని ముందెక్కిన ఖ్హాడోవాడు తన అదృష్టానికి గర్విస్తున్నట్టు, సుబ్బయ్య దురదృష్టానికి సంతోషిస్తున్నట్టు చిన్నగా ఓ నవ్వు నవ్వాడు, సుబ్బయ్యని చూసి.

సుబ్బయ్యకి ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. కోపంతో బాటు ధైర్యమూ హెచ్చింది. "నేను దిగను" అన్నాడు ఖండితంగా.

"దిగకపోతే బండి కదలదు. ఆపవయ్యా ఇంజిను" అని అరిచాడు క్లీనరు. ఇంజను ఆగింది. సుబ్బయ్య వెనక బస్సు కమ్మీలు పట్టుకు వేలాడుతున్న మరో ముగ్గురు, నలుగురు కూడా, "ఎక్కించవయ్యా. నీ సొమ్మేం పోయింది! గంటై బస్సు కోసం చూసి, చూసి ఛస్తున్నాం" అన్నారు.

"ఏమిటండీ అలా మాట్లాడుతారు? బస్సన్న తరువాత కెపాసిటీ ఉండదా?" అని వెనక సీట్లో కూర్చున్న చారల బుష్ కోటువాడు సిగరెట్టు పొగ వదులుతూ అన్నాడు.

"బందులదొడ్లో పందుల్ని కుక్కినట్టు పాసెంజర్లని కుక్కిస్తే ఊపిరాడద్దా" అని వత్తాసు పలికాడు పక్కనే కూర్చున్న పంగనామాలు.

సుబ్బయ్యకి సాటివాడి బాధ అర్థం చేసుకోని ఆ ఇద్దరిమీదా బస్సు వాళ్ళమీదకంటే ఎక్కువ కోపం వచ్చింది. కండక్టరు కూడా అక్కడికొచ్చి "గొడవెందుకు, బాబూ? దిగిపోండి. వెనక వస్తున్న బస్సులో వద్దురుగాని. ఓవర్‌లోడై కేసు పెడితే మధ్యన మేం ఏడవాలి" అని సముదాయించబోయాడు.

సావిత్రికి యముడు లాగ సుబ్బయ్యకి కండక్టరు చిక్కాడు.

"బస్సు కెపాసిటి ఎంత? నువ్వెందరిని ఎక్కించావు" అని ఎదురు ప్రశ్న వేశాడు.

అప్పటికే బస్సు జనంతో మిశ్రమ మంత్రివర్గంలా కిటకిటలాడుతున్నది. సుబ్బయ్య వెనకాల ఉన్నవాళ్ళు కూడా "నువ్వు కెపాసిటీ మించి ఎక్కించిన వాళ్ళందరినీ దింపెయ్. మేమూ దిగిపోతాం. లేదా మమ్మల్ని కూడా తీసుకువెళ్ళు" అని దొంగ దగ్గర వాటా పుచ్చుకునే పోలీసులాగ న్యాయంగా పట్టు పట్టారు.

యుద్ధకారణాలు గుర్తించకుండా శాంతి సాధించాలనుకునే కొన్ని అగ్రరాజ్యాల్లా, బస్సులో కూర్చున్న కొందరు పెద్ద మనుష్యులు – "గొడవ దేనికి? పోనీవయ్యా బస్సుని. ఇప్పటికే ఆలస్యమైంది" అని కండక్టరుకి సలహా ఇచ్చారు.

కండక్టరు "రైట్!" అని కేకవేసి, "ఫుట్‌బోర్డు మీద మానేసి లోపల సర్దుకోండి"

అన్నాడు సుబ్బయ్యాదుల నుద్దేశించి.

సుబ్బయ్య నవ్వాడు.

సుబ్బయ్యని తోసుకుని ముందెక్కిన మూడోవాడు నవ్వలేదు.

చారల బుష్‌కోటువాడు సిగరెట్టు పీలుస్తూ, సోడాబుడ్డీ కళ్ళద్దాలలోంచి బయటికీ, పొడుం దట్టించి పంగనామాలవాడు పేపరులోకి చూడసాగారు.

బస్సు త్రైపాక్షిక సంఘంలా అందరినీ తనలో ఇముడ్చుకుని బయలుదేరింది.

✪ ✪ ✪

"ఎవరు అధికారంలో ఉన్నారు అన్నది ముఖ్యం కాదు. 'అధికారంలో ఉన్నావారు ఎలా ప్రవర్తిస్తున్నారు' అన్నది ముఖ్యం. అధికారంలో మేమూ ఉన్నాం. అప్పుడు ఈ ఊర్లో మీటింగ్‌కే ఈ గ్రౌండే క్రిక్కిరిసి పోయింది. ఈ వేదిక లైసెన్సుల గురించి, రికమెండేషన్సు గురించి, ఇంకా ఏవేవో లాభాలాశించి వచ్చిన పెద్దలతో నిండిపోయింది. దండల బరువుతో నా మెడ వంగిపోయింది. అయితే, తెప్పలుగ చెరువు నిండగా వచ్చిన కప్పలవి.

ఈ వేళ, ఇక్కడ చేరిన మీరంతా స్వంత శ్రేయస్సు నాశించికాక, ఒక ఆశయాన్ని, ఒక ఆదర్శాన్నీ నిలబెట్టేందుకు వచ్చినవారని నాకు తెలుసు. ఈ బూటకపు ప్రభుత్వపు నాటకాన్ని కట్టించి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని సుస్థిరంచేసేందుకు మీరంతా మాతో సహకరించాలి. సహకరించగలరని ఆశిస్తున్నాను. సహకరించమని విజ్ఞప్తిచేస్తున్నాను."

అందరితోబాటు సుబ్బయ్యా చప్పట్లు చరిచాడు. మైకుముందు కంఠం మళ్ళీ మోగింది.

"రవి గాంచనిచో కవి గాంచును" అన్నారు. ఇప్పుడు మన సమాజ మున్న దుస్థితీ, నైతిక విలువా రాహిత్యమూ, మానవుడిని మానవుడే దోపిడీ చేసే విధానమూపట్ల తీవ్ర విమర్శతో గూడిన తన కవిత 'చరిత్ర నిన్ను క్షమించదు' చదువుతారు ప్రజాకవి రుద్రశ్రీ."

సుబ్బయ్య ఆ కవితను వీలైనంత శ్రద్ధగా వింటున్నాడు.

వక్త తల ఊపుతూ తన ఆనందాన్ని తెలియజేస్తున్నాడు.

గేయంలోని ఆవేశానికి వేడెక్కి కర్మసాక్షి సూర్యుడు మరింత మండిపోతున్నాడు.

✪ ✪ ✪

"దేశం ముందుకు పోతున్నది."

సుబ్బయ్య నెత్తి మాడిపోతున్నది.

పైన సూర్యుడు మండిపోతున్నాడు.

'దేశంలో దరిద్రంలాగ ఈ ఏడాది వేసవికాలం అంతంకాదు కాబోలు' అనుకున్నాడు సుబ్బయ్య.

'ఏం ఊరో! ఉదయం మీటింగులు పెట్టి ఆఫీసుకి ఆలస్యంగా రావడానికి పెర్మిషన్లిచ్చే బదులు, చక్కగా సాయంకాలం సభలు జరుపుకోరాదా?' అని వేదికవేపు చూస్తూ విసుక్కున్నాడు సుబ్బయ్య.

'ఇది మన మెవ్వరం కాదనలేని విషయం.

'కాదూ కూడదంటే పోలీస్‌స్టేషన్‌కి అప్పచెప్పి ఉందును' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు సుబ్బయ్య.

"మంత్రిగారి మీటింగు, బాబూ! అందరికీ తొందరే. ఎవర్ని వదిలీ మంటారు?" అంటాడా కండక్టరు!

'మంత్రిగారి మీటింగైతే బస్సుల్నిండా మనుష్యుల్ని కుక్కేసి, ఒకరి మీదొకర్ని ఎక్కించి, ఊపిరి తిరక్కుండాచేసి చంపేయాలి గావాల్ను? అంత మీటింగు మీద శ్రద్ధయితే పెందలకడే బయలుదేరద్దూ? అవ్వా, బువ్వా కావాలంటే ఎలా కుదురుతుంది' అనుకొంటూ మనసులోనే అక్కసు వెళ్ళగక్కుకున్నాడు సుబ్బయ్య.

ఉదయంలేచి వేగంగా తయారై, బస్సుస్టాపు చేరుకుని, తను వెళ్ళవలసిన వేపు నుంచి వస్తున్న బస్సెక్కి, ఆ బస్సు 'టెర్మినల్ పాయింట్'వరకూ టిక్కెట్టు తీసుకుని, తిరిగి ఆ బస్సులోనే మీటింగు స్థలానికి బయలుదేరాడు సుబ్బయ్య. ముప్ఫయిరెండు పైస లెక్కువైనా, బస్సులో హాయిగా కూర్చునేందుకు స్థలం దొరికింది.

బస్సు సుబ్బయ్య ఎక్కిన స్టాపుకి దాదాపు ఇరవై గజాల దూరంలో ఆగింది. ఎక్కడలేని జనమూ ఒకర్ని తోసుకుని ఒక రెక్కేసి ఒకటే తొక్కిడి.

చౌకడిపో క్యూలో కుమ్ములాడుకుంటున్న కూలీ, నాలీ చేసుకునే జనాన్ని, గల్లాపెట్టె ముందు కూర్చున్న షాహుకారు చూస్తున్నంత ధీమాగా, వాళ్ళని చూస్తున్నాడు సుబ్బయ్య.

సుబ్బయ్య కాలొకడు మట్టేశాడు. అప్పుడు మాత్రం చిరాకు ముంచుకొచ్చి కండక్టర్ని అడిగాడు, కెపాసిటీ గురించి. కండక్టరు సమాధానం పూర్తయ్యేంతలో ఫుట్‌బోర్డు మీదున్న తాతొకడు అందుకున్నాడు. "నువ్వెక్కేసి, నిమ్మలంగా కూకొని, అంతా సరిపోనాదనుకుంటు న్నావు గావల్ను" అంటూ నిలదీశాడు.

ఒంటిని చొక్కా అయినా లేదు. మోకాలు దిగని పంచ మొలకి చుట్టుకున్న ముసలి వెధవ! వాడా మాటంటాడా? వీడి డబ్బులిచ్చి బస్సు ఎక్కించాడా? వీడి బాబు డబ్బులిచ్చా?

"ఏమిటండీ అందరూ ముందో వెనకో దిగిపోవలసినవాళ్ళమే కదా! మనలో మనం సర్దుకుపోకపోతే ఎలా?"

వాడికి వీడు సాయం. లొడితెడు లేదు మనిషి. వాడికన్నా వాడి చెంపలు పొడుగు. వాడూ సలహాలివ్వడమే. ఈ వేళో, రేపో అంతా చచ్చేవాళ్ళమే కదా – బస్సుకింద బుర్రపెట్టేలేకపోయాడూ?

సుబ్బయ్య పక్కన కూర్చున్న ప్రయాణికుడు కూడా ఊరుకోలేదు. "మంత్రిగారి మీటింగైతే స్పెషల్ బస్సులు నడపలేకపోయారా? ఇంకెంతమంది నెక్కిస్తావు?" అని కండక్టర్ని గదమాయించాడు. ముగ్గురు నలుగురందుకు వత్తాసు పలికారు.

"ఇలా అయితే పోలీస్‌స్టేషన్‌లో కంప్లెయింటు ఇయ్యవలసి వస్తుంది" అన్నాడు సుబ్బయ్య. ఫుట్‌బోర్డు మీద నిలుచున్నవాళ్ళు తప్ప, ఇంకా బస్సెక్కబోతున్నవారిని దింపేసి – కండక్టరు "రైట్" అన్నాడు.

ముసలివాడు సుబ్బయ్యవేపు కొరకొరా చూశాడు.

పొడుగు చెంపలవాడు ముసిముసిగా నవ్వాడు.

సుబ్బయ్య బస్సు దొరకని వారివేపు నిర్లిప్తంగా చూశాడు.

భారతదేశంలాగ అన్ని వైరుధ్యాలనూ తనలో ఇముడ్చుకొని బస్సు బయలుదేరింది.

"ఒక అద్భుతమైన మార్పు జరిగింది స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో. అయితే విశాలమైన ఈ దేశంలో, శతాబ్దాల తరబడి పేరుకున్న దారిద్ర్యాన్నీ, అసమానతలనూ ఒక్క రోజులో తీసివేయడం సాధ్యం కాదు. ఒక బృహత్తర ప్రయత్నం జరుగుతున్నది. ప్రగతికోసం కృషిచేస్తున్నాం.

"మా మంత్రివర్గం, పార్టీ అభివృద్ధిని ఆటంకపరిచే అన్నిశక్తులనూ ఎదుర్కొంటాయి. ఎవరు అడ్డుపడినా ఈ సామ్యవాద వ్యవస్థ స్థాపన ఆగదు. ప్రజాబలం అండగా గల ఈ ప్రభుత్వం తన పవిత్ర కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. ఆ యత్నంలో అందరి తోడ్పాటుకావాలి. మీరందరూ తోడ్పడగలరని ఆశిస్తున్నాను. తోడ్పడమని విజ్ఞప్తి చేస్తున్నాను."

మనసులో–'ప్రతిపక్షంనుంచి చీలి, అధికారవర్గంలో చేరి, ఈయన మంత్రి కావడమే కాబోలు అద్భుతమైన మార్పు' అనుకున్నా, అందరితోబాటు సుబ్బయ్యా చప్పట్లు చరిచాడు.

మైక్ ముందు కంఠం మళ్ళీ మోగింది.

"కనిపించక వినిపించేవాడు కవి, అన్నారు. ఇప్పుడు తను కనిపిస్తూనే, మనకు దేశాభ్యుదయాన్ని, ప్రణాళికా ప్రగతిని, సమ సమాజ స్థాపనా కార్యక్రమాన్ని శ్లాఘించే తన కవిత 'ఉజ్జ్వల భారతం' వినిపిస్తారు నవ యువకవి రుద్రశ్రీ!"

సుబ్బయ్య ఆ కవితను వీలైనంత శ్రద్ధగా వింటున్నాడు.

వక్త తలూపుతూ తన సమ్మతి తెలియజేస్తున్నాడు.

తను చూడలేని ఆనంద సౌభాగ్యాలను కాంచిన కవిగారి ముఖ కమలాన్ని చూడ డానికి మనసు రాక, కర్మసాక్షి సూర్యుడు మబ్బుల్లో ముఖం దాచుకున్నాడు.

– ఆంధ్రప్రభ వారపత్రిక – **19.4.1972**

# చచ్చిపోయాను కాను

పనస మొక్క తను నాటిందే. చెట్టయింది. కాయలు గుత్తులుగా వేలాడుతున్నాయి. ఇంటిచుట్టూ ఫెన్సింగ్ తనే కట్టించాడు. ఎంత డబ్బయిందో గుర్తులేదు. వెదురుబద్దలతో పెద్దవాడు కట్టిన ఆర్చిమీదుగా కాశీరత్నం తీగ అల్లుకుని ఉంది.

కృష్ణుడు పుట్టిన ఏడాదే తనకి క్వార్టర్స్ ఇచ్చారు. ఇరవై రెండేళ్లు కాంతం, తనూ కష్టసుఖాలిక్కడే పంచుకున్నారు.

ఎన్నో జ్ఞాపకాలు. తలుచుకుంటే కన్నీళ్ళూ వస్తాయి, చిరునవ్వులూ చిందుతాయి.

వాసు కొకసారి టైఫాయిడ్ జ్వరం వచ్చి ఓ రాత్రిగాభరా చేస్తే, అదురుతున్న గుండెలు చేతులతో పట్టుకుని, కన్నీళ్ళు బిగపట్టుకున్న కాంతాన్ని ఓదారుస్తూ, రాత్రల్లా కూర్చోవడం...

తండ్రిపోయాడన్న టెలిగ్రామ్ అందుకుని సాయంకాలం రైలు వేళ వరకూ కళవళ పడుతూ గడపడం....

తరువాత తల్లి ఇక్కడే చనిపోయింది.

తండ్రీ, తల్లీ ఒకరి తరువాత ఒకరు - చక్రంలా కాలం తిరిగిపోయింది.

ఇప్పుడు తను.

మూడేళ్ళయింది సర్వీసులోంచి రిటైరయి.

తను రిటైరయ్యాడు. తన సమస్యలు రిటైరవలేదు.

ముప్ఫయినాలుగేళ్ళ సర్వీసులో ఒక్క నిర్మల పెళ్ళి చెయ్యగలిగాడు తను.

ఇల్లు కట్టుకోవాలని ఎంతో కోరికగా ఉండేది. కాంతానికి మరీని.

స్వంతానికో చిన్న ఇల్లు. తనదీ అంటూ ఏమైనా సంతతికి మిగలాలని. కుదరలేదు. తను చనిపోతే స్మృతే మిగులుతుంది - బాకీలూ, పిడికెడు బూడిదా పోనూ.

రిటైరవగానే క్వార్టర్సు ఖాళీ చెయ్యవలసి వచ్చింది. లేకపోతే పెన్షన్ మంజూరు కాదు.

ఎన్నో చిన్న కోరికలు. తీరనేలేదు.

ఇంక పిల్లలు పుట్టరనుకుంటూంటే కృష్ణుడు పుట్టాడు. తరువాత నిర్మల, వాసు, కమల, సరోజ. ఆఖరివాడు చంద్రం.

చంద్రం చదువు ఇంకా ఉన్నతపాఠశాల స్థాయిలోనే ఉంది. సరోజని కాలేజీలో చేర్చలేదు. పి.యు.సి. చదువుతున్న కమలని చదువు మానిపించి, ప్రావిడెంటుఫండు డబ్బుతో పెళ్ళిచేసి అత్తవారింటికి పంపడమైంది. వాసు ప్రభుత్వంవారి లోన్‌తో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. కృష్ణుడికి బి.కామ్ పూర్తయినా ఉద్యోగం దొరకలేదు.

పెన్షన్ దబ్బుతో సంసారం గడవాలి. గడవదు. గడుపుకోవాలి. నిండా జీతమంది నప్పుడే బాకీలు, బాధలు. ఉత్త పెన్షన్ దబ్బులేం సరిపోతాయి?

“పోర్టులోనే గుమాస్తా ఉద్యోగాలు ఖాళీ వచ్చాయి. నా కన్నా సీనియర్‌లు ఉన్నారట. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజి వాళ్లు నా పేరు పంపడంలేదు” అన్నాడు కృష్ణుడు, ముఖం చిన్నబుచ్చుకుని.

కృష్ణుడికి ఉద్యోగమైతే బాగుండును.

సరోజకి ఎలా పెళ్ళి చెయ్యగలడో భగవంతుడికే తెలియాలి.

చంద్రం చదువు.

క్లబ్ ఆవరణలో ఫుట్‌బాల్ ఆడుతున్నారు. పడుచుదనం.

ఫుట్‌బాల్ ఆటలో బంతిని కాలితో తన్నినట్టు, ఎవరో జీవితాన్ని ఆటబంతిగా చేసి తన్నుతున్నారు.

నాలుగు అడుగులు వేస్తే అచ్యుతం ఇల్లు.

అచ్యుతరావూ, తనూ ఒక్క ప్రాణంగా మెలిగారు. ఎప్పుడూ మాటా మాటా అనుకో లేదని కాదు. అనుకున్నా, మరిచిపోయి మర్నాటికల్లా మనసులు విప్పి మాట్లాడుకునేవారు.

సీతమ్మ, కాంతం కూడా అక్కచెల్లెళ్ళలా ఉండేవారు – ‘వదినా!’ అంటూ పిలుచుకున్నా.

అలాంటి అచ్యుతరావు చచ్చిపోయాడు. స్వంత తమ్ముడు చచ్చిపోయినట్టనిపించింది. సీతమ్మ ముఖం చూడలేకపోయాడు మొదట్లో.

తనకన్నా అచ్యుతరావు అయిదేళ్ళు చిన్న. ఇంకా రెండేళ్ళలో రిటైరవుతాడనగా చని పోయాడు. అప్పుడే రెండు నెలలు కావస్తూంది.

అచ్యుతరావు చనిపోయినా అనుబంధం తెగిపోలేదు. వారానికి ఒకసారైనా టౌను నుంచి క్వార్టర్సుకి వచ్చి, చిరంజీవినీ, పిల్లల్నీ, సీతమ్మనీ చూసి రావాలనంటుంది. అందుకే ఈ బయలుదేరడం.

పదిహేను రోజులు నిర్మల దగ్గరుండి, నిన్ననే తను వచ్చాడు.

చిరంజీవి కృష్ణుడికన్నా రెండేళ్ళు చిన్న. బి.కామ్ చదువుతుండగా అచ్యుతం చని పోయాడు. చదువాగిపోయింది. ఏం తంటాలుపడుతున్నాడో? పసికుంక.

‘మామయ్యొస్తున్నారు! మామయ్య!’ చిన్నది లక్ష్మి గెంతులేస్తూ దగ్గరికొచ్చింది.

సీతమ్మ "రండి, అన్నయ్యా!" అంటూ గుమ్మంలో నిలబడి ఆహ్వానించింది. ముఖంలో ఆనందం ద్యోతకమవుతూ ఉంది.

"ఏమిటమ్మా విశేషం? శుభవార్త ఏదన్నా ఉంటే తొందరగా చెవినివేయ్!"

అదే పేముకుర్చీ. ఎన్నోసార్లు అచ్యుతం ఎదురుగా అందులో కూర్చుని మాట్లాడే వాడు. లాక్కుని కూర్చుంటూ అడిగాడు.

"విశేషమే నన్నయ్యా! చీకట్లో వెలుగురేఖ. చిరంజీవికి పోర్టులో ఉద్యోగమైంది. వారు పనిచేస్తూ, చేస్తూ చనిపోయారు కదా? అందుకని పిల్లడి పేరు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజి నుంచి రాకపోయినా పరీక్షకి పిలవచ్చుట. వాడలా పరీక్ష క్యాచుని సెలక్టయ్యాడన్నయ్యా."

"సంతోషం, తల్లీ!"

కృష్ణుడు ఉద్యోగం. సరోజ పెళ్లి, వాసు, చంద్రం. చదువు. బ్రతకడం, అద్దెకొంప.

"క్వార్టర్సు కూడా వీలైనంత త్వరలో ఇస్తారుట, అన్నయ్యా! కమిటీలో అదో రూలుందిట కదా?"

నిజమే. రూలు ఉంది.

ఉద్యోగం చేస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి వేరే ఆధారం లేకపోతే అతని పిల్లలలో ఒకరినో, ఆ కుటుంబ బాధ్యత వహించిన దగ్గర బంధువునో, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజితో సంబంధం లేకుండా సెలక్షన్‌కి పిలవచ్చు. ఆ పిల్లడికి ఉద్యోగమైతే క్వార్టర్సు వేరే కేటాయిస్తారు.

"చల్లని కబురు చెప్పావు, తల్లీ!"

అవీ, ఇవీ మాట్లాడి టౌనుకు బయలుదేరే వేళకి సంజ వాలుతున్నది.

ఉద్యోగంచేస్తూ తను కూడా చచ్చిపోయి ఉంటే....

ఈపాటికి కృష్ణుడికి ఉద్యోగమై ఉండేది. క్వార్టర్సూను. వాడికి పెళ్ళి, ఆ డబ్బుతో సరోజపెళ్ళి కూడా జరిగి ఉండేది. వాసు, చంద్రంల చదువు, కుటుంబ పోషణ ఏదోలా జరిగి ఉండేవి.

అచ్యుతం అదృష్టవంతుడు. బ్రతికి ఉండి తనలా కుటుంబానికి అన్యాయం చెయ్య లేదు.

ఈ దేశంలో బ్రతికి సాధించలేని పనులు కొన్ని, కొన్ని చోట్లైనా చచ్చి సాధించే వీలుంది.

'చచ్చిపోయాను కాను!'

– ఆంధ్రప్రభ వారపత్రిక, **14.6.1972**

# ఎన్నాళ్ళు ఇంకా?

ఆ సాయంకాలం....

"అమ్మా! అన్నయ్యను అమ్మేస్తున్నారా?"

శోభ చిన్నపిల్లేం కాదు. పదో క్లాసు చదువుతూంది. పధ్నాలుగేళ్ళుంటాయి. అయినా, వాళ్ళమ్మ నవ్వింది. మేనత్త నవ్వింది. నవ్వుకుంటూనే - 'చిన్న పిల్ల. సంబంధాలు స్థిరపరుచుకోవడాలు దానికేం తెలుసు' అనుకుంటూ జాలిపడ్డారు.

గదిలో ముసలాయన, పెళ్ళికూతురు తాత, మూడువేళ్ళు చూపిస్తున్నాడు- "మాటాడరేం? మానోటే చెప్పించాలని చూస్తున్నారా?" అన్న పెళ్ళి కొడుకు తండ్రి మాటకు సమాధానంగా.

"ఇంత అన్యాయమా? ఈ రోజుల్లో ఎస్.ఎస్.ఎల్.సి. చదివినవాళ్ళకిస్తున్నారు మూడు వేలు" అంది పెళ్ళి కొడుకు పిన్నమ్మ.

"ఏమిటీ, మూడువేలా? మొన్ననే మా కోడలు తమ్ముడి రెండో కొడుక్కి పెళ్ళి చేసారు. శుభ్రంగా ఆరువేలు కట్నం, ఆడపడుచు లాంఛనాలు రెండువేలు, స్టీలు సామాను, కుట్టు మిషను అన్నీ ఇచ్చారు" పెళ్లికొడుకు మామ్మ అందుకుంది. ముసలాయన చూపించిన మూడు వేళ్ళు ఆవిడకి కనపడలేదు. చూపానక. కోడలు మాటల ద్వారా సంగతి గ్రహించి సంభాషణ ప్రారంభించింది.

"అమ్మా! అన్నయ్యకి కుట్టు రాదు కదా - మిషనెందుకే?"

గదిలో పెళ్ళిబేరాలు సాగుతున్నాయి. వెనక వసారాలో తల్లి, కూతురు, మేనత్త ఉన్నారు. కూతురి మాటలు వాళ్ళ చెవి నెక్కడ పడతాయోనని గాభరా పడిందావిడ. "చాల్లే, ఊరుకో." కసిరింది మేనత్త.

పిల్ల బాగుంది. సెవెన్త్‌ఫారమ్ పాసయింది. సంప్రదాయమైన కుటుంబం. అన్నీ అందరికీ నచ్చాయి. కట్నం తప్ప.

✪ ✪ ✪

ఆ రాత్రి....

"బాగుంది, నాయనా, నీ వాదం! పెద్దపెద్దవాళ్ళే పుచ్చుకుంటున్నారు లక్షలకొద్దీ కట్నం. వాళ్ళందరికీ నీ మాత్రం వివేకం లేకనా?"

"వివేకం ఉన్నా బాగుండును" అనుకున్నాడు పెళ్ళికొడుకు.

"ఎందరి కాళ్లు పట్టుకుని బ్రతిమాలి అప్పు తెచ్చి కట్నం ఇస్తారో ఆడపిల్లల తండ్రులు! ఆ అప్పులు తీరక, తీర్చలేక మరింకెంత బాధపడతారో? ఆ కన్నీటి కూడుతినడంలో ఏం తృప్తి ఉంది."

"నువ్వూరుకోవే. చిన్నంతరం, పెద్దంతరం లేకుండా!"

"అననీయమ్మా. ఎన్నన్నా కట్నం పుచ్చుకొమ్మంటున్నామూ అంటే ఎందుకు? దాని పెళ్ళికి పనికొస్తుందనేనా? గుంట నాగమ్మ - ఇప్పటికే నలుగుర్నీ మేపలేక చస్తున్నాడు. ఈ కట్నమూ వద్దంటే తరవాత దాని పెళ్ళి ఎలా చేస్తాడు?"

"నా గురించి మీకేం బాధవద్దు. నా పేరు చెప్పి మరో ఆడపిల్ల గొంతు కోయొద్దు. కట్నం పుచ్చుకోని వాడినే పెళ్ళాడతాను నేను."

"వాడు పెళ్ళాడద్దూ?"

"ఆడకపోతే ఇలాగే ఉంటాను."

"ఈ ప్రతిజ్ఞలకేంలే! నీ పెళ్ళికి కాకపోతే వాడి ఒడుక్కే ఆయెను. డబ్బు చేదా? ఇది కాకపోతే మరో సంబంధం. కట్నం మాత్రం ఐదు వేలూ పుచ్చుకోవలసిందే. ఏమంటావు?" అబ్బాయిని అడిగింది మామ్మ.

అబ్బాయి ఏమీఅనలేదు. ఏదేనా అనేటట్టు అతను పెరగలేదు. తండ్రి వంక చూసాడు.

"అంతేనమ్మా. వీడి పెళ్ళికేనా డబ్బుండాలా,-వద్దా? పిల్లకి బంగారం పెట్టాలా? పెళ్ళికి పిలిచిన నలుగుర్నీ ఆదరించాలా? గృహప్రవేశానికీ, సత్యనారాయణ వ్రతానికీ డబ్బుండాలా? అసలు పెళ్ళన్న తరువాత ఓ పందిరేసి, నాలుగు కొత్త గుడ్డలు నలుగురికీ కొనాలా?" ఒక్కొక్క వాక్యమే నిదానంగా పలికాడాయన.

"వాళ్ళు కట్నం ఇవ్వద్దు. మనం బంగారం పెట్టద్దు. నలుగుర్నీ పిలిచి ఘనంగానే చేస్తే పెళ్ళా? కలిగిననాడే వ్రతాలు చేసుకోవచ్చు."

"ఇంక ఆపు. నీకేం? నువ్వు చెప్పినట్టు చేస్తే, పెద్దదాన్ని తరువాత అందరూ నా ముఖాన్నమ్మా పేడనీళ్ళు చల్లుతారు."

"పేడనీళ్ళు చల్లరు. ఈ వేసవిలో ప్రయాణాలూ, ఖర్చులూ తప్పినందుకు, ప్రెజెంటేషన్లు కొనక్కరలేనందుకు హాయిగా నిట్టూర్చి 'థాంక్స్' చెబుతారు."

✪ ✪ ✪

నాలుగేళ్ళయ్యాయి.

ఆ మధ్యాహ్నం.....

వేసవి ఎండ వేడిగానే ఉంది. జోళ్ళు లేకుండా నడుస్తున్న కాళ్ళు మండుతూనే ఉన్నాయి. గొడుగుల్లేని నెత్తులు మాడుతూనే ఉన్నాయి. లిమ్కాలు, కోకాకోలాలు, కనీసం చెరకురసాలు తాగలేని నోళ్లు ఆర్చుకుపోతూనే ఉన్నాయి. ఎండలో, ఆకలితో తిరుగుతున్న శరీరాలు నీరసంతో, అలసటతో జోగుతూనే ఉన్నాయి.

ఆ ఎండలో ఉదయం తొమ్మిది గంటలకి నాలుగుముద్దలు అన్నం తిని పనిమీద బయలుదేరి, ఉత్తకాళ్ళతో ఊరంతా తిరిగి, మండే నెత్తిమీద తువ్వాలుతో ఆ ఇంటి గుమ్మం ఎక్కి కూర్చున్నాడు సీతారామయ్య. చెమట పట్టిన ముఖం తువ్వాలుతో తుడుచుకుని, "అయ్యా! రమణయ్యగారు ఉన్నారా?" అని ఎదురుగా ఉన్న ఆసామీని అడిగాడు.

ఎదురుగుండా కూర్చున్న వ్యక్తి మరింత సన్నంగా, పాలిపోయిన తెల్లరంగులో ఉండడం తప్ప, సీతారామయ్య లాగానే ఉన్నాడు. ఆకారంలో కాదు పోలిక – అవతారంలో.

అతను సీతారామయ్యను పరిశీలనగా చూస్తూ "నిద్రపోతున్నారు. ఇంతకీ తమరు..." అంటూ జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూండగానే, సీతారామయ్యకి గుర్తు వచ్చింది.

"అవును, బావగారూ! నేనే, సీతారామయ్యని, మా అబ్బాయికిక్కడికి ట్రాన్స్ఫరయింది."

క్షణం వీర్రాజు తటపటాయించాడు – 'బావగారూ' అనడానికి. గొంతుకేదో అడ్డు పడ్డట్టయింది–నోరు విప్పనంత వరకే. తరువాత మాటలు తోసుకొచ్చాయి, ఏదో ఆత్మీయతతో.

"బావగారూ! ఎలా ఉన్నారు? అమ్మగారు బాగున్నారా? మా చెల్లాయి? అబ్బాయికి పిల్లలా? మీ అమ్మాయికి పెళ్ళి చేశారా?"

సీతారామయ్యకి ఆ ధోరణి ఆశ్చర్యంవేసింది. ఆనందమూ కలిగింది. "మీ దయవల్ల, దేవుడి దయవల్ల ఏదో ఇలా ఉన్నాం. అమ్మ ఫరవాలేదు. అబ్బాయికి మరో సంబంధం చేశాము. ఇద్దరు పిల్లలు. పిల్లకి సంబంధం నిశ్చయమైంది. ఈనెల పదహార్నే ముహూర్తం. మీరు మనసులో మరో భావంతో ఉంటారేమోనని మీ గురించి వాకబుచెయ్యలేదు. లేకపోతే, ఈ ఊరు రాగానే కలిసి ఉందును."

"మరో భావమా? ఏ భావమూ లేదు, బాధ తప్ప. ఆనాడు అదనంగా మీ రడగిన రెండువేలూ ఎక్కడ తేగలననే ఆలోచించాను. కాని...."

"అవన్నీ ఇప్పుడెందుకు? అమ్మాయికి పెళ్ళయిందా? ఏ ఊరు అత్తవారు?"

"అంత భాగ్యంకూడానా! నాలుగేళ్ళు నానా శ్రమాపడ్డాను. పిల్ల వయసు పెరుగుతున్నకొద్దీ సంబంధం కుదరడం మరింత కష్టమయింది. కడకి ఎలాగైతేనేం ఓ సెకండరీ స్కూల్ టీచర్ సంబంధం ఖాయమైంది. అయిదువేలు కట్నం తప్పలేదు. మేమూ ఈ పదహార్నే ముహూర్తం పెట్టుకున్నాం."

"సంతోషం."

"ఏం సంతోషం? దాని పెళ్ళికి దాచిన మూడువేలూ సంబంధాలు చూడడానికీ, నా భార్య జబ్బులకీ అయిపోయాయి. రమణయ్యగారి దగ్గర ఇల్లు తాకట్టుంచి...."

సీతారామయ్య ముఖం పాలిపోయింది.

"పోనీండి. ఆ గొడవలన్నీ చెప్పి మీ మనస్సుకెందుకు బాధకలిగించడం? ఏం పనిమీద వచ్చారో, ఏమో!"

"పనా? పని. ఏం పనుంటుంది మనకి డబ్బున్న వాళ్ళతో? ఆ పనిమీదే వచ్చాను. చెప్పసైతం చెప్పారు అబ్బాయి, అమ్మాయి కట్నం పుచ్చుకోవద్దని. పుచ్చుకున్నాను. పిల్లాడి పెళ్ళి ఘనంగా చెయ్యాలన్న నా ఆశ తీరడానికి. వాడి చెల్లెలు పెళ్ళి ఖర్చు కొంతయినా కలిసి వస్తుందన్న ఆశకొద్దీనూ.

మిగల్లేదు. వివాహం వేడుకగా చెయ్యాలన్న తాపత్రయమూ తీరలేదు. మస్తుగా తిని, తృప్తిగా తేన్చినవాళ్ళయినా మనస్ఫూర్తిగా మెచ్చుకోలేదు – ఎంతసేపూ వెనకాతల లోటుపాట్లు చెప్పుకుంటూ విమర్శించారు తప్ప. పిల్ల పెళ్ళికి మిగిల్చిన కొంత డబ్బూ కాళ్ళొచ్చినట్టు నడిచిపోయింది. ఇప్పుడు అమ్మాయి పెళ్ళి చెయ్యడానికి నానా గడ్డి కరుస్తున్నాను. పిల్లేమో కట్నం ఇస్తే పెళ్ళే చేసుకోనంటుంది. కట్నం వద్దన్న మగరాయుడే కనపడ్డంలేదు. ఆఖరికి కట్నం ఇస్తున్నట్టు పిల్లకి తెలియనివ్వకుండా, ఈ సంబంధం స్థిరపరిచాను. కట్నం విషయం రహస్యంగా ఉంచండని పెళ్ళివారికి చెపితే, 'తరువాత ఏం మోసం చేస్తారో, ఆ డబ్బు ముందే కక్కండి' అని పట్టు పట్టాడు వియ్యంకుడు. అందుకనే వచ్చాను రమణయ్యగారి దగ్గరకు."

"నిజమే. మన బాలసారెలూ, పెళ్ళిళ్ళూ, దినవారాలూ, తద్దినాలూ సర్వం డబ్బుతోనే ముడిపడి ఉన్నాయి. మన దగ్గర డబ్బు లేదు. ఉన్నదల్లా వదులుకోలేని ఆచారాలూ, లేనిపోని గొప్పలకి పోవాలనే ఉబలాటమూను.

చూస్తూ ఉండండి. మనం ఇళ్ళు తాకట్టుంచి డబ్బు ఎవళ్ళ చేత పోస్తున్నామో ఆ మగపెళ్ళివారు, ఆ డబ్బు వడ్డీలతో సహా మరో షావుకారికేనా చెల్లించుకుంటారు, లేదా కొన్నాళ్ల తరువాత నెత్తిన చెంగేసుకుని వాళ్ళమ్మాయిల పెళ్ళిళ్ళ వేళకు మన లాగే 'ముష్టి'కి

బయలుదేరతారు. కలిగినవాళ్ళు కల్పించుకున్న ముచ్చట్లు మనం కూడా పాటించాలని ప్రాకులాడితే ఫలితం ఇంకోలా ఉండేందుకు వీల్లేదు."

"అంతే. నీరు తనంతట తాను పల్లానికి పోతుంది. డబ్బు మనంతట మనం ఉన్న వాళ్ళ దగ్గరికి చేరవేస్తాం."

✪ ✪ ✪

ఆ రాత్రి....

రమణయ్యగారు కర్పూరతాంబూలం నములుతూ, పట్టుపానుపు మీద కూర్చుని ఉన్నారు. అప్పుడే ఐరావతం లాటి ఆయన అర్ధాంగి శయ్యాగృహంలో కాలు మోపారు. "ఏమండీ, ముచ్చటగా ఉన్నాయండి నగలు. కాని, ఒకటీ సరిపోవడం లేదు. అన్నీ కరిగించేసి వంకీల వడ్డాణం చేయించుకోనా?" అని మురిపెంగా అడిగారు, భర్తగారి పక్కన, పక్కమీద చేరుతూ.

"మరీ అంత తొందరా! ఒక్క రెండేళ్ళు ఆగు. మన క్రిందే జమయిపోతాయి. రెండేళ్ళే అయింది–సీతారామయ్య అని – వారి కొత్త కోడలికి చేయించారా నగలు. కూతురు పెళ్ళికి కొడుకు పెట్టిన లోను డబ్బు చాలక, ఇవి మన దగ్గర తాకట్టుంచి కొంత సొమ్ము తీసుకెళ్ళారు."

"అబ్బ, రెండేళ్ళే!" నిట్టూర్చారావిడ అతిభారంగా.

"పోనీ, రేపే చేయించుకో వడ్డాణం. ఆ మాత్రం దానికి ఈ నగలే కరిగించాలా? చిన్నమ్మాయి పెళ్ళికి ఈ నగలు పెట్టేద్దాం. మన వీధిలో వీర్రాజుగారి ఇల్లు ఉంది. ఎరుగుదువు కదా? దేవుడు మేలుచేస్తే ఆ ఇల్లు అల్లుడు పేర రాసేయచ్చు నా వేళకి."

"ఎంత ముందు చూపండీ మీకు!" ఆవిడ మురిసిపోతూ అని, కబంధుడిలా చేతులు చాచి, లోకంలోని ధనరాసులన్నిటినీ చేతుల్లోకి తీసుకు

ంటున్నట్టు రమణయ్య గారిని కౌగిలించుకున్నారు.

– ఆంధ్రప్రభ వారపత్రిక, **21.6.1972**

# ఎదురు తిరిగిన అలలు

'అలా చూడండి, చందమామ నందుకోవాలని అలలు లేస్తో, పడుతో.'

'ఉహు. చూడను. నిన్నే చూస్తాను. నీ నీలాల ముంగురులనే, అరచందమామ లాటి నుదురువే చూస్తాను. నీ చెక్కు టద్దాలను, నీ సంపంగి నాసికను, ముత్యాల పల్వరసను, శంఖంలాంటి మెడను, మెడ క్రింద ...

'చూద్దురుగాని లేవండి. హాస్టల్లో మీల్స్ టైం అవ్వొస్తున్నది.'

'భోజనం లేకపోతేనేం? నిద్రలేకపోతే నేం? నా శరీరాన్ని తాకుతూ నీ శరీరం, నా ముఖాన్ని తగుల్తూ నీ చీర చెంగు, నన్ను మత్తెక్కిస్తూ నీ జడలో మల్లెలు.'

'భోజనం నిద్రమాని, ప్రేమ తిని బ్రతికే మహత్తర వ్యక్తులను నేనెప్పుడూ చూడలేదు. రాత్రి రూమ్‌కి చేరకపోతే వార్డెన్ సస్పెండ్ చేస్తుందన్న భయంగాని లేకపోయినట్లయితే...'

'వద్దు, వద్దు పోదాం పద రాణీ!'

✪ ✪ ✪

'ఏంరా యింకా ఎంత సేపు ఆలోచిస్తావు?" ఉరిమినట్టున్న తండ్రి కంఠం చెవులనే కాక హృదయాన్నీ తాకగా ఉలికి పడ్డాడు.......

'నేను రాణిని....' మాట పూర్తవలేదు.

'చెప్పావు కదా. నువ్వు రాణీని ప్రేమిస్తున్నావు? అంతేనా!"

అంతే! అంతే!

అయినా, "ప్రేమిస్తున్నావు" అన్న పదం అంత దారుణంగా, వ్యంగ్యంగా పలకాలా?

'ఆఖరుసారి .... చెప్తున్నాను.'

ఆఖరుగా .... మిగిలిన ఆశలన్నీ ఏకమై, ఏమిటేమిటి చెప్తారు.

ఏ తీర్పు యిస్తారు.

దండవేయింస్తారా?

దండన విధిస్తారా

'వీల్లేదు' ....

ఎందుకు .....వీల్లేదు?

మీరేమన్నా.... మాట్లాడక పోట్లాడక వూరుకుంటున్నాననా?

"ఎవర్నడిగి ఆ అమ్మాయిని ప్రేమించావు?"

ఎవర్నడిగి యీ సంబంధం కుదిర్చారు.

నన్నడిగి నన్ను కన్నారా?

మిమ్మల్నడిగి ప్రేమించడానికి?

'ప్రేమట!.... ప్రే....మ!'

పెళ్ళట....

పెళ్ళి!

రాణీని వదిలి, రోహిణి నెత్తిమీద జీలకర్ర, బెల్లం పెడితే పెళ్ళవుతుందా?

ముళ్ళు మూడు వేస్తే మనువు కుదిరినట్టేనా?

చెప్పిస్తున్నవాడికీ, చెప్తున్నవాళ్ళకీ అర్థం తెలియని మంత్రాలు మనషుల్ని మారుస్తాయా? మాడుస్తాయి.

నూరేళ్ళ జీవితం - నూరేళ్ళ జీమూతం అవుతుంది.

ఆడనంతే.

పెళ్ళాడనంతే.

వీడను,

నా రాణీ చెయ్యి వీడను.

✪ ✪ ✪

'ఎందుకురా వాడినలా కసురుతావు? వాడేమన్నాడనీ! కుర్రతనం కొద్దీ ఎవర్నో ప్రేమించానన్నాడు తప్ప నువ్వు కుదిర్చిన పిల్లను పెళ్ళాడనన్నాడా?'

అమ్మో, మావయ్యా!

ఎంత జాలి నా పైన.

ఏమి చేతు నికపైన.

'చుక్కలసాక్షిగా, ఈ పచ్చిక తోడుగా, పండు వెన్నెల ఆనగా చెప్తున్నాను. రాణీ నీవే నేను. నేనే నీవు. నీ కోసం తొలిజన్మలో పురూరవుడినై, మరుజన్మలో రోమియోనై, ఆ పిమ్మట మజ్నూనై....'

నవ్వకు, నవ్వకు రాణీ.

నవ్వుల కత్తుల్ని నాపై రువ్వకు.

కలకంఠ అమ్మ కంట కన్నీరొలికింది.

ప్రళయకాల రుద్రుదు నాన్న... నిరలాగ్ని రగిలింది.

కరుణతో మావయ్య నా మెడకి పూల ఉరితాడు బిగించాడు.

అందుకని

ఎద శిలచేసుకొని, వచ్చే జన్మవరకూ నీకోసం...

'మౌనం అర్ధాంగీకారం. ఏం బావా!

'ఊఁ తీసుకురావే నిశ్చయతాంబూలాలు.'

✪ ✪ ✪

'బావా!'

దిక్కుమాలిన జీవితం నీది.

నా జీవితమూ అలాగే చేద్దామని చూస్తావనుకోలేదు.

శుభలేఖలకి పసుపుబొట్లు పెడుతుంటే అమ్మ, నాన్న కవర్లమీద ఎడ్రస్‌లు రాస్తూ – ఎంత గునిసాదు గుంట వెధవ. ప్రేమ, ప్రేమాని. రాణీట. వీడితోటే ఎమ్మెస్సీ చదువుతోంది. ప్రేమించుకున్నారట. దాన్నే పెళ్ళాడాలని. వాడి నాయన ఒక్క కసురు కసిరేసరికి అంతా గుప్‌చుప్' అన్నారు. అంతేకాదు, 'నువ్వూ కన్నావో కూతుర్ని ఎతి అంటే పెతి అంటూ' అని కూడా అమ్మని ఎద్దేవా చేస్తుంటే– నేను తలుపు చాటు నుంచి గదిలోకొచ్చి, నిక్కచ్చిగా చెప్పేసాను–నిన్ను పెళ్ళాడనుగాక పెళ్ళాడనని. చాలా గొడవైనా ఆఖరికి నా మాటే ఒప్పుకున్నారు.

బావా! ఏం అనుకోకు. నిన్ను పెళ్ళాడలేను.

ఎందుకంటే

నీ మనసంతా పరాధీనమై వుండగా, నాతో సుఖంగా కాపురం చెయ్యలేవు.

ఒకవేళ అంతా మరిచిపోయి నన్ను సుఖపెట్టి నువ్వు సుఖపడగలవన్న భావం నీకుంటే – నీలాటివాడిని ఈ జన్మకి నమ్మలేను. నమ్మి తాళి కట్టించుకోలేను.

అందుకని –

ఎవరో ఆ రాణీ దగ్గరకే వెళ్ళి, క్షమాపణ చెప్పుకుని తప్పుదిద్దుకో. ధైర్యంగా నిలబడి ఆమెనే పెళ్ళాడు."

'చదివావు కదా ఉత్తరం. రోహిణి మొదట్నుంచీ అంతే రాణీ! అన్ని అడ్డంకులూ తీరిపోయినట్టే. రోహిణి ఎదురు తిరిగి నన్ను పెళ్లాడనడంతో, మా నాన్న అవమానం పొందినట్టు ఫీలై' ఈ ముహూర్తానికే నాకు పెళ్ళి చేసేయ్యాలని పట్టుదలగా వున్నారు. ఆయనే నీతో మాట్లాడి రమ్మని నన్ను పంపారు. అన్ని విషయాలు మాట్లాడుకునేందుకు మీ అమ్మనీ

నాన్ననీ ఒకసారి మా ఇంటికి వెళ్ళమని ఉత్తరం రాయి. ఇలా మన ప్రేమ సుఖాంత మవుతుందనుకోలేదు. నిజంగా రోహిణికి మనం కృతజ్ఞులంగా వుండాలి."

'నిజం చెప్పారు. రోహిణికి మనం కృతజ్ఞులంగా వుండాలి. ముఖ్యంగా నేను. పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా అంతరాత్మను మార్చేసుకునే వాళ్ళతో నేను జీవితం గడపకుండా కాపాడింది.

సర్దుకుపోవడమంత దుర్గుణం మరొకటి నాక్కనబడదు. అంతా అన్నిటికి సర్దుకుపోయివుంటే సృష్టి ఈనాడిలా వుండేది కాదేమో కూడా!

గాలికివాలుగా తెరచాప మార్చని వాడెవడయినా తారసపడితే, ఆనాడే పెళ్ళి చేసుకుంటాను. మా అమ్మ నాన్న మీ ఇంటికి రారు. ఆ ముహూర్తానికే మరో సంబంధం కుదుర్చుకోండి.'

మూర్తికి క్షణం జరిగినదంతా కలకాదు కదా అన్న అనుమానం వచ్చింది. కాదన్నట్టుగా, ఇసుకలో రాణీ అడుగుజాడలు కనబడ్డాయి. ఎదురుగా అలలు లేస్తూ పడుతూ వుంది సముద్రం.

ఎన్నిసార్లు ఒడ్డుని ఢీకొని పతనమైనా, అలలు ఎదురుతిరుగుతూనే వున్నాయి. 'సర్దుకుపోవు కాబోలు' అనుకున్నాడు మూర్తి, ఇంక అక్కడ వుండలేక విసవిసా అడుగులేస్తూ పోతూ.

- ఆంధ్ర సచిత్రవారపత్రిక,

**25.8.1972**

# ఇఫ్ వెల్త్ ఈజ్ లాస్ట్....

"దా నాయనా! దా! అలా కూర్చో," మెట్లెక్కి వరండామీద కాలు మోపుతున్న గురుమూర్తిని పలకరించి బెంచీవైపు చూపించింది.

తులసమ్మ గొంతులోని వ్యంగ్యం తెలియకపోలేదు గురుమూర్తికి. తెలిసినా పట్టించుకోలేని స్థితిలో ఉన్నాడు. వరండాలోని బెంచీమీద కూర్చోకుండానే అడిగాడు. "పరమేశ్వరావు గారు..."

"ఉన్నారు, నాయనా, జపం చేసుకుంటున్నారు. నీకు తెలుసు కదా-పిల్లల్లేరని వారికొకటే దిగులు. ఆ దిగులు మరిచి పోవడానికే జపాలూ అవీ మొదలెట్టారు." అంటూ సాభిప్రాయంగా చూసింది గురుమూర్తి వేపు. 'అవు' నన్నట్టు తల ఆడించాడు.

గురుమూర్తి ఏమీ మాట్లాడకపోవడం ఆవిడ అహాన్ని దెబ్బతీసింది. "మొన్నటితో ఈ వ్యవహారమింక తెమిలేది కాదనుకున్నాను. అలాంటిది ఏమిటి పెందరాళే వచ్చావు" అంటూ సమాధానమాశించకుండా తులసమ్మ పూలసజ్జతో లోనికి వెళ్లింది.

గురుమూర్తి బెంచీమీద కూర్చుని, గోడకి చేరబడి వీధిలోకి చూశాడు.

అవును. తెల్లవారి ఎంతసేపో కాలేదు. ఇంకా ఆకాశం తూర్పు చివర నిండా ఎర్రబారనే లేదు. వీధిలోని విద్యుద్దీపాలు ఆరనేలేదు. ఆవులనూ, గేదెలనూ తోలుకొచ్చి ఇళ్ల దగ్గరే పాలు పితికి వాడుకగా పోసే పాలవాళ్లు ఇళ్లకు మళ్లనే లేదు.

కాని, ఏడుగంటలకి ఒళ్లు విరుచుకుని, బద్ధకంగా లేవడానికిగానీ, రాత్రి సంతోషాన్ని నెమరు వేసుకుంటూ, మగతగా, మత్తుగా కళ్లు మూసుకుని, తెల్లారినా పడుకోవడానికిగాని, సావకాశంగా లేచి, నిమ్మళంగా దేవతార్చనాది క్రియలు నిర్వర్తించుకోవడానికిగాని నోచని గురుమూర్తి నిద్రలేచి చాలా సేపయింది.

రాత్రి గురుమూర్తికి నిద్ర పట్టిందే కొంచెం సేపు.

రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు- మసిబారిన బుడ్డిదీపం వెలుతురులో మట్టిగోడల

మీద వికృతంగా పడుతున్న నీడల్ని చూస్తూ, ఆ నీడలకి హేతువైన తన సంతానం ముగ్గురమ్మాయిలూ, ఇద్దరబ్బాయిల్ని చూస్తూ. ఆ సంతానోత్పత్తికి కారణమైన తన అర్ధాంగి పొడుచుకొస్తున్న ఎముకల మీది పలుచని చర్మాన్ని చూస్తూ. సృష్టి కార్యానికి ఒకనాడు తనను ప్రేరేపించిన, ఒకనాటి ఆమె సోయగాలను తలపోస్తూ.

గురుమూర్తి పెళ్లికి వచ్చిన కవి స్నేహితుడొకడు 'జీవితంలో చిక్కి సగమవుతున్న మధురక్షణాన....” అంటూ రాసి ఓ పుస్తకం చదివించాడు బహుమతిగా.

జీవితంలో చిక్కి సగమై, ఆమెను అర్ధాంగిగా స్వీకరించడం మధురంగానే తోచింది నాడు. కానీ, తన లాటివాడు పెళ్లాడడమంటే జీవిత గ్రహణంలో చిక్కి, సంసారపు శకటాన్ని లాగలేక, సగం కాదు, శల్యమై పోవడమేనని తెలియలేదు నాడు.

“ఏమిటండీ నిద్రపోకుండా!” నీరసంగా అడిగింది, పీక్కుపోయిన ముఖంలో, లోతుకుపోయిన కన్నుల మీది రెప్పలను బలవంతాన కదిలించి భర్తవేపు చూస్తూ వనజాక్షి. మాజీ తామరసదళనయన.

తలకింద చేతులు పెట్టుకుని, చాపమీద వెల్లకిలా పడుకుని గోడలనీ, నీడలనీ, ఇంటి పై కమ్మల కప్పునీ చూస్తున్న గురుమూర్తి కళ్లు తిప్పాడు భార్యవైపు.

ఏం చెపుతాడు? ఏమాలోచిస్తున్నానని చెపుతాడు!

లోకమంటే తెలియక, శోకమంటే ఎరగక, నోట్లో వేలు పెట్టుకుని 'ఉంగా, ఉంగా' అనుకుంటూ, బంగురుకుంటూ ఎప్పుడో ఆనందమని తెలియని రోజుల్లో బహుశా అనుభవించిన ఆ సంతోష స్థితి తలుచుకుంటున్నాననా!

అలా అర్ధాంతరంగా, తన కాలేజీ చదువు మధ్యలో ఉండగానే, అప్పులకి సరిపడ్డ ఆస్తినయినా మిగల్చకుండానే తండ్రి తనువు చాలిస్తాడని తెలియక, ఏయే రంగారు బంగారు కలలు కన్నాడో అవి గుర్తు చేసుకుంటున్నాననా!

తొలి రాత్రి ఒప్పులకుప్పయై, ఒయ్యారాల ప్రోవై, పూల వాలుజడ గుండెల మీదుగా వ్రేలాడుతుండగా, తామరతూడుల్లాటి వేళ్లతో, ఆకాశపు కొనల్నిలా నీలిరంగు పట్టుచీర అంచుల్ని మెలి పెడుతూ, సిగ్గు దించుకోమని, కోర్కె కనులెత్తి చూడమని చెబుతుంటే, మొలకనవ్వుల ముఖాన్ని వంచినట్టే ఉంచి, తనవేపు చూస్తూ, వనజాక్షి మార శరాన్ని సంధించి విడిచిన సన్నివేశాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాననా!

ఏం చెపుతాడు? ఏ మాలోచిస్తున్నానని చెపుతాడు?

గురుమూర్తి ఏమీ చెప్పలేదు. నోరు విప్పలేదు.

భారత్ స్టీల్ కార్పొరేషన్‌లో గుమాస్తా ఉద్యోగం వచ్చిందని పొందిన ఆనందాన్ని, ఆ ఆనందం రోజుకి పది, పన్నెండు గంటలు పనిచేయవలసి రావడంతో తరిగిపోవడాన్ని,

పిల్లా, పాపా పుట్టి, పెరుగుతున్నా ధరలు జీవనావసరాల్ని గగన కుసుమాలుగా చేస్తున్నా, నగరంలోని అన్ని పరిశ్రమలలోనూ 'ఎంతో కొంత' జీతం పెంచబడుతున్నా, తమ జీతం నెలకి నూట ఇరవై రూపాయలుగానే మిగిలిందని ఉక్రోషంకాక 'కడుపుమంట' హెచ్చి, యాజమాన్యాన్ని 'ఇదేమని' నిలదీసినందుకు ఉద్యోగం ఊడడాన్నీ - అన్నిటినీ తన జీవిత గరళాన్ని ఒక్కొక్క చుక్కా నెమరు వేసుకుంటున్నానని, గురుమూర్తి భార్యతో చెప్పలేదు.

చిరిగిన చొక్కాతో, చెప్పుల్లేని కాళ్లతో, తీరని ఆకలితో 'తను' ఎవరెస్ట్ శిఖరాన్ని ఆక్సిజన్ సంచీ లేకుండా ఎక్కడంకంటే ఎక్కువ కష్టంతో, ఆసీలుమెట్ట దగ్గర నుంచీ ఆంధ్ర యూనివర్సిటీ బస్ ఎక్కి, చక్రవర్తిగారింటికి, వారి అమ్మాయిలకి చదువు చెప్పడానికి వెళితే - చక్రవర్తిగారు సోఫాలో చేరగిలబడి, టీపాయ్ మీదకి చాపిన కాళ్లు ఆడిస్తూ, ముందుకు వంగకుండానే బుల్‌డాగ్‌కి ఆప్యాయంగా బిస్కట్స్ అందిస్తూ, 'గురుమూర్తీ, ఈ ఫస్టు నుంచీ ఆంగ్లో ఇండియన్ టీచర్ వస్తుంది సుమకీ, రేఖకీ ట్యూషన్ చెప్పడానికి. ఈ నాల్రోజులూ ఇంగ్లీషు బాగా చెప్పు" అన్నారనీ, అక్కడనుంచీ మళ్లీ రెండు మైళ్లు నడుచుకుంటూ సరస్వతీ టాకీస్ దగ్గర మందులషాపు నాయుడిగారింటికి వెడుతూంటే, తోవలో కళ్లు తిరిగి తూలిపోయాననీ, మునిసిపాలిటీ కొళాయి తన కడుపు నింపి, కొంచెం ప్రాణప్రతిష్ఠ చేసిందనీ, అయినా, ఆలస్యమైనందుకు నాయుడుగారి సతీమణి చేత చీవాట్లు తప్పలేదనీ, "వనజా! నాకు భయంగా ఉంది. చీకటి వెల్లువలో కొట్టుకుపోతున్న మనకి ఏ వెలుతురు గడ్డిపోచా దొరకదు. నన్ను నీ గుండెల్లో పొదువుకో. ఇద్దరం వేడుకొందాం. ఏడుకొండలవాడిని. ఏమీ వద్దు మాకు. ఏ వరమూ అడగం నిన్ను. నాకూ, నా పెళ్లానికీ, నా పిల్లలకీ కాస్త నిద్ర పట్టేట్టు చేసి, మళ్లీ కళ్లు తెరవక, నిద్రలోనే ఒక్కసారే ఆఖరు ఊపిరి పీల్చేట్టుగా చెయ్యి తండ్రీ - అని కోరుకుందా"మనీ చెప్పడానికి గురుమూర్తి నోరు విప్పలేకపోయాడు.

"ఊరికే దిగులు పడకండి. యాజులన్నయ్య చెప్పిన పనే చేద్దాం. మన గురించి ఆలోచించి నేనిలా చెప్పడం లేదు. మన పిల్లల్లో ఏ ఒక్కరికైనా కడుపునిండా తిండి దొరకనుంటే అపడం పాపమేనన్న భావంతో చెబుతున్నాను. పన్నెండు వందలు కాకపోతే, పరమేశ్వ ్రావుగారిస్తానన్న వెయ్యి రూపాయలకే ఒప్పుకోండి. ఉదయాన్నే వెళ్లి సంగతి వారికి చెప్పి, వందో. రెండు వందలో ముందు తీసుకురండి. కడసారైనా మురళికి కొత్త నిక్కరు, చొక్కా తొడిగి, ఇంత అన్నం పెట్టి ఆనందిద్దాం" అందామనుకుంది వనజాక్షి.

నరాలు తేలిన చెయ్యి మాత్రం గురుమూర్తి గుండెమీద వేసింది వనజాక్షి.

ఆ క్షణాన్నే యముడంటే భయం లేని గురుమూర్తికి అప్పులవాళ్లు గుర్తుకొచ్చి భయం వేసింది. చావంటే వెరవని వాడిని బ్రతుకు జడిపిస్తుంటే, మంచులాటి భార్య అరచేతిని మండుతున్న గుండెమీద, తన చేతితో ఆనించి ఉంచి, కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

"రాత్రి సరిగా నిద్ర లేనట్టుంది" అంటున్న మాటలతో కళ్లు విప్పి చూసాడు గురుమూర్తి. ఎర్రని కళ్లు మంటలు పెడుతున్నాయి.

నిమ్మపండు చాయ మేనిమీద ఎర్రని పీతాంబరం కాంతులీనుతుంటే, వెంట్రుకలు లేని, పసుపు కలిపిన దంతపుఛాతీ మీద రుద్రాక్షమాల కదులుతుంటే, ధాదాపు ఆరడగుల భారీ దేహంతో ఎదురుగా నిలుచున్న రిటైర్డ్ స్కూల్ల ఇన్స్పెక్టర్ పరమేశ్వర్రావుని చూసి దిగ్గున బెంచీమీద నుంచి లేచి, నిలుచుని, 'నమస్కారం, సార్' అన్నాడు గురుమూర్తి.

"కూర్చోవోయ్, ఫరవాలేదు. ఏమిటి సంగతి?"

"అదే సార్! యాజులుగారు చెప్పిన విషయం".

పరమేశ్వర్రావు అనబోయిన మాట అతని నోట్లోనే ఉండగా వచ్చింది తులసమ్మ.

"ఇన్ని మాటలు లేవయ్యా నీకిష్టమయితే వెయ్యి రూపాయలిస్తాం. ఏదో మా వారు మోజు పడుతున్నారనిగానీ, నా కసలు ఇష్టమే లేదు."

గురుమూర్తి తలవంచుకుని, గొంతు పెగుల్చుకుని, "మీ ఇష్టమమ్మా!" అన్నాడు.

తులసమ్మ ధుమ ధుమ లాడేటట్టుంచిన ముఖాన్ని నవ్వుకి మార్చింది. "సరే, రేపే మంచిది. పెద్ద హంగామా నాకిష్టంలేదు. కావలసిన ఏర్పాట్లు మేం చూసుకుంటాం. నువ్వేం దిగులుపడకు. ఎందుకేనా కావలసివస్తుంది – ఇంద ఈ రెండొందలూ నీ దగ్గరుంచు" అంటూ రొంటిని దోపిన నూరు రూపాయల కాగితాలు రెండు తీసి అందించింది.

అందుకుంటుంటే గురుమూర్తి చేతులు వణికాయి.

సెలవు తీసుకుని ఇంటివేపు నడక మొదలెట్టాడు.

జేబులో పచ్చ కాగితాలు కాక ఇనుపగుళ్లు ఉన్నట్టు గురుమూర్తి గుండె బరువయింది. నోట్లు రెండూ తీసి చేత్తో పట్టుకున్నాడు.

ఎన్నాళ్లయింది – ఒక్కసారి రెండు వందలు పట్టుకుని! ఎంత ఏడిపిస్తూంది – ఈ డబ్బే తన దగ్గర లేక.

ఈ డబ్బుంటే వనజ దగ్గుకి మందు కొనవచ్చు.

కడసారపు దానికి కడుపులో బల్లకి ఆపరేషన్ చేయించవచ్చు.

కడుపునిండా అన్నం తినచ్చు. చొక్కా, జోళ్లు, సౌఖ్యం, ప్రేమనీ, శీలాన్నీ – సర్వాన్నీ కొనుక్కోవచ్చు.

ప్రేమనీ, శీలాన్ని నిలుపుకోవాలన్నా డబ్బు ఉంటేనే సాధ్యమవుతుంది.

నెలకి ఈమాత్రం డబ్బయినా సంపాదించగలిగితే, ప్రతి సాయంత్రం పెద్దమ్మాయి సుశీలతో పరాచికాలాడే సైకిల్ పాలవాడిని గదమాయించవచ్చు. వాడితో తగువు తెచ్చుకుని, బాకీ తీర్చమని వాడు చేసే అల్లరైతే సహించవచ్చుగాని, ఆ నీళ్లపాలైనా లేక ఆఖరుది ఏడ్చి,

ఏడ్చి సొమ్మసిల్లిపోతే గురుమూర్తి సహించలేదు.

తన చేతిలో రూపాయల నోట్లు కాక, అల్లావుద్దీన్ అద్భుతదీపమున్నట్టు ఆ చేతివేపు భక్తిగా చూశాడు.

ఈ డబ్బు లేకపోవడమే మనిషిని మనిషిమీద స్వారీ చేయనిస్తూంది.

తమందరి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ధ్వంసం చేస్తూంది.

కొందరిచేత హత్యలూ, దోపిడీలూ, దొంగతనాలూ చేయిస్తూంది.

ఎందరెందరి చేతో 'లంజవేషాలు' వేయిస్తూంది.

మరికొందరిచేత శీలాన్ని అమ్మిస్తూంది.

తనచేత...!

గురుమూర్తికి ఆకలి గుర్తొచ్చింది. ఆలోచనలను ఆపేయడం మంచిదనిపించింది.

ఎదురుగుండా కనిపించిన హోటల్‌లో దూరాడు. ఇడ్లీ, పూరీ, ఏవేవో తిన్నాడు. కసిగా తిన్నాడు.

'పాపం, వారం రోజులై ఎవరికీ సరిగ్గా తిళ్లు లేవు. రెండు రోజుల నుంచీ నూకలజావే తిని ఉంటున్నారు. పలచటి గంజినీళ్లలో ఉప్పు వేసుకుని తాగుతున్నారు. అందరికీ టిఫిన్ పొట్లాలు కట్టించాడు'.

బిల్లు చెల్లించి, రిక్షా ఎక్కి ఇంటికి బయలుదేరాడు. ఎక్కడలేని హుషారుతో ఇంటిముందు రిక్షా దిగాడు. దిగుతూనే "వనజా!" అని అరిచాడు.

ఎదురుగా వచ్చిన వనజాక్షి మొగుడి ముఖంలో ఆనందం భూతంలా ఆవరించి ఉండడం చూసింది.

అతని చేతిలోని పొట్లాలు చూసింది.

కళ్లలో తిరగబోయిన నీళ్ల నాపుకుంది.

'రాత్రి నేనే వెళ్లమని చెపుదామనుకున్నాను' అనుకుని, తను మొగుడిమీద కోప్పడడానికి అర్హత లేనిదాన్నని నిశ్చయించుకుంది.

డగ్గుత్తికతో "పరమేశ్వర్రావుగారింటినుంచా" అంది.

గురుమూర్తి తల ఊపాడు.

వనజాక్షి ఆకుల్లో టిఫిన్ పెట్టి, పిల్లలందరినీ పిలిచింది.

ఆవురావురుమని అంతా తింటుంటే చూస్తూ గురుమూర్తి చాపమీద కూర్చున్నాడు.

ఆనందమో, దుఃఖమో తెలియదు.

తిండి తిన్న శక్తితో చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. సుశీల ఆకులు తీసి పారేసి, వింతగా తల్లివేపు చూస్తూ నిలుచుంది.

పెద్దవాడు మురళి ఇంగ్లీషు పుస్తకం తీసి చదవడం మొదలెట్టాడు - 'ఇఫ్ వెల్త్ ఈజ్ లాస్ట్...' అంటూ.

డబ్బు పోతే పోయేదేమీ లేదట. ఆరోగ్యం పాడైతే కొంత పోగొట్టుకున్నట్టట. శీలం పోతే మాత్రం సర్వం కోల్పోయినట్టేనట.

పరాగ్గా వింటున్న గురుమూర్తికి నవ్వొచ్చింది మొదట. తరువాత ఈ తప్పుడు చదువులు మప్పి పిల్లల్ని పనికిమాలిన వాళ్లుగా చేస్తున్నందుకు కోపం వచ్చింది.

'వీడు - మురళిగాడు - రేపు ఈ వేళకి పరమేశ్వర్రావుగారింట్లో ఈ పాఠమే చదువుతాడు కాబోలు' అనుకుంటుంటే అంతులేని దుఃఖమొచ్చింది.

- ఆంధ్రప్రభ వారపత్రిక, 4.4.1973

# మహాభినిష్క్రమణం

## పూర్వరంగం

"నిజమేనేమిటే పద్మా?" అనుమానంగా అడిగింది వాసంతి - చంకలో పిల్ల పాలకోసం రొమ్ము తడుముతున్నా లెక్కచెయ్యకుండా.

పద్మ మాట్లాడలేదు.

"ముంగిలా చూడు మాట్లాడదు. చేసిన పని చేసేసి" కూతురు బుగ్గలు రెండూ గిచ్చింది. శాంతమ్మకి కోపం తీరడానికి ఏం చెయ్యాలో తోచలేదు.

అప్పటికీ పద్మ మాట్లాడలేదు.

ఆకలేసిన చంటివాడు పాలకోసం ఏడుస్తున్నాడు. అయినా వాసంతి పట్టించుకోకుండా "ఇంతకీ ఎవడా మహానుభావుడు?" అని అడిగింది, కప్పిపుచ్చలేని కుతూహలంతో.

"ఆ మహానుభావుడు మాయాప్రవరుడో, విశ్వామిత్రుడో నీకెందుకుగాని, ముందు పిల్లడికి పాలుపట్టు."

అంతవరకూ పక్కగదిలో వుండి, ఆత్రుత నణచుకోలేక, ఎలా రంగంలోకి దిగాలా అని తహతహలాడుతున్న రంగనాథరావుకి పిల్లడి ఏడ్పు సాయపడింది.

అల్లుడి రాకతో శాంతమ్మ ముఖం చిన్నబోయింది.

"మధ్యన మీ గొడవేమిటి? అది కొంపలు తీసే కొరివిలా వుంది. ఇంతాచేసి, ఆ మహానుభావులు మీరే కాదు కదా!" అని విసురుగా అంటూ, అదే విసురులో పైట తొలగించి, చంటివాడికి రొమ్ము అందించింది వాసంతి.

రంగనాథరావు తన జీవితంలో విన్న జోకుల్లోకల్లా అదే పెద్ద జోకైనట్టు, ఉప్పెనగా నవ్వాడు.

శాంతమ్మ ముఖం మరీ ముడుచుకుపోయింది. బాధను మించిన అవమానంతో.

నవ్వు అణచుకుని, పద్మవంక ఒకచూపు విసిరి, 'ఏ మొగుడూ లేకపోతే అక్క మొగుడేగతి'న్నారు పెద్దలు. కాని నాబోటి వాడికంత అదృష్టం కూడానా?" అన్నాడు రంగనాథరావు.

రేణుక కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి.

శాంతమ్మ గుండెను మండించే అవమానంతో అక్కడి నుండి వెళ్ళిపోయింది - పద్మవేపు ఉరిమి ఉరిమిచూస్తూ.

పద్మ అలాగే నిల్చుంది మౌనంగా.

వాసంతి నవ్వు దాచుకోకుండానే అంది "పాడు మాటల్లూ మీరూను. పొండిక్కడ నుంచి."

"పోతానులేవే" అంటూ నిజంగానే గదిలోకి పోయాడు రంగనాథరావు - బీడీ ముట్టించుకుందుకు.

"అతని పేరు చెప్పావు కావు" అంది వాసంతి నిష్ఠూరంగా.

రేణుక కళ్ళలో నీటిస్థానే కోపం నిండింది.

ఆ కోపం మాటల రూపందాల్చి వెలికొచ్చింది.

"పెద్దక్కా నువ్వు ఆడదానివి కాదు. అసలు మనిషివి కావు. హృదయంలేని రాయివి."

"నిజమేనమ్మా రాయిని కాబట్టి కట్టుకున్నవాడే మన్మధుడని వాడితోనే వుంటూ, దేవుడిగా ఆయన్నే కొలుచుకుంటూ, పడివున్నాను. మీలాగ పెళ్ళిళ్ళు కాకుండానే" ఇంకా ఏదో అనబోయి ఆగి "ఎవరెలా చస్తే నాకేం? కాకపోతే యీ యింట జన్మయెత్తినందుకు ఈ ఘోర అవమానం ఇంత నా నెత్తిన వేసుకు బ్రతకాలి. తప్పుతుందా తల్లీ! తోడబుట్టి నందుకు" అంటూ మొగుడి గదిలోకి వెళ్ళిపోయింది.

✪ ✪ ✪

"దాని పీక పిసికి నూతిలోకి తోసి నేనూ చస్తాను" అంది శాంతమ్మ ఏడుపుకి బొంగురుపోయిన గొంతుతో.

సుబ్బరామయ్య పంచ చెంగుతో కళ్లు తుడుచుకున్నాడు. "వాడెవడో కనుక్కో. ఏ తంటాలో పడి పెళ్ళి జరిపించేద్దాం."

అన్నాడే కాని, ఏ తంటాలు పడగలడో సుబ్బరామయ్యకే తెలియలేదు.

చేస్తున్న గుమాస్తాగిరి కూడా ఏడాదిలో ముగింపుకొస్తోంది. చిల్లిగవ్వ ఆస్తిలేదు. పదేళ్ళ క్రిందట పెద్దపిల్ల వాసంతి పెళ్ళికి చేసిన అప్పులు ఇంకా తీరలేదు. ఎన్నో ఆశలు పెట్టుకుని చదివించిన కొడుకొక్కడూ పెళ్ళి చేసుకుని వేరే కాపురం పెట్టాడు. జీవితం గడవడమే దినదినగండంగా వుంది.

తంటాలు పడగలగడం నిజమే అయితే పద్మ పెళ్ళి, రేణుక పెళ్ళి ఎన్నడో చేసి వుందును. అయినా అంతకుమించి ఏం చెయ్యాలో తోచక ఆ మాట అన్నాడు సుబ్బరామయ్య.

"ఏం చేసినా అది నోరు విప్పి ఆ పేరు చెప్పడంలేదు. ఏం పిల్లలో, పెరిగి పెద్దయి

ఉద్ధరిస్తారని కంటాం. వాళ్ళేమో పరువు బుగ్గిపాలు చేస్తారు!"

"అలా అనకు శాంతా! పద్మ ఇలా చేసిందంటేనే నమ్మలేకుండా వున్నాను. దాని మనసు మెత్తనిది. ఏ అఘాయిత్యం చెయ్యకుండా చూడు."

"వయస్సు వరదలాంటిది. ఎంతవారికీ ఆ పొంగు ఆపుకోవడం సాధ్యంకాదు. జ్ఞాపకం లేదా మా నాన్న చనిపోయినప్పుడు పన్నెండు రోజులూ గడవకుండానే...."

శాంతమ్మ ముఖం జేవురించింది - చిగురించిన పాత జ్ఞాపకాలవల్ల కాదు. చెడిపోయిన కూతురితో తన కాపరాన్ని పోల్చినందుకు.

"ఏమిటండీ ఆ మాటలు. మతీ, సుతీ లేకుండా" అంది కోపంగా.

"కోపం దేనికి శాంతా! పద్మచేసిన పని తప్పుకాదు. తప్పు మనది. పరిగెత్తే గుర్రాల్లాటి కోరికలకు లోబడి పిల్లల్ని కంటాం. కన్న పిల్లలకి వయసొచ్చినపుడు, ఎన్నాళ్ళు కోరికల గుర్రాలకి కళ్ళేలు వేయగలరు? ముప్పయ్ సంవత్సరాలు పద్మకు...."

"సరే, ముందు ఏం చెయ్యడమో త్వరగా తేల్చండి.దాచినా దాగని విషయమిది."

సుబ్బరామయ్య చెయ్యగలిగింది చేశాడు. తల పట్టుకుని పాత వాలుకుర్చీలో కూలబడ్డాడు.

✪ ✪ ✪

"ఎక్కడా అనకు విమలా! కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. ఆ యింట్లో అమ్మకి తప్పించి ఎవరికీ చీమకుట్టినట్టయినా లేదీ విషయం. నీతో చెప్తే తమ్ముడికి తెలుస్తుంది కదా అని."

"అదేమిటోయ్ వాసంతీ! కొత్తగా మాట్లాడుతున్నావు. నాతో చెప్తే మీ తమ్ముడికెలా తెలుస్తుంది? పోయి మీ మరదలుకి చెప్పు."

వాసంతి నవ్వింది. "పోదూ అమ్మ పుట్టిల్లు మేనమావదగ్గరా? మరదలంటే యిప్పుడొచ్చింది కాని, నీ తోటిదేగా ప్రకాశం జీవితంలోకి వయసూ, వలపూ వచ్చింది."

విమల కూడా నవ్వింది. నవ్వుతూనే "ఎన్నాళ్ళుంటావు? నువ్వొచ్చినట్టు రెడ్డి కింకా తెలిసినట్టు లేదు. కబురంపనా?

"రెడ్డి సంగతటుంచు. ఒక్కదాన్నే రాలేదు. కూడా మావారొచ్చారు. ఇంతకీ మీ వారొస్తున్నట్టులేదే?"

"ఏం, గాలి మళ్ళిందేమిటి? మావారి మీదకి."

"ఛ. మీవారూళ్ళో లేకపోతే ప్రకాశం ఇక్కడికే విజయంచేస్తాడు కదా చెబుదామని."

"లేదులే... ఘడియకో, క్షణానికో మా వారొచ్చేస్తారుగాని, రెడ్డితో చెప్పి పద్మ కడుపు తీయించే ఏర్పాట్లుచెయ్."

"మధ్యన రెడ్డికేంబాధ?"

"బాధేమిటి? ఈ సాయంచేస్తే పద్మ అతని ఋణం వుంచుకోదని చెప్పు"

"మనం చెప్పడమేగాని వినేదెవరు? దానికే అంత వివేకముంటే, ఏ మందో మాకో, ముందే వాడి జాగ్రత్త పడును. సరే నే వెళ్తాను."

✪ ✪ ✪

ప్రకాశం వస్తూనే జువ్వలా లేచాడు.

"మన యింటా, వంటా లేదు. వీధిలోకి వెళ్ళాలంటే సిగ్గుతో తలెత్తుకోలేక ఛస్తున్నాను. ఎవడే మంటాడోనని గుమ్మం దాటి రావడం మానేయాల్సొస్తుంది" అంటూ.

"కాదు మరీ. ఫలానా వారమ్మాయి అంటారుగాని..." చేర్చాడు రంగనాథం.

"ఖర్మ. నీ వరకూ వచ్చిందీ?" అంది బుగ్గలు నొక్కుకుంటూ వాసంతి.

"ఊరంతా అనుకుంటుంటే...."

"అన్నయ్యా! ఊరంతా అంటే విమలనా అర్థం?"

అడిగింది రేణుక.

అలిగింది వాసంతి.

"విమల వరకే అనుకో – ఎలా వెళ్ళింది? నలుగురికీ తెలియబట్టేగా!"

"అక్కా! నీకే తెలియాలి విమలకెలా తెలిసిందోను" రెట్టించింది రేణుక.

"ఇవాళ కాకపోతే రేపయినా తెలుస్తుంది. ఎవరూ చెప్పనక్కరలేకుండానే తెలుస్తుంది. దాచినా దాగకుండా తెలుస్తుంది" అంటూ అర్ధాంగిని ఆదుకున్నాడు రంగనాథరావు.

తలపట్టుకు కూర్చున్నాడు సుబ్బరామయ్య.

ఇలాగైనా, ఇంట్లో కొడుకు అడుగుపెట్టినందుకు, అంత దుఃఖంలోనూ సంతోషించింది శాంతమ్మ.

"నాయనా ప్రకాశం! జరిగిందేదో జరిగిపోయింది. నీకంటే పెద్దది. నీకు అక్క. దాని పరువు బుగ్గవకుండా, మన పరువు బజారునపడకుండా చూడాల్సిన వాడివి నువ్వు."

"ఏం చెయ్యమంటావమ్మా! నే చెప్పింది మీకు నచ్చుతుందో నచ్చదో" నసిగాడు ప్రకాశం.

"చెప్పు నాయనా!" అర్థించింది తల్లి హృదయం.

ఆశ పడింది తండ్రి హృదయం.

"గేలానికి చేప చిక్కక తప్పద"ని అక్క హృదయం మురిసింది.

"ఏం యెత్తువేస్తున్నాడా వీడ"ని బావ హృదయం ఆత్రుతపడింది.

చెల్లి హృదయంలో సంశయ సంబరాలు. నిశ్చింతగా, నిర్మలంగా పద్మ హృదయం.

"రెండో నెలే కదా! ఎబార్షన్ చేయించవచ్చు. మూడోకంటి వాడికి తెలియదు. నా స్నేహితుడే - మోహనరెడ్డని - మంచి డాక్టరు. దమ్మిడీ పుచ్చుకోడు. మీరు సరేనంటే, పైన ఏవేనా డబ్బులవసరమున్నా, ఆ బాధ నే పడతాను."

"శివాలయం సందులో. పచ్చమేడలో ఉంటున్న డాక్టరే నేమిత్రా ప్రకాశం! చాలా మంచివాడని, పెద్ద డిగ్రీలున్నాయని విన్నాను" అంది వాసంతి.

అందరి ముఖాల్లోనూ కాంతి విరిసింది.

రేణుక కూడా అన్నయ్యవేపు తొలిసారిగా ఒప్పుకోలుగా చూసింది.

పద్మ ఒక్క నవ్వే నవ్వింది.

✪ ✪ ✪

## అంతరంగం

చీకటి కన్నీరు కారుస్తున్న శోకదేవతలా వుంది రాత్రి. రాత్రి చీకట్లో వేపచెట్టు కొమ్మల కరాలు చాచి విలపిస్తున్నది. విలపిస్తున్న వేపచెట్టు కొమ్మల క్రింద బాధా, దుఃఖాలతో కరడుగట్టిన హృదయంలా బండరాయి పడి వుంది. పడి వున్న బండరాతిమీద, వేపచెట్టు క్రిందన, రాత్రి నిశ్శబ్దంలో, మోకాళ్ళ చుట్టూ చేతులు పెనవేసుకూర్చున్నాను.

చవితి చంద్రుడు వెలవెలపోతున్నాడు. గుడ్డి వెన్నెలనూ మబ్బులడ్డేసాయి.

చాపమీద అటు నుంచి యిటు, యిటు నుంచి అటు, ఎంత పొర్లినా నిద్రరాలేదు.

నిశ్శబ్దంగా ఇలా నడచివచ్చి కూర్చున్నాను.

నాకీ రాత్రి నిద్ర రాదేం!

పోనీ. ఒక్క సారే నిద్రపోతాను. మళ్లీ లేవని నిద్ర. కలలు లేని, కలతలు లేని కమ్మని నిద్రపోతాను.

ఎప్పుడు పడుకున్నానో అలా.. అమ్మ పొట్టలోనో, పొత్తిళ్ళలోనో.

ఎండిపోయిన అమ్మ రొమ్ముల్ని తడివి, పాలకోసం ఏడ్చిఏడ్చి, ఎంత సేపటికో నాన్న తెచ్చిన పాలు అమ్మ పట్టగా త్రాగి, అలసి నిద్రపోయానట చిన్నప్పుడు - "మళ్లీ పద్మ లేవదా?" అని అమ్మా, నాన్నా గాభరా పడినంత గాఢంగా.

మళ్ళీ,

ముప్ఫయ్ ఏళ్ళ తర్వాత.

రెండు నెలల క్రితం.

నెలల్రప్రాయపు ఆనాటి ఆ రోజు లాగే....

నిద్రపోయాను. హాయిగా. తృప్తిగా కోరుకున్న భక్ష్యాలన్నీ నెమ్మదిగా, నిండుగా, తనివితీరా భోంచేసి త్రేన్చినట్టు.

మూతలుపడుతున్న కళ్లు బలవంతాన తెరచి, ఆఖరుసారి నా మీదకు వంగిన పెదాల క్రింద నా పెదవులు విప్పి ఆవలించి నిద్రలోకి జారిపోయాను.

సృష్టికోసం పెనుగులాడి, పెనుగులాడి సఫల మనోరథయై, అలసిన ప్రకృతి విడిచిన నిట్టూర్పులాటి నిద్ర..

"రండి. రండి. రాత్రి ఏం జరిగిందో చూడండి. లేచి రండి" అని అరుస్తున్నట్టు తొలికోడి మేలుకొలుపు పాడబోతుండగానే రెడ్డి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతూ "తలుపు వేసుకో" అన్నాడు.

నిద్రలోకి ఒరుగుతున్న నాకు "కలలు మానుకో" అన్నట్టు వినిపించింది రెడ్డిగొంతు.

బలవంతాన, పరుపుని కాక సుఖాన్ని వదులుతున్నట్టు లేచి, తలుపుదగ్గర కెళ్ళాను–

చెదరిన నా ముంగురులనీ

చెరిగిన నా తిలకాన్నీ

తొలగిన పయ్యెదనూ

తొణికిన యవ్వనాన్ని

రాలిన సిగలోని పువ్వులనూ

పూచిన పెదవులపై నవ్వులనూ..... చూస్తూ రెడ్డి తలుపుదగ్గరే ఆగి, "పురివిప్పిన నెమలిలా వున్నావు" అన్నాడు... వదులై ముడివీడి, అలలై ఒడలంతా ప్రాకిన జుత్తుని చూస్తూ.

అంటూ నవ్వాడు.

దోర మామిడిపండు దొంగిలించినట్టు.

పండుతిన్న ఆనందం కాదు. అందినందుకు, అంతకుమించి అందించుకున్నందుకు, అందించుకున్నానని అనుకుంటున్నందుకు.

నేనూ నవ్వేను. నవ్వుతూనే తలుపువేసి మళ్ళీ మంచంమీద వాలాను.

నవ్వనూ?

ఎప్పటి నుంచో చూస్తూనే వున్నాను. రెడ్డి చూపుల గాలాలను–

ముప్ఫయ్ఏళ్ళ దేహంలో అంత ఆకర్షణ వున్నందుకు ఆనందం కలుగుతుంటే–

రెడ్డే అన్న మాటేమిటి? మగవాళ్ళందరూను.

నాన్న దగ్గరకొచ్చే రిటైరైన ఆచారి మాష్టారు మొదలు....

"అక్కా! సినిమాలో జ్యోతిలక్ష్మి ఎంత బాగుందనుకున్నావు!" అంటూ సినిమా కబుర్లతో, ఏవేవో ఛోగట్టాలతో పొద్దస్తమానమూ కూడా తిరిగే పదమూడేళ్ళ శంకరం వరకూ...

అవే చూపులు.

ఆశగా, ఆబగా - అన్నం ముద్దవేపు "మాదా కబళంవాడు'. చూసేటట్టు.

ఏం వుంది కొత్తగా.

సృష్టి మొదట్నుంచీ, స్త్రీ పురుషుల శరీర నిర్మాణం అంతే. ఎత్తుపల్లాలవే. అయినా చూసిన ప్రతిసారీ, అదే తొలిసారి అలాంటి ఆకారం వున్న "జీవి"ని చూస్తున్నట్టు.

"నూతి నుంచి నీళ్ళు తేకే నువ్వు" అంటుంది అమ్మ.

నడ్డిమీద నీళ్ళబిందె పెట్టుకుని, నడచి వస్తుంటే, తుళ్ళిన నీళ్లు కుచ్చిళ్ళ నింత తడిపితే.

బెల్లంమీద ఈగలు వాలినట్టు అందరి చూపులూ తడిసిన ఆ కాస్తమేరా వాలతాయి అందుకని.

"కిటికీ దగ్గర నీకేంపనే?" అని అడుగుతుంది వీధిలోకి చూస్తూ నిల్చుంటే.

ఏం పని? పొద్దున్న లేచిన దగ్గర నుంచీ ఒకటే పని. ఇంట్లో ఆ పూట వంట వండడానికి లేనివేమిటో లెక్క చెప్పడం. తడిసిన కట్టెలతో పొయ్యి ముట్టించాలని యాతన పడడం. రాత్రి సద్దుమణిగేవరకూ ఒకటేపని.

తిండి గురించి వెతుక్కోవడం.

తిండి వండుకోవడం.

వండుకున్న తిండి తినడం!

సాయంకాలం మొక్కలకు నీళ్ళుపోస్తాను రేణుకతో కలిసి.

మొక్కలు మొగ్గలు తొడుగుతాయి.

పూలు పూస్తాయి.

పరిమళాలు వెదజల్లుతాయి.

పాపం, తుమ్మెదలు వెర్రివి. కట్నాలు కోరకుండానే, అన్ని పూవులనూ ఒక్కలాగే పలకరించి, ఫలింపచేసి వెళ్ళిపోతాయి.

ఒంగుని మొక్కలకి నీళ్ళు పోస్తుంటే మరచిపోదామనుకున్న ఒళ్ళు జ్ఞాపకమొస్తుంది. మనసులోకి రానీయరాదనుకున్న ఊహలు వస్తాయి. గాలి కలలనెన్నో తెచ్చి కలతలు రేపుతుంది.

ఎవడో చూస్తాడు - శకుంతలని దుష్యంతుడు చూసినట్లు. మహారాజులాగే వాడూ ఒప్పుకుంటాడు గాంధర్వానికి. ఒప్పుదలంతా చూపులలోనే చూపిస్తాడు. ప్రార్థనా పూర్వకంగా, కరుణించమని దేవతలను కోరినట్టు. భరతుడు రాబోతున్నాడని తెలియగానే దెయ్యాన్ని చూసి పారిపోయినట్టు పరారీ అవుతారుడు ఆ చూపులు నాలో రేపే సంచలనం అణచుకుని ఎవరికర్మాన వారే పోతారని పూరుకునే దాన్ని.

ఎన్నేళ్ళు?

ఎవరు లెక్కపెట్టారు?

కనీసం పదహారు సంవత్సరాలు.

నా కర్మమేమిటి మరీ?

జీవితంలో రెండే సుఖాలు. తినడం, సుఖించడం. తినడానికి డబ్బుండాలి. సరిపడా డబ్బులేదు. సరిపడా తిండిలేదు. సుఖించడానికి తోడుకావాలి. వెలుగునీడలలో తోడుగా నిలబడేవాడు కావాలన్నా డబ్బు కావాలి. ఆ డబ్బేలేదు.

రెండు సుఖాలూ లేక బ్రతుకు ఎవరి గురించి?

తల్లీ,తండ్రీ ముసలివాళ్ళు. చనిపోతారు.

నా శరీరాన్ని యవ్వనం వీడిపోతుంది. ముసలిదవుతుంది దేహం. చదువైనా లేని నేను నా కోసమైనా ఎలా బ్రతకగలను? అయినా చచ్చేవరకూ బ్రతకడం గురించే బ్రతకాలా?

ఏ మెప్పుకోసమని.

ఏ గొప్పకోసమని,

ఏ గడ్డయినా తిని బ్రతుకుతున్నట్టు, ఏ గడ్డి కరిచయినా సుఖం పొందితే.

తప్పేముంది?

కడుపునిండుగా వున్నవారే ఇతరుల తిండిమీదకు దండెత్తుతున్నారు.

సంసారాలు చేస్తూనే గడ్డి కరుస్తున్నారు.... ఆడా, మగా ఇద్దరూను.

ఇలాగే రాలిపోయేకన్నా...

సుఖంలేని

అనుభూతి లేని

స్పందనలేని

వేడిలేని

మోడు బ్రతుకు

ఎన్నాళ్లు బ్రతికినా ఏముంది?

"పురుష సంపర్కం ఎరగదు.... ఉత్తమురాలు" అంటారు. అన్నవాళ్ళలో ఉత్తములు కానివారెందరో!

"ఎవడు చూశాడు. ఈ కాలంలో కడుపూ కాలూ రాకుండా యిన్ని సదుపాయాలున్నాయి" అంటారు ఇంకొందరు.

"పోయింది పాపం. చచ్చినవాళ్ళ గురించి చెడు తలవకూడదు" అని తటస్థ విధానం అవలంబించుతారు మరికొందరు.

లోకం కోసం ఇలా బ్రతకాలా?
పాపానికి వెరచి యిలా గడపాలా?
లోకం కంటె నిజమైనది.
పాపం భయంకంటె బలమైనది,
అగ్నిలా దహించివేసేది
ఆకలంత తీవ్రమయినది –
కోర్కె
దాన్ని చంపుకుని ఏం ఒరిగించుకోవాలి?
అందుకే–
అవాళ....

మూడో కాన్పు కష్టమై ఆస్పత్రికి చేర్చిన అక్క వాసంతిని చూడ్డానికి అమ్మా, నాన్నా వూరెళ్ళారు.

చెల్లి రేణుక పాపపుభావన సోకని దేవకన్యలాగా నిద్రపోతున్నది.

వీధి గుమ్మంలో నిల్చున్నాను. తొలిఆట వదిలే వేళయింది. క్లబ్బునుండి టెన్నిస్‌రాకెట్టు పట్టుకుని ఆ దారే వస్తున్నాడు రెడ్డి.

చలవచేసిన తెల్లచీర కట్టుకున్నాను. నీలం బోర్డరున్న తెల్లజాకెట్టు తొడుక్కున్నాను. వాలుజడ వేసుకున్నాను. సంపెగలు పెట్టుకున్నాను.

సింగారించుకుని, శృతిచేసిన వీణలా నిల్చున్నాను–గుమ్మాన్ని ఆనుకుని.

రెడ్డి వచ్చాడు మామూలు వేళకి, మామూలు త్రోవని – మామూలుగా లోనికి చూపులు పంపుతూ.

నవ్వాను. ఆకలిచూపులతో జుర్రేస్తున్నవాడు కొంచెం వొణికాడు. రమ్మన్నట్టు తలాడించాను. గుప్పుమన్న సంపెంగల వాసనలు కోరికల్లా చుట్టుముట్టాయి.

తలుపులు వేశాను.
యవ్వనం తెర తొలిగింది.
నాలుగోరోజున వచ్చారు అమ్మా నాన్నా.
ఆ మూడు రోజులు
పూలరథంలా కాలం పరిగెత్తింది. మలిఝాము నుండి తొలికోడి లేచేవరకూ.
పూలరథానికి ముళ్లచక్రాలుంటాయని తెలియదూ? తెలిసీ జాగ్రత్తపడలేదు.
ఎందుకు జాగ్రత్తపడాలి?
సరదాకేనా అనుకోలేదు రెడ్డి నన్ను పెళ్ళాడుతాడని. సాయపడతాడని, అతని

కుటుంబం అతనికుంది.

అతనికి అందముంది. ఆరోగ్యం వుంది. తెగింపు వుంది. నాపై కోరిక వుంది.

నాకూ కోరిక వుంది. అలాటి పురుషుడిపై మక్కువ వుంది.

నిస్సారంగా, జడపదార్థంలా, జీవితం గడిపి కాలగర్భంలో కలిసిపోయేకన్నా....

ఒక్కసారి జన్మానికల్లా శివరాత్రి, మగవానికి ఆడదివ్వగల సుఖం ఇచ్చి, పురుషుడి నుంచి స్త్రీ పొందగల సుఖం పొంది, ...యిలా లింగభేదంతో, భిన్న శరీర నిర్మాణంతో సృష్టించబడ్డ ప్రయోజనం పొంది. ... పిదప ఏం చెయ్యాలో నాకు తెలుసు.

సహజవాంఛల్ని చంపుకుని, పరమపవిత్రమైన జీవితం జీవించి, పొట్టకూటికి నానా అవస్థలూపడి దిక్కులేని చావు - ఏ రోగంతోనో, ఎన్నాళ్ళో తీసుకుని - చచ్చే కన్నా....

ఇంకా నా ఆరోగ్యంతో

యవ్వన బలంతో

అమృతాస్వాదనానుభవంతో

మధురజ్ఞాపకంతో

జ్ఞాపక మాధుర్యంతో

నిశ్చింతంగా జీవితానికి మంగళంపాడేస్తాను.

నూతి గట్టుమీద కూర్చున్నాను. నూతిలో నీళ్ళు నిర్మలంగా, నిశ్చలంగా వున్నాయి.

"చచ్చిసాధించిందేముంది?" అనుకుంటారు ఎవరైనా ఆశాజీవులు.

బ్రతికి మాత్రం నే సాధించేదేమిటి? కడుపులో ప్రాణికోసం బ్రతకమంటే నవ్వొస్తుంది.

తల్లిదండ్రులున్న నా బ్రతుకే యిలా తగలడింది. తండ్రి ఎవరో చెప్పుకోలేని నా బిడ్డ బ్రతుకు ఊహించుకుంటేనే భయం కలుగుతోంది. నాలో పెరిగే జీవనాంకురాన్ని ఎంతగా ప్రేమిస్తున్నానంటే - ఈ కఠినమైన, నిర్దాక్షిణ్యమైన, ధనం సర్వస్వమైన స్వార్థపర ప్రపంచ పద్మవ్యూహంలోకి నా అభిమన్యుడిని, అభిశప్తుడిని, నిస్సహాయుడిని, బహిష్కృతుడిని ఎలా పంపించను? సింహం బోను నేనే తెరచి అందులో నా పాపనుంచనా? వద్దు. వద్దు.

కడుపు తీయించుకుని బ్రతకనా?

బ్రతికి?

అసలెలా బ్రతకను?

కోరికలు చంపుకునా? శవంలాంటి బ్రతుకు బ్రతికేకన్నా, శవంగా మారిపోవడం మంచిది కాదా?

కోరికలు తీర్చుకునా? మళ్ళీ, మళ్ళీ పుట్టబోయే ప్రాణుల్ని ఆపేస్తూ, ఆరోగ్యాన్ని, గౌరవాన్ని పోగొట్టుకుంటూ, నలుగురికీ గాలంవేస్తూ గడపనా? వద్దు వద్దు.

కడుపే రాకుండా ఆపరేషన్ చేయించుకునా?

కడుపునిండిన తర్వాత అన్ని సుఖాలూ కావాల్సొచ్చినట్టే, తీరిన కోరిక సహజపరిణామాలకి తోవచూపదా?

తల్లి నవ్వాలని, రొమ్మున పాపనదిమి స్తన్యమియ్యాలని, నా బాబుకి బంగారు భావి రూపొందించాలని.

కాని, ఆ తెరవే లేనప్పుడు, బ్రతుక్కి ప్రయోజనమే లేనపుడు నేను సైతం ప్రపంచాగ్నిలో సమిధనై ఆహుతవ్వడం మంచిది కాదా?

సమాజానికి సేవచేస్తూ, సంస్కరిస్తూ బ్రతకడానికి నేను తగను, ఊటలో నీరులా ఆదర్శం హృదయంలోనుంచి ఉబికి రావాలి.

అయినా ఎందరు మహానుభావులు, సంస్కర్తలు, విప్లవ వీరులు అవతరించారీ భూమ్మీద - ఆయా కాలాల్లో, ఆయా దేశాల్లో. మనిషి మనుగడ మారిందా?

మార్చిందేమో. మార్పు నా దాకా రాలేదేమో. నేనే మారాలో!

లేక అందనిదేమో మానవుని ఆదర్శం. యుగాలుగా ఎగురుతున్న కెరటాలు చందమామ నందుకోలేనట్టు, మనిషి కాంక్షించే స్వర్గం అందదేమో!

చెప్పాను గదూ! ఈ ఆలోచనలకి నే తగను.

తగినవారు, నాలాంటి నిర్ణయానికి రాకుండా ఎదిరించండి.

నేను మాత్రం..

ఇలాగే పోతాను.

కాలిక్రింద చీమనలిగినట్టు

నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాను -

తృప్తిగానూ...

నే దూకగానే నూతిలో కెరటాలు రేగుతాయి, కొంతసేపే. అంతలోనే అన్నీ సర్దుకుంటాయి.

ఈ ప్రపంచం యిలాగే సాగుతుంది.

మీ నీతే అమలుజరుగుతుంది.

- ఆంధ్రజ్యోతి వారపత్రిక, **25.1.1974**

**ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం నుండి కూడా ప్రసారమైంది.**

# దిగులు

'పొద్దువాన కురుస్తూనే వుంది పొద్దుట్నుంచీ.'

వాన పాడుగా వుందా?

లేదు.

ఎఱ్ఱగా కాసినా ఎండ, ఎయిర్ కండిషన్డు రూమ్‌లోంచి చూస్తే, మనోహరంగానే వుంటుంది.

భోరున కురుస్తున్న వాన, వెచ్చగా వూలు స్వెట్టర్ వేసుకుని, చక్కగా గదిలో కూచుని, హాయైన పుస్తకం హాయిహాయిగా చదువుకుంటూ, ఒక్కో గుక్కా కాఫీ తాగుతుంటే, మధురంగానే వుంటుంది.

ప్రియురాలి పరిష్వంగ స్వర్గంలోంచో, ప్రియమైన పానీయపు మత్తులోంచో, కొంచెం తేరుకుని, కిటికీలోంచి చూసినా, ఆకాశానికీ, భూమికీ సంధానం చేస్తున్నట్టున్న వాన, చూడ చక్కగానే వుంటుంది.

డ్రిల్లుచేస్తున్న సర్కస్ ఏనుగుల్లా, మబ్బులన్నీ గుంపులు గుంపులుగా గుమిగూడి, రింగ్‌మాస్టర్ కమ్చీ విసురులు మెరుపుల్లా మెరుస్తుంటే, ఒకే శృతిలో మ్రోగుతున్న వాయిద్యంలా, ఒకే గతిలో సాగుతున్న పద్యాల్లా, వాన సుందరంగానే కురుస్తోంది.

అయినా కావమ్మకది పాడు వానగానే వుంది.

దిక్కుమాలినదాని ఏడుపులా, వాన చప్పుడు వినిపిస్తూ మరింత చికాగ్గా వుంది.

'వెధవ వాన!' అని విసుక్కుంది.

'వెధవ జీవితం' అను సణుక్కుంది.

'ఏమే, ఇంకనైనా తిండికి లేస్తావా?' అని వానలోకి చూస్తూ అరుగుమీద కూచున్న కూతురు వనజని కసురుకుంది.

వానలోకి చూస్తూనే 'ఆకల్లేదే' అంది వనజ.

ఆ గొంతులోని దైన్యానికి కావమ్మ విస్తుపోయి వూరుకుంది.

'ఏమ'ని అడగబోయిన తండ్రి గొంతును దగ్గుతెర అడ్డుకుంది.

"నీకిష్టమని కాకరకాయ వేపుడు చేసిందే. లేచి రెండు ముద్దలు తిను' అంది సరస్వతి.

'వద్దే అక్కా ఆకలేస్తే నే తిన్నా?' అంది వనజ – సరస్వతి వేపు మొహం తిప్పి,

ఒక్కో మాట ప్రయత్నం మీద పలుకుతూ.

సరస్వతి నిట్టూర్చి వూరుకుంది. 'అమ్మా! జడ వెయ్యవూ' అంటూ వచ్చిన కూతురుని 'పన్ని తీసుకురా!' అని పురమాయించింది.

వనజ మళ్లీ వానలోకి చూపు సారించింది.

నీలి ఆకాశంలో రోడ్‌రోలర్‌లా కదిలే నల్లని మబ్బులు కనబడకుండా, ఎదురింటి పచ్చని మేడ అడ్డుకుంటున్నది.

చాచి లెంపకాయ కొడుతున్నట్టు, వాలుగా, బలంగా భూమిని తాకుతున్న వర్షపు ధారలని చూస్తూ కూర్చుంది వనజ.

ఆ చినుకులన్నీ చేతులై, నేలే తన ముఖమై, ఎవరో తన్నే కొడుతున్నట్టుంది వనజకి.

ఆలుక్కుపోయిన చూపులకి ఏవీ కనబడడం మానేసింది. కళ్లు మూసి తెరిచింది మళ్ళీ.

కాలువలోని నీళ్ళు వడివడిగా పారుతున్నాయి, నల్లగా బొద్దుగా పెరిగి, పరుగులు తీస్తున్న పాముల్లా మెరుస్తూ.

మంచం అంచు నుంచీ వేలకు తగుల్తూ, వ్రేలాడే దువ్వని కురుల్లా, రోడ్డుమీద నీరు కాలువలోకి జారుతోంది.

కూర్చునే కుచ్చిళ్ళు సర్దుకుంది వనజ. తలతిప్పి గదిలోకి చూపుసారించింది.

అమ్మ ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు గొణుక్కొంటోంది.

తండ్రి పాతకాలపు పడక కుర్చీలో కాళ్లు ముడుచుకు కూర్చుని, ప్రక్కవాళ్ళనడిగి తెచ్చిన నిన్నటి పేపరు చదువుకుంటున్నాడు.

అక్క వరానికి జడేస్తూంది.

తమ్ముళ్ళిద్దరూ తగువులాడుకుంటున్నారు.

"పిన్నీ పడవచెయ్యవా?" అంటూ బాబిగాడు చిత్తుకాగితాన్ని పట్టుకొచ్చాడు.

మాటాడక, ముఖాన్ని వీధివేపు తిప్పేసుకుంది మళ్ళీ.

వాన. వాన. వాన.

ఏ పసిడి నేలనో పండించాల్సిన, ఏ చెరువు కడుపునో నింపించాల్సిన వాన.

తొలకరియై కురిసి, ఏ ఆల్చిప్పలోనో ముత్యాల గ్రుడ్లు పెట్టాల్సిన వాన.

వృధాగా రహదారిమీద, సందుల్లోనూ కురిసి, కుళ్లు కాలువలో కలుస్తూ.

వనజకి 'యిరిటేటింగ్'గా ఉంది.

'అమ్మ నోరు నొక్కేసి, నాన్న చేతిలో పేపరు ఊడలాక్కుని, వరం జుత్తుని దువ్వుతున్న పన్నిని విరిచేసి, ఇద్దరు తముళ్ళనీ రెండు మొట్టి, కాగితంతో సహా బాబిగాణ్ణి వానలోకి

గిరవాటేస్తే బాగుణ్ణు' అనుకుంది.

పరిగెత్తి వీధిలో నిల్చుని, చేతులుచాచి, ముఖం పైకెత్తి, వాలుగా, బలంగా చినుకులు చేత లెంపకాయలు తినాలనిపించింది వనజకి.

పొంగిన గుండెలమీద వాడిగా, సూదుల్లా గుచ్చుకుని చినుకులు.

పాయలుగా, స్తనాల మధ్య నుంచీ, వాననీరు పారి...

కొరడా పుచ్చుకుని ఎవరయినా కొడితే బావుణ్ణు. తొడపాశమివ్వాలి.

చిన్నప్పుడు, గాడిద గుడ్లే పెడుతుందనుకునే, పిలుస్తే దేవుడు పలుకుతాడనుకునే, తాటాకు బొమ్మే తన కూతురనుకునే అమాయకపు, ఆనందపు, అపురూపపు, ఆ ప్రాయంలో ఎక్కాలు వప్పచెప్పలేదని ఆచారి మాష్టారు, ఎర్రగా కందేలా, నున్నని, తెల్లని లేత మొవ్వలాటి తొడగిచ్చేవాడు.

నొప్పి.

నొప్పిలోని ఆనందం తెలిసిందిప్పుడే. అప్పుడు నొప్పే తెలిసింది. కళ్ళలో నీళ్ళే తిరిగేయి.

యెస్సెల్సీ తర్వాత, నాన్న చదివించలేనని నిక్కచ్చిగా చెప్పేసినప్పుడు, చక్కగా తయారై, పుస్తకాల దొంతర గుండెలకు హత్తుకుని, పచ్చమేడ సుందరి కాలేజీకి వెల్తుంటే – గుండెలో కలిగింది నొప్పే. కళ్ళలో తిరిగేయి నీళ్ళే.

ముఖాన బొట్టు చెరిపేసుకుని, చేతుల గాజులు తీయించేసుకుని, తెల్ల చీర కట్టుకుని (యింకెన్నడూ మల్లెపూలు పెట్టుకోలేని) సరస్వతక్క బాబిగాణ్ణి చంకనెత్తుకుని, వరం చేయిపట్టుకు నడిపించుకుంటూ వచ్చి, గుమ్మంలో కాలు పెట్టినప్పుడు, బాధతో గింజుకున్నది గుండె. నీళ్ళతో నిండేయి కళ్ళు.

ఉదయాన్నే పన్లోకి వెళ్ళిన అన్నయ్య, ఫ్యాక్టరీలో ప్రమాదానికి లోనై, శవంగా యింటికి తిరిగొచ్చినపుడూ, నాన్న ఉద్యోగ విరమణ చేయాల్సొచ్చినపుడూ, తిండిలేని ఎన్ని రోజులో బాబిగాడు, వరం, అక్కచేత తన్నులు తిన్నప్పుడూ వచ్చినవి కన్నీళ్ళే. రెచ్చినది నొప్పే.

తొలిసారి జీతం తీసుకొచ్చి తండ్రికిచ్చిన సాయంత్రం "ఇంక దాని బ్రతుకింతే. మనల్ని పోషించడంతోనే దాని వయసు మళ్ళిపోతుంది" అని నిట్టూరుస్తూ, నాన్నతో అమ్మ అంటున్న మాటల్ని వింటున్నప్పుడు గుండెలు బరువెక్కేయి. కళ్ళలో నీళ్ళు చేరాయి.

నొప్పిలోని బాధేకాక, నొప్పిలోని ఆనందం తెలిసిందిప్పుడే.

వాన చేతులతో, ఆకాశం, భూమిని తమిగా తడుముతున్నది. స్పర్శలోని ఆనందానికి రెచ్చి, తీవ్రమై, వేగవంతమై "దబ్, దబ్"న కురుస్తోంది వాన.

పులకించిన పుడమి రేపో, మాపో, పచ్చికను ప్రసవిస్తుంది. జీవనం అంకురమై,

నేలను చీల్చి, మొలకెత్తుతుంది.

కాని రోడ్డుమీద కురిసిన ఎంత వానా ఏమవుతుంది? నిష్ఫలమై, దొర్లిదొర్లి ఏ మురికి కాలువలోనో కలుస్తుంది.

తన జీవితమూ అంతే. అంతంవరకూ అంతే అయి వుండేది.

కాని నిన్న మధ్యాహ్నం.

ఇంకా హరి చేతులు శరీరాన్ని నిమురుతున్నట్టయి, గుండెలమీద చేతులు కట్టుకు కూర్చుంది వనజ. అంతా కాదు కదా కల.

నిన్న మధ్యాహ్నం.

వేసవి ఎండకు వేడెక్కిన మధ్యాహ్నం నిట్టూర్పుల సెగలు కక్కుతుంటే-

మంత్రి సత్తముడి మరణానికి సంతాప సూచకంగా మధ్యాహ్నం సెలవిస్తే-

ఉస్సురంటూ ఇంటికొచ్చి, ఊసుపోక, నిద్రరాక, సుందరి వుందేమోనని పచ్చమేడకి వెళ్తే -

వెళ్లింది తనే. నిన్ననే. మధ్యాహ్నమే. కలకాదేమో!

తలుపులు తీసాడు హరి.

పచ్చని శరీరంమీద తెల్లని పైజమా వుంది. బనీనుగాని, చొక్కాగాని లేని ఛాతీ మధ్యన అక్కడక్కడ నల్లని వెంట్రుకలు. భుజాన నీలం టర్కీ టవలుంది.

"సుందరి వుందా?" అని అడిగింది.

వుందనలేదు. లేదనలేదు. హరి ఏమీ అనలేదు.

"సుందరీ" అంటూ, అలవాటు చొప్పున పరిగెట్టినట్లు మెట్లెక్కి, సుంధరి గదిలోకి వెళ్ళింది.

గది చల్లగా వుంది. వరండాలోని, అప్పుడే తడిపిన వట్టి వేళ్ళలోంచి మధురమైన వాసనతో బాటు, గదిలోకి చల్లదనం వస్తోంది. కాళ్ళ క్రింద కార్పెటు లేత ఎరుపులో మెత్తగా వుంది. గది గోడలకి లేత నీలంరంగు పూత వుంది.

టేబిల్ మీద రేడియో, అలారం గడియారం. గోడని స్నానం చేస్తున్న ఆడదాని కేలండర్.

అన్నిటితో గది ఎప్పటిలానే వుంది.

అయితే టేబిల్ముందు కుర్చీలో కూర్చునిగాని, రోజ్ వుడ్ మంచంమీది యు-ఫోమ్ పరువుపై పడుకునిగాని సుందరి లేదు.

"సుందరి ఉందా?" అంటే మాట్లాడ్డేం హరి!" అనుకుంది. అప్పుడు గుర్తొచ్చింది హరి ఎందుకు మాట్లాడలేదో.

ఎప్పుడూ లేనిది, పాదాలతో ప్రారంభించి, నొసట కుంకమ వరకూ ప్రాకిన హరి చూపులు, కొంచెం క్రిందకు వాలి, తన ఎత్తుగుండెలమీద నిలచిపోయి, గొంతు గుటకపడగా, హరి మాట్లాడలేకపోయాడు.

వడిగా కొట్టుకున్నాయి గుండెలు.

నవ్వుతో విచ్చుకున్నాయి పెదవులు.

తన భ్రమ. హరి! తనకన్నా ఎనిమిదేళ్ళు చిన్నవాడు.

వెనక్కి తిరగబోయింది, సుందరి లేదని నిర్ధారించుకుని

అప్పుడు గది ఎప్పటిలానే వుందా?

తను గదిలో కాలు పెట్టినప్పటికే, ఎప్పటిలాగా గది లేదని, స్నానం చేస్తున్న ఆడదాని కేలండర్ క్రింద, టేబిల్‌మీద, రేడియో ప్రక్కనున్న అలారం గడియారం ఎదురుగా, రంగుల బొమ్మలతో, ఎన్నడూ చూడని తెరచిన పుస్తకమొకటున్నదని, అటువేపు యధాలాపంగా చూపిన వనజకి తెలిసింది.

దూరంగా కనబడుతున్న బొమ్మలో, నగ్నంగా, అతుక్కుపోయిన ఆడా, మగా ఇద్దరు, స్పష్టాస్పష్టంగా ఆనుతున్నారు.

కుతూహలం హెచ్చి, టేబిల్‌కి తొడలాన్చి నిల్చుని, బొమ్మకేసి పరీక్షగా చూసింది. తొలుత అసహ్యం వేసింది.

అయినా చేతి వేళ్ళు పేజీలు తిప్పుతూ, ఆత్రంగా, శ్రద్ధగా, దీక్షగా, ఒక్కో బొమ్మనీ కళ్లు విప్పార్చుకు, గుండెల చప్పుడు హెచ్చుతూ, నుదుట చిరు చెమటలు మొలకలెత్తుతూ చూస్తుంటే -

అవును. కలకాదు, నిజమే.

అప్పుడు తన ముఖానికి వెచ్చని వూపిరితగిలింది - కొలిమిలోంచి గాలికి పాకి, సాగి, ముఖానికి సోకిన మంట సెగలా.

అప్పటికే తన వెనకభాగాన్ని రాసుకుంటూ నిల్చున్నాడు హరి.

అప్పుడే అతని తెలనెర్రని రేఖల, తెల్లని అరిచేతులు తన గుండ్రని, నున్నని భుజాల పైభాగాన్ని అదుముతూ.

ఆశ్చర్యంతో, భయంతో, కోరికతో (అయినా వారించాలనుకునే) తటాలున తిప్పిన తన ముఖాన్ని, కాలే అరచేతులతో అదిమి, ముఖమెత్తి, తన పెదవులపై హరి పెదవులు మండుతూ.

ఆనందం, ఒత్తిడి, బరువు, మైమరపు.

కలకాదు, నిజమే. నిజమే.

నిన్న సెగలు కక్కిన ఎర్రనెర్రని మధ్యాహ్నం.

'వాన తగ్గి అంత సేపైనా ఇంకా ఏం చేస్తున్నావే వీధిలో కూర్చుని. ఇంట్లోకిరా!"

అవును. వాన తగ్గింది. రోడ్డుమీద నిలచిన నీటిపై తపతప అడుగులు వేస్తూ పోతున్న మగవారంతా వనజ వేపే చూస్తున్నారు.

లేచి ఇంట్లోకి వెళ్ళబోయింది.

ఎక్కడికో, శూన్యంలోకి దీనంగా పాకిన చూపుల్ని, కళ్ళలోకి మళ్ళీ లాక్కుటుంటే, ఎదురుగా చీర కుచ్చిళ్ళ నెత్తిపట్టుకుని, తనవేపే వస్తున్న సుందరి కనబడింది.

ఆగింది. సుందరిని పలకరించింది. ఒకటి, రెండు మాటలాడి వూరుకుంది. సుందరే చెప్పుకుపోతూంది.

నిన్న వాళ్ళాయన అనుకోకుండా రావడం, మధ్యాహ్నం కారులో నాన్నతోబాటు వాళ్ళాయనా, తనూ సింహాచలం వెళ్ళడం, అక్కడ, ఆయన తెచ్చిన "పోర్నోగ్రఫీ యిన్ కలర్" (Pornography in colour) పుస్తకాన్ని తను ఈసడించినందుకు, అలాటివే కొన్ని బొమ్మలు చాటుగా తీసుకువెళ్ళి సింహాచలం దేవాలయ శిల్పాల్లో చూపడం.

అన్నీ చెప్తోంది సుందరి. వింటూ –

"డబ్బున్నందుకు దేవుడిచ్చిన ఆకాశాన్నీ, భూమినీ, గాలినీ, నీరునీ, నిప్పునీ తద్వారా లభ్యమయ్యే సంపదల్నీ, కొందరే దక్కించుకు సుఖపడుతున్నారనుకొంటున్నా నిన్నాళ్ళూ.

కొందరైనా, డబ్బులేనందుకు, దేవుడు తమకిచ్చిన శరీరంద్వారా పొందాల్సిన ఆనందం పొందలేక పోతున్నారన్న మాట". అనుకుంటోంది వనజ.

ఎంతో మంచి స్నేహితురాలు సుందరి.

అయినా పచ్చమేడ మెట్లుదిగి, గుండెలకి పుస్తకాల దొంతర హత్తుకు వెళ్తుంటే కాలేజీకి, ఆమె నెంత ఈర్ష్యగా చూసేదో, అంతకంటే ఎక్కువ ఈర్ష్యగా చూసింది వనజ సుందరి మంగళసూత్రాలవేపు.

సుందరి మాటల్ని కాస్సేపు ఆపి, తర్వాత "నిన్న సాయంకాలం నుంచీ చూస్తున్నాను. ఎంత దిగులుగా వున్నావు. ఎలా చెప్పాలో తెలీడంలేదు.... అంతా చెప్పాడు నాకు హరి. ఏడ్వాడు కూడా జరిగినదానికి. జరిగిపోయిందేదో జరిగిపోయింది. మర్చిపో" అని అనునయంగా అంది.

"నిజమే. జరిగిపోయిందేదో జరిగిపోయింది. మళ్ళీ జరగదనే నా దిగులు" అనలేక పోయిన వనజ తలూపుతూ నీరసంగా నవ్వింది.

– "విసాకథలు"

'విశాఖ సాహితి' కథాసంకలనం, **7.4.1974**

# మరి, మీకెలా కనబడుతోంది లోకం?

'మంచి' అన్నది లోకంలో లేదని నా నిఖార్సయిన అభిప్రాయం. "ఈ అభిప్రాయానికి ప్రాతిపదిక ఏమిటా?" అని నేనెప్పుడూ ఆలోచించలేదు. అయితే, అనాలోచితంగానే నాకు నేను అర్థమవడం జరిగింది. అదెలా జరిగిందంటే... అది చెప్పేందుకే యీ కథ.

ఎండవేళ ఓ మధ్యాహ్నం ఉస్సురనుకుంటూ ఆ ఊర్లో బస్సుదిగాను. అక్కడికి మా ఊరు సుమారు ఆరు ఫర్లాంగుల దూరం.

పేరుకి మా వూరే గాని అక్కడ నేను పుట్టాలేదు, పెరగాలేదు. అంతెందుకు? నాకు పద్దెనిమిదేళ్ళు నిండేవరకూ, నేనా వూరే పోలేదు.

మరి మా ఊరెందు కయ్యిందీ అంటే, మా కక్కడ పొలాలున్నాయి. చెరువుగట్టు నుంచీ, బోడిమెట్టవరకూ, భూములన్నీ మావేనుట. ఇప్పుడు కాదనుకోండి. మా పూర్వీకుల హయాంలో.

మా తాతగారి కాలం నాటికే మేం పట్నం తరలి వచ్చేసాం. ఏటా ఓ రెండునెలలు ఆ ఊర్లో మకాం వెయడం, కుప్పలు నూర్పించి 'మగతా' కొలిపించుకోడం. ఆ వూరికీ, మాకూ ఉన్న సంబంధమల్లా అదొక్కటే!

కారణాలేవయితేనేం, మా నాన్నగారి తరానికొచ్చేసరికి వో పన్నెండెకరాల పొలం మాత్రం మిగిలింది. మళ్ళీ అందులో కొంత 'బోగబందా'లో వుంది.

నెల్లాళ్ళయింది - నాన్నగారు మా వూరు వెళ్ళి. ఇంకా కుప్పలు నూర్చలేదుట. పట్నంలో నా కేమో డబ్బు ఇబ్బంది లావయింది.

దగ్గరుండి కుప్పనూర్పింపించి, ధాన్యం అమ్మించి, కొంతయినా సొమ్ము తీసికెళ్దామని ప్రయాణం పెట్టుకున్నాను.

'ఎయిర్‌బాగ్' ఊపుకుంటూ గోర్జి ద్దారి పట్టాను. ఎట్టని ఎండకు యిసుక మండుతూ

వుండాలి. కాని దారినపోయే వాళ్ళలో, ఒక రిద్దరికి తప్పించి, ఎవరికీ చెప్పుల్లేవు. పాతదో, చింకిదో, గుడ్డముక్క కట్టుకుని. భుజానో గుడ్డ వేసుకుని నడుస్తున్నారు చాలామంది.

గోర్జికిరువైపులా చేను కొయ్యగా, మొదళ్ళు మాత్రమే మిగిలి వున్న పొలాలు. పొలం గట్లంట మేస్తున్న పశువుల్ని కాపలా కాస్తున్న 'సొమ్ముల గుంటలు.' అక్కడక్కడా 'పోలో'మని కేకలువేస్తూ పోతుల్ని అదమాయిస్తూ, కళ్ళాల్లో చేను మట్టిస్తున్న పాలేళ్ళు.

అన్నీ చూసుకుంటూ చెరువు గట్టెక్కాను. అక్కడ నుంచీ మా వూరు కొంచెం కనబడుతుంది - నాయుడుగారి మామిడితోట వెనకాల్నుంచి.

చెఱువు నిండా నీటిని కప్పేస్తూ తామరాకులు. నీటిలో యీదుతూ వెళ్తున్నారు కొందరు - తామరతూళ్ళకోసం. అక్కడే చాకిరేవు.

వీపు బాటవేపు వుంచి, వయసు నిండా రాని చాకలిపిల్ల, ఎవరిదో ఉతికిన "బ్రాసరీ" తొడుక్కుంటోంది. గూనల్లోంచి వస్తున్న పొగ ఆమెచుట్టూ అల్లుకుంటోంది.

గట్టు దిగువన ఉలిమీద సుత్తి వుంచి, 'పిక్క' కోసం మందుపెట్టి పేల్చిన మెట్ట రాళ్ళను కొడుతున్న వంగిన శరీరాల మీది చెమట బిందువులు ఎండలో తళతళ లాడుతున్నాయి.

పొలంగట్టు పట్టాను. తిన్నగా వెళ్తే మర్రిచెట్టు వస్తుంది. దాన్నానుకునే నాయుడుగారి కళ్ళం. ఆ ప్రక్కనుంచి ఊర్లోకిదారి.

నోట్లో చుట్టపెట్టుకుని చెట్టుకింద కూర్చున్న దండాసి ఆంకమ్మ చుట్టతీసి పలకరించింది. క్షణం చెట్టుక్రింద నిలబడి పరిశీలనగా ఊరినోసారి చూశాను. అన్నాళ్ళ క్రిందట ఎలా వుందో, యిప్పుడూ అలాగే వుంది.

ఊరి మొదట మాలపేట. ఒకదాన్నొక్కటి అంటిపెట్టుకుని, నేలని కరుచుకుని వున్న గుడిసెలు. కొంచెం ఎడంగా, ఆ వాసనే, త్రోవకు రెండువేపులా పూరిళ్ళు. సంసారులయిళ్ళు.

మాలవాళ్ళ గడపలో పాతిక, రైతువారీ యిళ్ళో యాభై, కోమటిదుకాణం, ఊరిమంగలిదొకటి, కంసాలులవో నాలుగైదు పూరిళ్ళు, కలసి మా వూరయ్యాయి.

మరచిపోయాను, వూరి మధ్యగా, దిబ్బమీద, కూలిపోతున్న ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల, సర్కారువారిది వుంది.

ఊరంతటికీ మునుపొక్కటే పెంకుటిల్లుండేది. నాయుడుగారిది. మేం ఎప్పుడిక్కడి కొచ్చినా వారి యింట్లోని గదే ఒకటి కేటాయిస్తారు. ఇప్పుదా పెంకుటిల్లు డాబా అయింది. వరసగా వున్న పూరిళ్ళమధ్య మరో పెంకుటిల్లు లేచింది. నేను గుర్తించిన మార్పులివే.

పశువుల సాల ప్రక్క నుంచి నాయుడిగారింటివేపు నడిచాను. నా పంట్లాం, బుష్షర్టులవేపు, చేతిలోని బ్యాగ్‌వేపు పరిశీలనగా చూస్తూ 'బాగున్నావా?', 'ఇదేనేటి రావడం',

'ఎండ పడొచ్చినవావు. బేగి ఇంట్లోకెల్లు' అంటూ పలకరిస్తున్న వారికి సమాధానంగా చిరునవ్వు నవ్వుతూ మెట్లెక్కి తలుపుతట్టేను.

అమ్మ తలుపు తీసింది. కుశల ప్రశ్నలు కాగానే వచ్చిన పనిచెప్పి, మాటల్లో పడ్డాం.

సాయంకాలమవుతుంటే అలా ఏటివేపు బయల్దేరాను. ఎప్పుడోకాని యీ వూరు రాను. ఎప్పుడొచ్చినా వెంటనే వెళ్ళిపోవాలనుంటుంది.

ఆ మనుషులు, వారి దరిద్రం, అపరిశుభ్రత అన్నీ చికాకు కల్గిస్తాయి.

ఊరి మధ్య పునాదులవరకూ లేచి ఆగిపోయిన రామాలయం, రాజకీయ స్వాతంత్ర్యం సంపాదించి చేతులు కడుక్కున్న దేశాన్ని జ్ఞప్తికి తెస్తుంటుంది.

తప్పదు. ఈ వ్యవస్థ బద్ధలు కావలసిందే అనుకుంటూ నడిచాను. లేకుంటే గోచిపాత కట్టుకుని, నెత్తిన జంగిడి పెట్టుకొచ్చిన కోమటి వైకుంఠం, అప్పుడే అయిదెకరాల భూమి సంపాదించడమేమిటి? రెక్కలు ముక్కలు చేసుకుని, తాత ముత్తాతల నుండి భూమిని సాగుచేస్తున్న 'హరిజనులు' తమకు కేటాయింపైన బంజర్లునుకూడా లోపాయికారీగా అమ్ముకోవడం ఏమిటి?

కాడి ఏనాడు పట్టుకోని నాయుడిగారి కళ్ళం ఒత్తుగావేసిన కుప్పలతో పునిస్త్రీ ముఖంలా కళకళ లాడుతూ వుండగా, ఒళ్ళు విరుచుకుపనిచేసే వారి కంబార్లు కూటికి సరిపడా ధాన్యమైనా ఎరగకపోవడమేమిటి?

ఏటిలో నీరు పాదాలు మునిగే మాత్రమే వుంది. ఏటి ఒడ్డున పనస తోట - అప్పుడెప్పుడో మాదేనుట - కాపుకివస్తోంది. ఆకాశం ఎఱుపు కోల్పోయి, చీకటి చాప క్రింద నీరులా వస్తుంటే, యింటిదారిపట్టాను.

తెల్లారితే కుప్పనూర్పించి సాయంకాలానికి డబ్బు జతపరుస్తానన్నారు నాన్నగారు. ఆగాకరకాయకూర, కొత్తిమీర చారు, చిక్కని మజ్జిగలతో అమ్మపెట్టిన వేడివేడి అన్నం కడుపునిండా తిని నిశ్చింతగా పడుకున్నాను.

తొందర తొందరగా మనుష్యులు పరిగెడుతున్న ధ్వని. గాభరాగా వేస్తున్న కేకలు. 'ఏం జరిగిందా' అన్న భయంతో ఒక్కసారి మెలకువ వచ్చేసింది.

'నాయుడుగారి కళ్ళంలో కుప్పలంటుకున్నాయట్రా నాయనా!' అంది అమ్మ - భయం, ఆదుర్దా నిండిన గొంతుతో. వీధి అరుగుమీద ఖాళీగా వున్న మంచం చూసి, నాన్నగారప్పుడే అక్కడికి వెళ్ళేరనుకున్నాను. చీకటిలో తడువుకుంటూ మెట్లు దిగేను.

ఎంతరాత్రయిందో తెలియదు. ఆకాశంలో ఒకటీ అరా నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఏ మబ్బు మాటున దాక్కున్నాడో చంద్రుడు, అయిపులేదు. శీతవాయువు మాత్రం వీస్తోంది.

ఊరికి దాపునే నాయుడుగారి కళ్ళం. నిదానంగా అడుగులేస్తూ నడిచాను. కళ్ళం చుట్టూ చెట్లు. కాల్తున్న కుప్పల్నుంచి ఎఱ్ఱని మంటలు లేస్తున్నాయి. తెల్లని పొగ దట్టంగా అంతటా ఆవరించి వుంది.

అంతా హడావుడి పడ్తున్నారు. టార్చిలైటు నాలుగు మూలలకివేస్తూ నాయుడు చెప్తున్నాడు "ఇక్కడే మంచం వాల్చుకు పడుకున్నాను. ఎందుకో మెలకువ వచ్చి చూస్తే కుప్పదగ్గర అలికిడయింది. 'ఎవర్రా అది?' అని కేకేస్తే జవాబులేదు. టార్చి తీద్దామని వంగేను. మనిషి పరిగెత్తిన శబ్దం. అటుకేసి పరిగెత్తబోయేసరికి కుప్ప కాలిన వాసన వేసింది. వెంటనే అప్పిగాడిని, భీముణ్ణి, అందరినీ లేపాను" అంతలోనే కాల్తున్న కుప్పవంక నిస్సహాయంగా చూస్తూ కేకలేస్తున్నాడు నాయుడు 'ఆ నంజి కొడుకులు మాలోళ్ళని లేపండ్రా. తొంగున్నా రిల్లల్లో. పరిగెత్తికెళ్ళి బట్టిలోంచి నీరుతెండి' అని.

నిప్పు. నిప్పు నార్పాలంటే నీరు కావాలి. ఊరికి దూరంగా వుంది నుయ్యి. అంతకంటే దగ్గరగా ఏటి నుంచి తీసిన పంట కాలువ పారుతోంది. కడవలు పట్టుకు పరిగెట్టా రటువేపు కొందరు.

కొందరు మండుతున్న కట్టల్ని లాగి దూరంగా విసిరేస్తున్నారు. చేతులతో వాటి మీద దబదబా బాది మంట ఆర్పాలని చూస్తున్నారు.

అంతటా కలియదిరిగి, అందరినీ గదమాయించడమేగాని, తానుగా మంటనార్పడానికి ఏ ప్రయత్నమూ చెయ్యని నాయుడి వేపు చూస్తూ ఎడంగా నిల్చున్నాను –అతనికి లేని బాధ నా కెందుకు.

వెంకన్న, వాడి కుటుంబం, మరికొద్దిమంది మినహా, హరిజనులెవరూ మంటలార్ప డానికి రాకపోవడం తలచుకుంటే మహాముచ్చటేసింది నాకు. ఆరవనీ నాయుడు. మిగతా నాయుళ్ళంతా మంట నార్పాలని అటూ, యిటూ, పరిగెత్తనీ. మాలవాళ్ళెందుకు రావాలి? ఏడాది పొడుగునా ఒళ్ళు మన్ను చేసుకుని కుప్పలు పేర్చి గాదెలు నింపింది చాలక, ఉత్త పుణ్యానికి ఒళ్ళు కాల్చుకోవాలా? వాళ్ళంతా నిశ్శబ్దంగా వినిపించిన విప్లవశంఖంలా తోచింది నాకది.

అప్పుడు చూసాను. మంటల వెలుగులో ఆయన ముఖం ఉద్రేకంతో మెరుస్తోంది. కట్టుకున్న తెల్ల మల్లు పంచె ఎగ్గట్టి, పొడుగు చేతుల తెల్లచొక్కా విసురుగా విప్పేసి, యజ్ఞోపవీతం వెన్నుమీద తెల్లని చారలా వుండగా, కుప్ప లెక్కుతున్న మాష్టార్ని.

తరవాత ఓ పదిహేన్నిమిషాలు అంతటా ఆయన్నే చూసాను, బట్టికి పరిగెట్టి నీళ్ళు మోసుకువస్తూ, కుప్పలమీదకి నీళ్ళందిస్తూ, మంటల్ని కుప్పలెక్కి ఆర్పాలని యత్నిస్తూ, కూడా వున్నవారిని హెచ్చరించి ప్రోత్సహిస్తూ, నలుదిశలా ఆయనే!

ఆయన ప్రతి చర్యా వికృతంగా వుంది. బలహీనమైన శరీరం, అలవాటులేని, చేతకాని పనులు చేస్తూ వుండడం వలన వచ్చిన వికృతత్వమది. అసహ్యం వేసింది. 'ఈ బ్రాహ్మడు – సింగిల్ స్కూల్ టీచర్. నాయుడుగారి ప్రాపుకోసం ఎంత అవస్థ పడుతున్నాడూ' అని. వెంటనే తిరిగి యింటికొచ్చేసాను.

మనసు చిరాకుగా వుంది. అధికారం, ఐశ్వర్యం పాదాలునాకే జాతి మనదనిపించింది.

ఉదయాన్నే తెలివొచ్చింది. ఇంకా ఇంట్లో ఎవరూ లేచినట్టు లేదు. చెంబుపట్టుకుని ఏటివేపు వెల్తుంటే త్రోవలో ఎదురయ్యారు మాష్టారు. ముఖానపిండికట్లు. తడి పంచ భుజం మీద. చేతిలోవున్న రాగిచెంబులో నీళ్ళు. ఏటినుంచి స్నానంచేసి వస్తున్నట్టున్నారు.

తప్పుకు పోదామన్నా కుదిరిందికాదు. కాళ్ళు ఎత్తెత్తివేస్తూ 'ఉస్ ఉస్' అనుకుంటూ నడుస్తున్నారు. చేతిలో బొబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖాన కొత్తగా కాలిన గుర్తొకటి. ఎడంకాలి వేళ్లు రెండింటికి గుడ్డముక్క చుట్టి వుంది. దాని మీద రక్తం మరకలు. 'తగిన పనయింద'నుకున్నాను.

'నాన్నగారు చెప్పారు నువ్వొచ్చావని. చూసావా ఆఖరికెలా అయిందో! ఇవాళ తొలి ఝామున ఆరంభించుదామనుకున్నాడు వెంకన్న నూర్పు. సాయంకాలానికి గాలిపట్టి, బస్తాలకెక్కించి, వైకుంఠం దుకాణానికి వప్పచెప్పి, డబ్బు నీకిద్దామనుకొన్నారు నాన్నగారు. ఏ క్షణాని కేమవుతుందో చెప్పలేం!'

మాల వెంకడే మా పొలాన్ని మగతాకి సాగు చేస్తున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది నాకు. మా వూర్లో మాకు పొలమే కాని కళ్ళంలేదు. ఎప్పుడొచ్చినా నాయుడుగారింట్లో దిగినట్టే, ప్రతి ఏటా పంట వారికళ్ళంలోనే నూరుస్తాడు వెంకన్న.

నా గుండె బేజారైంది. స్ట్రెచ్‌లాన్ పేంటింగ్స్ రెండు తీసుకున్నాను. వాటికి సరిపడే యింపోర్టెడ్ షర్టింగ్స్ సంపాదించి వుంచుకున్నాను. అన్నిటికంటే ముఖ్యం, ఏడాది పొడుగునా జీతం సరిపడక చేసిన అప్పులు తీర్చాలి.

నా ముఖంలో మారిన రంగుల్ని చూసినట్టున్నారు మాష్టారు.

'నీకేం పరవాలేదులే! మిగతా కుప్పలు నూర్పించి వెంకడిచేత మగతా కొలిపిస్తారు నాయుడుగారు. ఒకటో, రెండో పుట్లు తక్కువైతే అవుతాయంతే?

నాకు ధైర్యం వచ్చింది ఆ మాటలతో. పంటపోయినా, కుప్పకాలినా, వెంకన్న మా మగతా కొలవాల్సిందే. ఏమన్నా పేచీపెట్టినా నాయుడుగారున్నారు.

'వేసంగి వచ్చేస్తోంది. కుప్పలట్టేపెట్టకురా అంటే విన్నాడు కాదు ఆ వెంకన్న. ఏడాది పొడవునా పెళ్ళాం పిల్లలతో ఏం తిప్పలు పడతాడో...' అంటూ వెళ్ళిపోయారు మాష్టారు.

అంతవరకూ నాకీ ఊహే రాలేదు!

'ఈ భూమిపగిలి తనలో యిముడ్చుకుంటే బాగుణ్ణు" అని మగవాళ్ళకి అనిపించే క్షణం ఒకటి వుంటే నా జీవితంలో ఆ క్షణం అలాంటిది.

అప్పుడు అకస్మాత్తుగా నాకు నేను బోధపడ్డాను.

నిన్నరాత్రి మంటలార్పడానికి రాని వెంకడి కులస్థులూ బోధపడ్డారు. ఎటొచ్చీ బోధపడనిది మాష్టారే. ఏదో ఒక మోటివ్ లేని మంచితనం వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.

లోకంలో మంచి అన్నది లేదని నా నిఖార్సయిన అభిప్రాయం. ఎందుకంటే నాలో ఆ మంచితనం లేదు కాబట్టి. మంచితనం మీద నాకే నమ్మకం లేక పోబట్టీ - అని ఆ రోజు ఉదయం అలాగ తెలిసింది నాకు.

- ఆంధ్రసచిత్రవారపత్రిక, **24.2.1978**

# కళ్యాణం

సీతకి సిగ్గుగా వుంది.

రాముడికేమో నవ్వొచ్చింది. ఇన్ని యుగాలయింది. లెక్కలేనన్నిసార్లు సీతకీ, తనకీ పెళ్ళయింది. ఒకేసారి అనేకచోట్ల పెళ్ళాడాడు తాను సీతను. ఎప్పుడు, ఎక్కడ, ఎలాటి భక్తు(రాలు)డు కళ్యాణం జరిపించినా కాదనలేదు తామిద్దరూ.

అయినా, ఆ రోజు, జనకుడి కొలువులో, తన మెళ్ళో దండవేస్తూ, తర్వాత పెళ్ళి పీటల మీద ప్రక్కన కూర్చుని, ఎంత సిగ్గు ఒలకపోసిందో, ఇవాళా అలాగే సిగ్గుపడుతూ, తలవాల్చుకు తనని తగిలీ తగలనట్టు కూర్చుంది.

రాముడికి కొంచెం పరవశం కలిగింది కూడాను - జ్ఞాపకాలతో.

మెల్లగా మేలమాడాడు "దేవీ, మన తొలి వివాహవేళ తలుపుకొస్తోందా?" అంటూ.

సీత మాట్లాడలేదు. ఓసారి చూసింది రాముడివంక. ఆ చూపు క్రొత్తగా వుంది. క్షణం రాముడు ఆలోచనలో పడ్డాడు.

ఆలోచనల నాటంకపరుస్తూ, వివాహమంత్రాలు వీనులపడ్డాయి.

U U U

సీతకి కంపరంగా వుంది. ఏమేమో వూహిస్తోంది. తల్లి మనసు తల్లడిల్లుతోంది.

ఊహల్లో అది భద్రాద్రికాదు. అక్కడ ఆలయమూ లేదు. మామూలు పెళ్ళిపందిరి. సుముహూర్తవేళ. జీలకర్ర, బెల్లం ఒకరి తలపైన ఒకరు వుంచుతున్నారు వధూవరులు. చెమ్మగిల్లిన కళ్ళతో చూస్తోంది వధువు తల్లి.

సీత హృదయభారం నిట్టూర్పులో వెల్లడయింది.

తన ఊహనిజం కాదు. వధువు తల్లి బ్రతికి లేదు. బ్రతికి వున్నప్పుడు పెళ్ళి చెయ్యలేక కూతుర్తో అంది. "ఎవరితోనయినా లేచయినాపోరాదా" అని. లేదు. కూతురు లేచి పోలేదు. పెళ్ళికాలేదు. పనిచేసుకు బ్రతుకుతోంది. తల్లి మరణించిన ఏడాదిలోగా సీతారాముల

కళ్యాణం జరిపిస్తే, తల్లికి కన్యాదాన ఫలం దక్కుతుందని. భద్రాద్రికి వచ్చి కళ్యాణం జరిపిస్తోంది.

సీతకి మనసు కలచినట్టయింది. కళ్ళు నీళ్ళతో నిండాయి.

U U U

తలంబ్రాలవేళ. ఇందాకటి సీతాదేవి చూపు మరచిపోయిన రాముడు, హుషారుగా ఆణిముత్యాల తలంబ్రాలు ఆమె తలపై చల్లనారంభించాడు.

తెల్లని ముత్యాలు సీత చేతిలోకి తీసుకోగానే కెంపుల ప్రోవై, తన తలపై పోయగానే తన మేనికాంతులలో నీలపురాశై, చూచువారలకు వేడుక కలగగా, చూడడానికి సిద్ధమయ్యాడు. చూపు సీత దోసిలివేపే నిలిపి వుంచాడు.

చూస్తున్న రాముడికి తాను చూస్తున్నది చూస్తున్నదేనా అన్న భ్రాంతి కలిగిస్తూ, సీత కనుకొలకుల్లోంచి కన్నీటి బిందువొకటి రాలి ఆమె దోసిలిలో అగ్నికణంలా భాసిల్లింది.

రాముడు నివ్వెరపోయాడు. రాత్రి ప్రక్కన చేరి, చెక్కిలి నొక్కుతూ, విషయమేదో తెలుసుకోవాలనుకున్నాడు.

– ఆంధ్రజ్యోతి వారపత్రిక, సంక్రాంతి, **1980**

# ముగింపు

వింటూనే ఉన్నాను.

"వినపడడం లేదు కాబోలు!"

"అవున్లే, ఎలా వినపడుతుంది?"

"అమ్మగారీ లోకంలో ఉన్నట్టు లేరు?"

ఇక వుండబట్టలేక వెనక్కి తిరిగాను.

ఆయన చూపు మరల్చుకొని, పడక్కుర్చీ వేపు నడవసాగారు. అందులో కూర్చుంటే ఆయన ముఖం నాకిక్కడ నుంచీ కనబడదు. వీపు నాకేసి త్రిప్పి ఉంటుంది.

అనబోయిన మాటలు అతికష్టం మీద పెదవులు దాటకుండా ఆపుకోగలిగాను.

పడక్కుర్చీలోంచి "హనుమాన్ చాలీసా" వినబడుతోంది.

ఒళ్లు మండింది. "వచ్చినవాడు భ్రాష్టుడు కాడు. మా కంపెనీలో సేల్స్ ప్రమోషన్ ఆఫీసర్" అన్నాను - ఇందాకటి ఆయన ప్రశ్నకి సమాధానంగా. జవాబు లేదు.

హనుమాన్ చాలీసా క్షణం ఆగి కొనసాగుతోంది. ఏం చెయ్యను. ఈసారి నామీద నాకే మండుకొచ్చింది. ఏడుపొచ్చింది.

వెనగ్గదిలోకి పోబోయాను.

"వాడెందుకవుతాడులే. నిన్ను కట్టుకున్నందుకు నేను భ్రాష్టుడనయ్యాను కాని."

వెనగ్గది గడపవరకూ వెళ్ళేను.

"చూడు! ఆఖరుసారి చెప్తున్నాను. కేంపుల్లో ఎలాగైనా తగలడు. ఇంటిదగ్గర మాత్రం లంజ వేషాలు వేస్తే వూరుకునేది లేదు."

ఛీ. ఛీ. నా బ్రతుకు నాకే అసహ్యమనిపించింది. అలాంటప్పుడెప్పుడూ ఒక దృశ్యమే కళ్లలో మెదుల్తుంటుంది.

మ్రోగుతున్న సన్నాయి, అర్థంకాని మంత్రాలు, కొబ్బరిమట్టల పచ్చదనం. తలపై తలంబ్రాలు, అన్నిటినీ మించి పదకొండేళ్ళమ్మాయి అమాయక ముఖం. అందులో ఉత్సాహం వురకలు వేసే కళ్ళు రెండు.

బ్రతుకంటే బెదురులేని వయసు. పెళ్ళంటే పల్లకిలో వూరేగడం అని మాత్రమే తెలుసు.

మావయ్యకి ముప్ఫయ్ ఏళ్ళని తెలుసు. అంటే ఏమిటో మాత్రం తెలియదు. మామయ్య మొగుడంటేనూ అంతే.

మావయ్యకేం బాగానే ఉంటాడు. ఎప్పుడేనా యింటికొస్తే ఏదో ఒకటి తెస్తాడు - అత్తరో, పన్నీరో. పట్టు జుబ్బా తొడుక్కొని, సెంటు పూసుకుని, ఘుమఘుమలాడుతుంటాడు. ఒకరోజు దొడ్లో బావి దగ్గర దొంగతనంగా పెదవులమీద ముద్దు పెట్టుకుని, కోపంగా చూస్తే ఘెల్లున నవ్వాడు కూడా.

"మావయ్యని పెళ్ళాడుతావుటే!" అని అమ్మమ్మ అడిగితే "ఓ" అంది.

"అలా చెప్పు మీ నాన్నతో. మగవాడికేం లక్ష తిరుగుళ్ళు తిరుగుతాడు. అంతమాత్రాన ఉన్న ఒక్క బావమరిదికీ కూతుర్నియ్యనంటాడా?" అంది అమ్మమ్మ.

అందుకే నాన్న ఎప్పుడూ జ్ఞాపకం వస్తాడు. జీవితంలో వున్న దుఃఖాన్నంతటినీ యిముడ్చుకున్నట్లుండేవి నాన్న కళ్ళు. ఆ కళ్ళు మరపుకురావు. ఎన్నో రాత్రులు - వయసొచ్చాక, బ్రతుకులో కోల్పోయిందేమిటో తెలిసొచ్చాక - చీకట్లోకి చూస్తుంటే, ఆ కళ్ళు కనిపించినట్లుండేవి.

"మావయ్యని పెళ్ళాడుతాను నాన్నా" అంటూ గెంతులేస్తూ వెళ్ళినపుడు, వెనకాలే అమ్మమ్మ, ఆ వెనకాల అమ్మ వున్నప్పుడు, నాన్న ఏం మాట్లాడలేదు. "తల్లీ" అంటూ తల నిమిరాడు. నాన్న కళ్ళు చెమర్చాయో, కన్నీళ్ళు సుళ్ళు తిరిగాయో నాకైతే కనబడలేదు.

"నయమేనమ్మా. బావురుమని ఏడవలేదు నీ మొగుడా మాటవిని" అంది అమ్మమ్మ - తర్వాత అమ్మతో. అమ్మ నవ్వింది. అమ్మ నవ్వు తెలియని భయం కల్గించేది నాకెప్పుడూ.

"మొగుడన్నవాడికి యింత కాఫీ తగలేసే దిక్కులేదు యింట్లో. మిండగాళ్ళొస్తే మట్టుకు అన్ని మర్యాదలూ..." వినదలుచుకోలేదు. ఓపిక చేసుకుని, మంచంమీంచి లేచి, పర్సులోంచి రెండు ఐదురూపాయల నోట్లు తీసి, పట్టికెళ్ళిస్తే, విచ్చుకుంది ముఖం. అదే మిగిలిన సంబంధం యిద్దరి మధ్యా. ఇల్లూ, వొళ్ళూ గుల్లైన తర్వాతే ఈ సంబంధమైనా ఏర్పడింది.

"పదారు నా వయ్యసు" అనుకోకుండానే వేవిళ్ళు మొదలయ్యాయి. నాన్న కళ్ళలో ఏమూలో కాసింత వెలుగు తళుక్కుమంది.

కానీ పుట్టిన పిల్లని చూడగానే అమ్మ నవ్వు కూడా మాయమైంది.

ఆ పిల్ల చచ్చిపుట్టడమే అందరికీ ఉపశాంతి కలిగించింది.

నవ్వడం మరిచిపోయిన అమ్మలో అప్పుడు కనబడింది అమ్మ. నాన్నకూ భార్య అప్పుడే దొరికి ఉంటుంది.

అమ్మగా మారిన అమ్మ ఒంటినున్న రోగం వదిలేటట్టు చెయ్యగలిగింది. ఇంట్లో ఉండే మెట్రిక్ పరీక్ష పాసయ్యేందుకు వీలు కలిగించింది.

యాభయ్యేళ్ళొచ్చి, ఆస్తిపోయి, ఆరోగ్యం అంతకుముందే పోయి "మొగుడు" యింటి కొచ్చేసరికి, యిద్దరినీ ఆదుకొనేందుకు సబ్బుల కంపెనీ "సేల్స్ అసిస్టెంట్" ఉద్యోగం ఒక్కటే మిగిలింది. ఈ ఉద్యోగంలో పదిమందితోనూ పరిచయాలు తప్పవు. నెలకో ఇరవై రోజులన్నా

వూళ్ళంట తిరగక తప్పదు. ఇంటిలో ఉన్న కొద్దిరోజులూ ఆయన అంటగట్టే రంకులు తప్పవు.

ముప్ఫయ్మూడేళ్ళొచ్చినా పచ్చిగా ఉన్న నా యౌవనంవేపు మగాళ్లు లోభంగా చూడడం తప్పదు. ఉద్యోగం కారణంగా నన్నూ ఒక "వెలవున్న వస్తువు"గా ఎంచి, "రేటెంత" అన్న ధోరణిలో మాట్లాడే సరసాలూ తప్పవు. లాడ్జ్లో ఉండాల్సొచ్చినపుడు ప్రశ్నార్థకాలూ, ఆశ్చర్యార్థకాలూ, అర్థమయిందన్నట్లు నవ్వులూ, ఏవీ తప్పవు.

ఇంటికొస్తే చెయ్యనివన్నీ చేసినట్టు రంపపుకోత కొయ్యడం తప్పదు.

అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు "ఎందుకీ కాపాడుకోవడం" అని. ఆయన అంటున్నట్టే "ఒకసారి" చేస్తే అని. ఎప్పుడో మరచిపోయిన అనుభవం "ఆ చేదు" లేకుండా మరోసారి, మరోసారి పొందితే అని.

ఒంటరి రాత్రి. చుక్కలు. పాడే పిట్టలు. ఎదుర్రొమ్మున ఏదో బాధ.

ఒళ్ళు నిమిరేగాలి. చచ్చి పుట్టిన నా బిడ్డ.

నాన్న కళ్ళు. అమ్మ నవ్వు.

నా మీద నాకే దుర్భరమైన జాలి కలుగుతుంది. కోర్కేదోపుట్టి గుండెల్ని పిండుతుంది. చేతివేళ్ళ సందుల్లోంచి జీవితం జారిపోతున్నట్టు బాధ! నా నిట్టూర్పుతో వెన్నెల అంటుకుంటుంది.

తలుపు చేరేసుకు వెళ్ళేరాయన. తలుపు తోసిన శబ్దమైతే హోటల్ నుంచి ఆయనే తిరిగొచ్చారనుకున్నాను.

ఆయన కాదు, "అహల్యగారూ!" అన్న గొంతు మా కంపెనీ సేల్స్ ప్రమోషన్ ఆఫీసర్ది. ఎప్పుడూ ఇతరులెవ్వరినీ ఆ వెనగ్గదిలోకి రానియ్యను. మరి ఏమాలోచిస్తున్నానో... మంచంమీద పడుకునే "ఏం మళ్ళీ వచ్చారు? లోపలికి రండి" అన్నాను.

మంచంమీద ఆ భంగిమలో పడుకుని ఉన్న నన్ను చూడగానే మరచిపోయి నట్టున్నాడాయన మళ్ళీ ఎందుకొచ్చాడో. ఇంకేదో అవసరమేర్పడినట్టు తెలుస్తూనే ఉంది.

నవ్వాను. కావాలనే చెయ్యిచాపి మంచంమీద కూర్చోబెట్టానో లేదో చెప్పలేను.

✪ ✪ ✪

భావన్నారాయణ హోటల్ నుంచి ఇంటికి తిరిగొచ్చేసరికి, గదిలోని బల్లమీది "బేగ్" మొదటగా అతడి దృష్టి నాకర్షించింది.

నిశ్శబ్దంగా రెండడుగులు వేసి, వెనగ్గది కిటికీలోంచి మంచంకేసి ఓసారి చూసి, వెనుదిరిగి, ముందుగది తలుపు శబ్దం కాకుండా చేరవేసి, వీధిలోకి వచ్చాడు. మోయలేని బరువు దింపుకున్నవాడిలా చులాగ్గా అడుగులేస్తూ బీచ్ వేపు నడిచాడు.

**- ఆంధ్రజ్యోతి వారపత్రిక, 9.5.1980**



# రచయిత పరిచయం

జననం : విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి పట్టణంలో, 12.2.1946 న (స్కూల్ సర్టిఫికేట్ ప్రకారం)

చదువు : తెలుగు ఎమ్.ఎ

ఉద్యోగం : మొదట విశాఖపట్నం పోర్టుట్రస్ట్‌లో, తరువాత కేంద్ర కార్మిక విద్యాసంస్థలో ఆపై కార్మిక రాజ్యభీమా సంస్థలో. ఆ సంస్థ పూణే కార్యాలయ డైరెక్టర్‌గా 28.2.2006 న పదవీ విరమణ.

**సద్యోగం:**

- విశాఖపోర్టు ఎంప్లాయీస్ యూనియన్ క్రియాశీలక సభ్యునిగా,
- “విశాఖసాహితి”, విశాఖపట్నం వ్యవస్థాపక కార్యదర్శిగా,
- “సాహితీవేదిక”, రాజమహేంద్రి, వ్యవస్థాపక సమావేశకర్తగా,
- గోదావరీ అసోషియేషన్ ఆఫ్ పర్సనల్ మేనేజిమెంట్ కార్యదర్శిగా,
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, గోదావరిశాఖ, వ్యవస్థాపక కార్యదర్శిగా,
- ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, మరియు భారతీయ విద్యాభవన్ నిర్వహించిన పీ.జీ. డిప్లొమా ఇన్ పర్సనల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్ వెల్ఫేర్ కోర్సులకు గౌ॥ఉపన్యాసకునిగా
- ఆలిండియా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫీసర్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్‌గా / ఉపాధ్యక్షునిగా
- సోషల్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఒరిస్సా చాప్టర్ వ్యవస్థాపకునిగా
- పాషాణ్, (పూణే) తెలుగు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా

ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు (ఒరిస్సా మాజీ గవర్నర్) కీ.శే.గోపాలన్ రామానుజమ్ వ్రాసిన ఆంగ్ల పుస్తకము TOWARDS A NEW CULTURE IN INDUSTRIAL RELATIONS కు **“కలసి సాగుదాం”** పేరిట నేను చేసిన తెలుగు అనువాదం ప్రచురితమైంది.